

రాయితీపై పశువుల షెడ్లు

గొర్రెలు, మేకలు, పౌల్ట్రీలకు కూడా..

ఉపాధి నిధులతోనూ పథకం అనుసంధానం

పశుసంవర్ధకశాఖ ద్వారా లబ్ధిదారుల ఎంపిక

విధివిధానాలపై అధికారులతో ఆశాఖ డైరెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

గత టీడీపీ కాలంలో గోకులం పేరుతో అమలు..

వైసీపీ వచ్చాక నిర్లక్ష్యం

పాడి పరిశ్రమపై పగబట్టినట్లుగా వైసీపీ..

గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో పశుసంరక్షణకు పెద్ద పీట వేసింది. పశువైద్యం, రుణాలు ఇచ్చి గేదెల కొనుగోలు, వ్యాక్సినేషన్ వంటి వాటితో పాటు పశుసంరక్షణ కోసం భారీ షెడ్ల నిర్మాణం చేపట్టింది. గోకులం పేరుతో పెద్దవి, మినీగోకులం పేరుతో చిన్నవి సుమారు రూ.9కోట్లతో 500లకుపైగా చేపట్టారు. వాటిలో 90 శాతం నిర్మాణాలు ప్రారంభించి సగం వరకు పూర్తిచేశారు. అలాగే ఊరూరా పశుగ్రాస క్షేత్రాల పేరుతో పెద్దఎత్తున గడ్డి పెంపకం చర్యలు చేపట్టారు. కాగా వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పథకాలను అటకెక్కించింది. గోకులాలు నిర్మించుకున్న వారికి కూడా డబ్బులు చెల్లింపు చేయలేదు. పాడి పరిశ్రమను, పశుసంరక్షణను నిర్లక్ష్యం చేసింది. పశుబీమా పథకాన్ని, మొబైల్ వైద్య సేవలను ఆర్భాటంగా ప్రకటించినా ఆచరణలో పశుపోషకులకు అవి అందిన దాఖలాలు లేవు.

తారల తళుక్కు



ఒంగోలులో ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా గురువారం సినీ హీరోయిన్లు శ్రీలీల, సంయుక్తమీనన్ సందడిచేశారు. వీరిని చూసేందుకు జనం ఎగబడ్డారు.

మంచిరోజులొచ్చాయ్!



అధికారంలోకి వస్తూనే దృష్టి

తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి రాగానే పశుసంరక్షణపై దృష్టిసారించింది. తొలినెల రోజులు గడిచేలోపే పాడి రైతులకు ఉపకరించే పథకాలకు శ్రీకారం చుట్టింది. పశువులతో పాటు గొర్రెలు, మేకలు, పౌల్ట్రీ షెడ్ల నిర్మాణాలు చేపట్టాలని సంకల్పించింది. అందుకు సంబంధించి ఈనెల 1నే సంబంధిత మంత్రి కే అచ్చెన్నాయుడు ఉత్తర్వులు ఇవ్వగా పూర్తిస్థాయి విధివిధానాలు తాజాగా వెల్లడయ్యాయి. వాటి అమలుపై పశుసంవర్ధక శాఖ అధికారులతో ఆ శాఖ డైరెక్టర్ అమరేందర్‌రావు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పశువుల షెడ్లను మూడు విభాగాలుగా విభజించారు. గరిష్ఠంగా ఆరు గేదెల కోసం నిర్మించే షెడ్లకు రూ.2.30లక్షలు మంజూరు చేయనున్నారు. అందులో కేవలం పదిశాతం మాత్రమే లబ్ధిదారుడు చెల్లిస్తే మిగిలిన 90శాతం నిధులను ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ప్రభుత్వం సమకూర్చనుంది. అదే నాలుగు గేదెలకు అయితే రూ.1.85 లక్షలు, రెండు గేదెలకు అయితే రూ.1.15 లక్షలుగా యూనిట్ విలువగా నిర్ణయించారు.


పాడి రైతులకు శుభవార్త

పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులకు మంచిరోజులొచ్చాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే వారి సంక్షేమంపై దృష్టిపెట్టింది. మొదటిగా భారీ రాయితీపై వారికి షెడ్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు అధికారులకు ఆదేశాలు అందాయి. దీనిపై కసరత్తు మొదలైంది. ఎప్పట్నుంచో ఆశగా ఎదురుచూస్తున్న పాడిరైతులకు ఇక 90శాతం రాయితీపై షెడ్లు నిర్మించేందుకు అంతా సిద్ధం చేస్తున్నారు. పశుసంవర్ధక శాఖ లబ్ధిదారులను ఎంపిక చేయనుండగా, డ్వామా ఆధ్వర్యంలో మంజూరు, నిర్మాణం వంటివి చేపడతారు. ఉపాధి హామీ పథకం నిధుల అనుసంధానంతో పథకం అమలుకానుంది. మూడు విభాగాలుగా షెడ్లను నిర్మించనున్నారు.

ఒంగోలు, జూలై 18(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వకాలంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన పశుసంవర్ధక శాఖపై ప్రస్తుత తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. పాడి రైతులతో పాటు గొర్రెలు, మేకల పెంపకం దారులు, పౌల్ట్రీ రంగంపై ఆధారపడిన వారికి శుభవార్త ప్రకటించింది. ఆయా వర్గాల రైతులకు భారీ రాయితీపై షెడ్ల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉపాధి పథకం నిధులు అనుసంధానంతో ఈ షెడ్లను నిర్మించనున్నారు.

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఎంపిక..

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో కానుండగా షెడ్లు మంజూరు, నిర్మాణం ఇతరత్రా అంశాలు ఉపాధి పథకం పర్యవేక్షించే డ్వామా పరిధిలో జరగనున్నాయి. ప్రాథమికంగా పశుసంవర్ధకశాఖ అధికారులు ఇందుకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ అమరేందర్‌రావు సోమవారం సాయంత్రం అన్ని జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ బేబీరాణి, ఐసీడీపీ మేనేజర్ సీహెచ్ వెంకట్రామిరెడ్డి, పలువురు ఇతర ఆ శాఖ అధికారులు పాల్గొన్నారు.



జీవాల పెంపకందారులకు కూడా...

గొర్రెలు, మేకలకు సంబంధించి చూస్తే 20 గొర్రెలకు రూ.1.30 లక్షలు, 50 గొర్రెల కోసం రూ.2.30లక్షలు, పౌల్ట్రీ షెడ్లకు రూ.87వేలు, అదే 100కు అయితే రూ.1.32 లక్షలుగా ఒక్కో యూనిట్‌ను నిర్ణయించారు. పశువుల షెడ్లకు లబ్ధిదారులు 10శాతం చెల్లిస్తే సరిపోనుండగా మిగతా వాటికి 30శాతం వాటా చెల్లించాలి. ఆ మేరకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వగా లబ్ధిదారులకు అవగాహన కల్పించి వారిని ఎంపిక చేసే బాధ్యతను పశుసంవర్ధకశాఖ అధికారులపై పెట్టింది. సంబంధిత అంశాలను సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో డైరెక్టర్ అమరేందర్ రావు ఆ శాఖ అధికారులకు వివరించారు.

ఏకేయూ ఇన్‌చార్జి వీసీగా మూర్తి



ఒంగోలు(విద్య), జూలై 18 : ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా ఆంధ్రా యూనివర్సిటీ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ పేరుతో ప్రభుత్వ కార్యదర్శి సౌరభ్ గౌర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ వైస్ చాన్సలర్‌గా పనిచేస్తున్న జేఎన్‌టీయూ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి జూన్ 30న తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామాను గవర్నర్‌కు పంపడంతో ఆయన ఆమోదించారు. దీంతో ఏకేయూ ఇన్‌చార్జి వీసీగా డీవీఆర్ మూర్తి నియమితులయ్యారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు జీతాలు జమ

ఒంగోలు(విద్య), జూలై 18 : సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టులో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు గురువారం వారి బ్యాంకు ఖాతాలకు జమయ్యాయి. ప్రాజెక్టు పరిధిలో 1,350 మంది అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు. వీరికి మే, జూన్ జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ రెండు నెలల జీతాల చెల్లింపునకు సమగ్ర శిక్ష ప్రాజెక్టు రాష్ట్ర కార్యాలయం రూ.5.95 కోట్లు విడుదల చేసింది. బుధవారం మొహర్రం సెలవు అయినప్పటికీ కార్యాలయ సిబ్బంది పనిచేసి బిల్లులు సిద్ధం చేయడంతో గురువారం ఉద్యోగుల బ్యాంకు ఖాతాలలో జీతాలు జమయ్యాయి.



కొత్తపట్నంలో అసంపూర్తిగా నిలిచిపోయిన సిమెంటు రోడ్ల మధ్య నిలిచిన నీరు

గత పాలకుల పాపం.. జనానికి కష్టం!

కొత్తపట్నంలో అసంపూర్తిగా సీసీరోడ్డు నిర్మాణం

నిధులు లేకుండానే పనులు చేపట్టి మధ్యలో నిలిపేసిన అధికారులు

రాకపోకలకు నిత్యం నరకయాతనే

చిన్నపాటి వర్షానికే రొచ్చురొచ్చుగా...

పూర్తిచేయకుండానే మట్టితోలారు

నిత్యం చోటుచేసుకుంటున్న ప్రమాదాలు

కొత్తపట్నం(ఒంగోలునగరం), జూలై 18: అధికారుల అనాలోచిత నిర్ణయం.. ఓట్ల కోసం వైసీపీ నేతల కుట్ర... ఫలితంగా ఆ రోడ్డు పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. ఎన్నికలకు ముందు విశాలమైన రోడ్డును కొత్తపట్నంలో నిర్మిస్తామని హడావుడిగా పనులు ప్రారంభించారు. ఎన్నికల అనంతరం పనులను వదిలేసి పలాయనం చిత్తగించారు. దీంతో కొత్తపట్నం నడిబొడ్డులో నిత్యం రద్దీగా ఉండే ఆ రోడ్డు రాకపోకలకు పూర్తి అవరోధంగా మారింది. నాటి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఎన్నికల స్టంట్‌గా ఈ రోడ్డు పనులను వాడుకున్నారు. తగినన్ని నిధులు లేకుండానే డబుల్ రోడ్డు నిర్మాణ పనులను హడావుడిగా డిజైన్ చేసి అధికారులు చేపట్టారు. కొత్తపట్నంలోని జడ్పీపాఠశాల నుంచి ఊరి చివరి వరకు డబుల్ సిమెంటు రోడ్డు పనులను మొదలుపెట్టారు. డైవైడర్‌తోపాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని ఎన్నికలకు నెలరోజుల ముందు ఆర్భాటంగా ప్రారంభించారు. ఇందుకోసం పెద్ద భవనాలను సైతం కూల్చేశారు.

డబ్బు లేకుండానే పనులు...

ఈ రోడ్డు నిర్మాణంలో ఆనాటి ఎమ్మెల్యే బాలినేని ఆదేశాలతోనే ఆర్‌అండ్‌బీ అధికారులు నిధులు తగినన్ని లేకుండానే పనులు చేపట్టారు. పూర్తిచేయకుండా మధ్యలో నిలిపివేసి నేడు ప్రజలు పడుతున్న అవస్థలకు కారణమయ్యారు. మండల కార్యాలయాల నుంచి హైస్కూలు వరకు తారు రోడ్డు, అంబేడ్కర్ నగర్ నుంచి నల్లూరి గార్డెన్స్ మీదుగా పల్లెపాలెం వరకు తారు రోడ్డును ప్రతిపాదించారు. తొలుత పంపిన ప్రతిపాదనల మేరకు రూ.2.70 కోట్లు మంజూరయ్యాయి. పాత డిజైన్‌లో గ్రామం మధ్యలో నిర్మించాల్సిన సిమెంటు రోడ్డులో డివైడర్ లేదు. రోడ్డును వెడల్పు చేసి డివైడర్ ఏర్పాటు చేయాలనుకుంటే ఆర్‌అండ్‌బీ అధికారులు డిజైన్ మార్చి ప్రభుత్వానికి ప్రతిపాదనలను మళ్లీ పంపి నిధులు విడుదలయ్యాక పనులు చేపట్టాల్సి ఉంది. అలా చేయకుండా ఎన్నికలకు ముందు హడావుడిగా శంకుస్థాపన చేయించి పనులను ప్రారంభించారు. ఈ రోడ్డును పూర్తి చేసి కొత్తపట్నం రూపురేఖలు మార్చుతామంటూ బాలినేని ఊదరగొట్టేశారు. నిధులు లేక మధ్యలోనే ఆపేశారు. దీంతో రెండు నెలలుగా కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ నుంచి అంబేడ్కర్ నగర్ వరకు ట్రాఫిక్ నిత్యం నిలిచిపోతూనే ఉంది.

వైసీపీ శ్రేణులే కూల్చేశాయి

అధికారులు లేకుండానే వైసీపీ కార్యకర్తలు, స్థానిక నాయకులు మూకుమ్మడిగా రోడ్డుపక్కన ఉన్న భవనాలను కూల్చేశారు. ఆక్రమణలను తొలగిస్తున్నామంటూ పార్టీ నాయకులే దొమ్మీగా పోయి భారీ కట్టడాలను కూల్చేశారు. అయితే తర్వాత పనులు చేపట్టి ఎన్నికల కౌంటింగ్ అయిన వెంటనే అర్ధంతరంగా ఆపేశారు. కొత్తపట్నం గ్రామం మధ్యలో రెండు వైపులా సిమెంటు రోడ్లు వేసి మధ్యలో డివైడర్ ఏర్పాటు చేయాల్సిన ప్రాంతంలో ఖాళీగా వదిలేశారు. ఇదేంటని అడిగితే నిధులు లేవు అంటూ ఆర్‌అండ్‌బీ అధికారులు సమాధానమిస్తున్నారు. అటూఇటూ వేసిన సింగిల్ సిమెంటు రోడ్డు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వీటి మధ్యలో చెరువు బంక మట్టి పోశారు. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ మట్టి జారిపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. కొందరు వాహనదారులు పడిపోయారు కూడా. రెండు రోడ్లకు మధ్యలో వాన నీరు నిలబడి దోమల వ్యాప్తికి కారణమవుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న వానలకు కొత్తపట్నంలోని మండల కార్యాలయాల సముదాయం నుంచి బీచ్ రోడ్డులో నల్లూరి గార్డెన్స్ వరకు రోడ్డు బురదతో రొచ్చురొచ్చుగా మారింది. బంక మట్టి కావటంతో వాహనాలు జారిపోయి రోజులో పదికిపైగా ప్రమాదాలు జరుగుతున్నాయి.



అన్నక్యాంటీన్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే జనార్దన్

పేదల ఆకలి తీరుస్తాం

త్వరలో అన్నక్యాంటిన్లు ప్రారంభం

ఐదేళ్ల సైకో పాలనలో మునిసిపాలిటీలు అస్తవ్యస్తం

ఒంగోలులో ఆ శాఖ మంత్రి నారాయణ



పోతురాజు కాలువను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే జనార్దన్

ఎన్నెస్పీ కెనాల్‌ను పూడ్చి ఏర్పాటుచేసిన తూము

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 18: పేదల ఆకలి తీర్చేందుకు తక్కువ ధరకే నాణ్యమైన భోజనం అందజేస్తామని రాష్ట్ర పట్టణ, పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన ఒంగోలులో పర్యటించారు. ఎమ్మెల్యే జనార్దన్‌తో కలిసి నగరంలోని అన్నక్యాంటీన్లను, పోతురాజు కాలువను పరిశీలించారు. తొలుత పోతురాజు కాలువ, అనంతరం పవర్ ఆఫీస్, కొత్తపట్నం బస్టాండ్ సెంటర్, కలెక్టరేట్ ఎదురు ఉన్న అన్న క్యాంటీన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సైకో పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తం చేశారన్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీలు అధ్వానంగా మారాయని చెప్పారు. సీఎం జగన్‌మోహన్ టీడీపీపై కక్షసాధింపు చర్యలు చేపట్టారన్నారు. పేదవారు ఏం పాపం చేశారని అన్న క్యాంటీన్లను తొలగించారని ప్రశ్నించారు. త్వరలోనే తిరిగి అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించేందుకు సీఎం కసరత్తు చేస్తున్నారని తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు. గడిచిన ఐదేళ్లలో కనీసం కాలువల్లో పూడికతీత కూడా తీయలేదని, దాని ద్వారా మురుగు సమస్య నెలకొని డయేరియా కేసులు పెరిగాయన్నారు. ముందుగా పారిశుధ్యం మెరుగు, మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగు కోసం రాష్ట్రంలో కాలువ పూడికతీత పనులకు రూ.50 కోట్లు నిధులు కేటాయించినట్లు తెలిపారు.

కాలువ ఆధునికీకరణకు నిధులు : జనార్దన్

ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ పోతురాజు ఆధునికీకరణకు టీడీపీ హయాంలో రూ.89కోట్లు నిధులు మంజూరు కాగా, వైసీపీ ప్రభుత్వం మూడుసార్లు రివర్సు టెండర్లు పిలిచినా వైసీపీ నేతలు పనులు పూర్తి చేయలేకపోవడంతో ఆ పనులు రద్దయ్యాయన్నారు. నగరంలో డ్రైనేజి వ్యవస్థ మెరుగుపడాలంటే పోతురాజు బాగు అవసరం అన్నారు. అందుకోసం మళ్లీ డీపీఆర్ తయారుచేసి, అవసరమైన నిధులను కోరతామని చెప్పారు. అలాగే నగరంలో మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరుస్తామని స్పష్టం చేశారు. నగర సుందరీకరణకు నిధులు అవసరమని తెలిపారు. గత వైసీపీ పాలనలో రాష్ట్ర ఖజానా ఖాళీచేసి, పట్టణాలను అస్తవ్యస్తం చేశారన్నారు. దశల వారీగా నగర అభివృద్ధి కోసం అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలపై కమిషనరు ఎం. జశ్వంతరావు, ఎంఈ జానీబాషాను అడిగి తెలుసుకున్నారు.

నగర అభివృద్ధికి నిధులు కోరిన మేయర్

ఒంగోలు నగరంలో పలు అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరుచేయాలని మేయర్ గంగాడ సుజాత మంత్రి నారాయణను కోరారు. గురువారం మంత్రిని స్థానిక కొత్తపట్నం బస్టాండ్ వద్ద ఆమె కలిశారు. ఈ సందర్భంగా మేయర్ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే జనార్దన్‌తో మాట్లాడారు. నిధుల విషయమై ప్రస్తావించగా ఐదేళ్లలో ఖజానా మీ పార్టీనే ఖాళీ చేసింది.. ఆ విషయం మీకూ తెలుసు అని చమత్కరించారు. నిధులు రాబడి, సౌలభ్యతను బట్టి పరిశీలిస్తామని మంత్రి తెలిపారు.

జిల్లావాసులకు ఊరట

తాగునీటి అవసరాల కోసం సాగర్ జలాలు విడుదల

రెండు రోజుల్లో జిల్లాకు చేరే అవకాశం

ఒంగోలు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాగునీటి ఎద్దడితో ఇబ్బందిపడుతున్న ప్రజానీకానికి కాస్తంత ఊరట కలగనుంది. తాగునీటి అవసరాల కోసం సాగర్ డ్యామ్ నుంచి బుధవారం జలాలను విడుదల చేశారు. రెండు రోజుల్లో అవి జిల్లాకు చేరే అవకాశం ఉంది. జిల్లాలో తాగునీటి అవసరాలు తీర్చే ప్రధాన వనరు సాగర్ నీరు కాగా గత ఏడాది డ్యామ్ నిండకపోవడంతో సక్రమంగా నీటి సరఫరా కాలేదు. దాదాపు ఏడాదిన్నరగా అరకొరగానే నీటి విడుదల జరుగుతుంది. దీంతో ఒంగోలు నగరంతో పాటు మార్కాపురం, కనిగిరి, పొదిలి, దర్శి వంటి ప్రధాన పట్టణాలు వందలాది గ్రామాల్లో నీటికి జనం ఇబ్బందిపడుతున్నారు. ఎప్పటికప్పుడు ఆయా నీటి వనరులైన రామతీర్థం రిజర్వాయర్‌తోపాటు ఇతర ఎస్ఎస్ ట్యాంకులు, సాగర్ కాలువల ఆధారిత చెరువులు అడుగంటిపోతున్నాయి. గత మే నెలలో అరకొరగా డ్యామ్ నుంచి నీటిని ఇవ్వగా ప్రస్తుతం కూడా రామతీర్థం ఇతర వనరులలో నీరు డెడ్‌స్టోరేజీకి చేరింది.

స్పందించిన కేఆర్ఎంబీ

సాగర్ కుడి కాలువ పరిధిలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోనూ ఇలాంటి పరిస్థితే ఉండటంతో నాలుగు రోజుల క్రితం జరిగిన కేఆర్ఎంబీ సమావేశంలో ప్రభుత్వం ఈ విషయాన్ని ప్రముఖంగా చర్చకు పెట్టి తక్షణం కుడి కాలువకు ఐదు టీఎంసీల నీటి విడుదల చేయాలని కోరింది. దీనిపై కేఆర్ఎంబీ స్పందించి ఇచ్చిన ఆదేశాలతో బుధవారం డ్యామ్ నుంచి కుడి కాలువకు నీటిని విడుదల చేశారు. కుడికాలువ పరిధిలోని నాలుగు జిల్లాలకు తొమ్మిది రోజుల పాటు 4.50 టీఎంసీల నీరు డ్యామ్ నుంచి బుగ్గవాగుకు చేరుతుండగా అక్కడి నుంచి శుక్రవారం దిగువకు ఇవ్వనున్నారు. జిల్లాలోని రామతీర్థంకు నీరు చేరేలా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు ఆదివారం జిల్లా సరిహద్దుకు ఆ నీరు రానుంది. కాగా ఒంగోలు ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోని వనరులకు 2 టీఎంసీలు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుండగా అందులో అర టీఎంసీని బాపట్ల జిల్లాలోని చెరువులకు, ఒక టీఎంసీ నీటిని రామతీర్థం రిజర్వాయర్‌కు చేర్చి మిగిలిన అర టీఎంసీ నీటిని రామతీర్థం ఎగువ ప్రాంతంలో ఉన్న ట్యాంకులు, అలాగే సాగర్ కాలువ ఆధారంగా జిల్లాలో ఉన్న 70కిపైగా చెరువులను నింపేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు నీరు వృథాగా పోకుండా వనరులకు నింపడంపై ఇరిగేషన్ ఎస్ఈ నాగ మురళీ మురళీమోహన్ గురువారం ఎన్నెస్పీ ఈఈ, డీఈలతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.



విడుదలైన సాగర్ జలాలు

ఘనంగా డొక్క సీతమ్మ క్యాంటీన్ ప్రారంభం



అన్నదానం ప్రారంభిస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల, డాక్టర్ ఉగ్ర

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 18 : ఆంధ్రుల అన్నపూర్ణ డొక్క సీతమ్మ స్ఫూర్తితో, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్ ఆశయ సాధనలో భాగంగా జనసేన నాయకుల ఆధ్వర్యంలో స్థానిక కొండయ్య బండకు వీధిలో అన్నదాన క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. దీనిని గురువారం ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అతిథులు అభినందించారు. డొక్క సీతమ్మ స్ఫూర్తితో పేదల ఆకలి తీర్చడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు జడ బాలనాగేంద్ర, కార్పొరేటర్ మలగా రమేష్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ప్రజాప్రతినిధులు

ఒంగోలు(క్రైం), జూలై 18: నూతనంగా బాధ్యతలు చేపటిన ఎస్పీ ఏఆర్.దామోదర్‌ను తన కార్యాలయంలో గురువారం పలువురు ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేలు బీఎస్.విజయకుమార్, ఉగ్రనరసింహారెడ్డిలు వేర్వేరుగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, తెలుగుదేశం పార్టీ నాయకులు దామచర్ల సత్యలు మర్యాదపూరకంగా ఎస్పీని కలిసి బొకేలు అందజేశారు. ఆయా నియోజకవర్గాల్లో నమోదైన అక్రమ కేసులు గురించి ఎస్పీకి వివరించినట్లు తెలిసింది.

సింగరాయకొండ గ్రామ పంచాయతీ జూనియర్ సహాయకుడు సస్పెన్షన్

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 18 : సింగరాయకొండ గ్రామ పంచాయతీ జూనియర్ సహాయకుడు సీహెచ్.విజయకృష్ణపై సస్పెన్షన్ వేటు వేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీ రికార్డులను అప్పగించకుండా గైర్హాజరు కావడంతోపాటు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సస్పెండ్ చేశారు. విజయకృష్ణ ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఈ ఏడాది జనవరి 16వతేదీ నుంచి రికార్డులు అప్పగించకుండా గదికి తాళాలు వేసి అనధికారింగా విధులకు గైర్హాజరయ్యారు. ఈ ఉత్తర్వులు అమలులో ఉన్నంతవరకు డీపీవో అనుమతి లేకుండా సింగరాయకొండ పంచాయతీ విడిచి వెళ్ళకూడదని పేర్కొన్నారు.

డీఎల్‌పీఈవోలకు షోకాజ్ నోటీసు

సింగరాయకొండలో దుర్వినియోగమైన నిధుల విషయంలో విచారణాధికారులు నివేదిక సక్రమంగా ఇవ్వకపోవడంతో ఒంగోలు, కనిగిరి డివిజనల్ పంచాయతీ అధికారులకు షోకాజ్ నోటీసును డీపీవో ఉషారాణి అందజేశారు. గ్రామపంచాయతీలో సాధారణ నిధులు రూ.13,91,071, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.32,77,732 లక్షలకు సరైన రికార్డులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా డ్రా చేయడంలో సర్పంచ్ టి.వనజ ప్రమేయంపై నివేదికలో ప్రస్తావించలేదు. కేవలం పంచాయతీ కార్యదర్శి, జూనియర్ సహాయకులను బాధ్యులను చేస్తూ విచారణాధికారులుగా నివేదిక సమర్పించారు. ఈ నివేదికలపై సింగరాయకొండకు చెందిన జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అయినాబత్తిన రాజేష్ ఆక్షేపణలు వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. విచారణ నిర్వహించడంలో, నివేదికలు సమర్పించడంలో నిబంధనల మేరకు వ్యవహరించకపోవడంతో ఈ నోటీసులు జారీచేశారు. మూడు రోజుల్లో నోటీసుకు వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

వ్యవసాయాధికారి దాతృత్వం



ఎమ్మెల్యే దామచర్లకు నగదు అందజేస్తున్న వెంకట్రావు

నాగులుప్పలపాడు, జూలై 18: పేద ప్రజలకు రూ.5లకే భోజనం అందించే అన్న క్యాంటీన్ నిర్వహణకు నాగులుప్పలపాడు మండల వ్యవసాయ అధికారి వెంకటరావు రూ.50వేలను అందజేశారు. గురువారం ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కలిసి ఈమేరకు నగదును అందజేశారు ఈ సందర్భంగా వెంకట్రావును ఎమ్మెల్యే జనార్దన్ అభినందించారు.

క్రీడా ప్రాంగణంలోకి వచ్చే దారి మూసేయాలి

కొండపి, జూలై 18 : కొండపిలోని జీజేసీ, జీహెచ్‌ఎస్ వెనుక భాగాన అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న ఎన్టీఆర్ క్రీడాప్రాంగణంలోకి సీహెచ్‌సీ వైపు నుంచి వచ్చే దారి మూసివేయాలని కొండపి జీజేసీ ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా గురువారం విజ్ఞప్తి చేశారు. ప్రాంగణంలోకి రాత్రిళ్ల అగంతకులు వచ్చి కళాశాలలోని వస్తువులను పగులగొడుతున్నారని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, ఆకతాయిలు లోపలికి ప్రవేశించకుండా, అక్రమదారులను మూసివేయించాలని ప్రిన్సిపాల్ కోరారు.

కొత్త రైళ్లు సింగరాయకొండలో ఆపాలి



మంత్రి స్వామికి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

సింగరాయకొండ, జూలై 18 : సింగరాయకొండలోని రైల్వేస్టేషన్‌లో కొత్త రైళ్లు ఆపేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని గురువారం మంత్రి ఇంటి వద్ద సింగరాయకొండ టీడీపీ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. నవజీవన్, జనశతాబ్ధి, హౌరా, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు సింగరాయకొండలో ఆగేలా కేంద్రంలోని మంత్రులతో మాట్లాడాలని కోరారు. కార్యక్రమంలో పడిదపు రవికుమార్, అప్లైట్స్ సభ్యులు కాక సాయితేజ, చెన్నంశెట్టి హరిబాబు పాల్గొన్నారు.

జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

టంగుటూరు, జూలై 18 : టంగుటూరులో జనసేన పార్టీ మండల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు కందుకూరు రాంబాబు ప్రారంభించారు. ఈసందర్భంగా రాంబాబు మాట్లాడుతూ క్రియాశీలక సభ్యత్వం కోసం రూ.500 చెల్లిస్తే చాలన్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ జీవిత బీమా ఉంటుందని, బీమా పొందిన వారు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.5లక్షలు, గాయపడ్డ వారికి రూ.50వేలు ఇన్సూరెన్స్ కంపెనీ చెల్లిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు సభ్యత్వ నమోదు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శులు జి. రాము, విన్నకోట జనార్దన్, నాగరాజు, నాగార్జున, రామా గోపి, వెంకట్రావు, కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ మంత్రిని కలిసిన టీడీపీ కార్పొరేటర్లు

ఒంగలు(కార్పొరేషన్), జూలై 18 : ఒంగోలు విచ్చేసిన పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణను గురువారం టీడీపీ కార్పొరేటర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కొత్తపట్నం బస్టాండ్ వద్ద రైతుబాజారు ఆవరణంలోని అన్నక్యాంటీన్ పరిశీలన సందర్భంగా విచ్చేసిన మంత్రి నారాయణ, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. వారిలో దాచర్ల వెంకటరమణయ్య, సంద్రపాటి వర్ప్రవర్త, అంబూరి శ్రీవాసరావు, జనసేన కార్పొరేటర్ మలగా రమేష్ తదితరులు ఉన్నారు.

గుడిసెవాసుల సమస్యను పరిష్కరించాలి

జేసీతో చర్చించిన ఎమ్మెల్యే దామచర్ల, ఎంపీ మాగుంట



జేసీ గోపాలకృష్ణతో చర్చిస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల, ఉగ్ర

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 18: గత 50 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న స్థానిక అన్నవరప్పాడు గుడిసువాసుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో గురువారం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఇతర అధికారులతో అన్నవరప్పాడు గుడిసెవాసుల సమస్యలపై చర్చించారు. ముందుగా ఎంపీ మాగుంట మాట్లాడుతూ గుడిసెవాసులు రైల్వే స్థలాల్లో ఉంటున్నారని, కానీ అప్పట్లో మార్కెట్ విలువ ప్రకారం చెల్లింపులు కూడా జరిగాయన్నారు. కానీ కొన్ని కారణాల వల్ల సమస్య అదేవిధంగా కొనసాగుతుందని, రైల్వే అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఈ సమస్యను పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ఈ సమస్యపై గతంలో కూడా తాము అనేకసార్లు చర్చించి ఒక కొలిక్కి తీసుకొని వచ్చామన్నారు. కానీ ఆ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. ఇప్పటికే ఆ స్థలాల్లో వందలాది కుటుంబాలు నివాసం ఉంటున్నారని తెలిపారు. ఆ స్థలాల్లో భవనాలు నిర్మించుకోవడంతో పాటు నివాసాలకు కరెంటు, రోడ్లు, అన్ని మౌలిక సదుపాయాలు కూడా కల్పించడం జరిగిందన్నారు. అంతకుముందు గుడిసెవాసుల సంఘం నాయకులు, ఏపీఎన్‌జీవో సొసైటీ నాయకులు మాట్లాడుతూ గతంలో రైల్వేశాఖకు రూ.103 కోట్లు చెల్లించామన్నారు. ఆ స్థలం మూడు విభాగాలుగా ఉందన్నారు. గుడిసెవాసులు 2004 లోనే డబ్బులు చెల్లించినా సమస్య పరిష్కారం చేయలేదన్నారు. డీఆర్వో విశ్వేశ్వరరావు రైల్వే స్థలాలపై ఉన్న కోర్టు పెండింగ్ కేసులు, రైల్వేశాఖ అధికారులతో జరిగిన చర్చల సారాంశాలన్నింటిని వివరించారు. ఆయా అంశాలపై జేసీ మాట్లాడుతూ రైల్వే అధికారులతో ఈ స్థలాల విషయంపై చర్చించి నివాస బాధితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, ఆర్డీవో సుబ్బారెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

● కలెక్టర్ అన్సారియా ఆదేశం



రికార్డులను పరిశీలిస్తూ మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 18: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. గురువారం ఒంగోలు మండలం యరజర్ల గ్రామంలో పర్యటించారు. తొలుత గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. నివాస ప్రాంతాల నుంచి చెత్తను సేకరించి తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి వర్మికంపోస్టును తయారు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెత్త నుంచి సంపద సృష్టించి గ్రామ స్థాయిలోనే ఆదాయ వనరులను సృష్టించేలా ఈ కేంద్రాలు పని చేయాలని చెప్పారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రిజిస్టర్లను పరిశీలించారు, ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లల బరువుకు సంబంధించి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఆదేశించారు. అలాగే స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించారు భోజనాన్ని రుచి చూశారు. పిల్లలకు పెట్టే భోజనం నాణ్యతతో ఉండటంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మెనూను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. యూనిఫాం, బూట్లు, పాఠ్యపుస్తకాలు ఇచ్చారా లేదా అని ఆరా తీశారు. విద్యార్థుల హాజరు ఆన్‌లైన్ నమోదు విధానాన్ని పరిశీలించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి, ఈవోఆర్డీ రమణమ్మ, తహసీల్దార్ సుజన్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

● ఎంపీ మాగుంటకు రైతు సంఘాల వినతి



ఎంపీ మాగుంటకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 18 : రైతు ఉద్యమ సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు కోరారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రకాల పంటలకు మద్దతు ధర కల్పించడంతో పాటు రైతులు, వ్యవసాయ కార్మికులకు ఒకసారి రుణ విముక్తి కల్పించాలని కోరారు. స్మార్ట్ మీటర్లు రద్దు, విద్యుత్‌ప్రైవేటీకరణ చట్టం రద్దు చేయాలని, సమగ్ర బీమా పథకం అన్ని పంటలకు వర్తింపజేయాలన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులందరికీ పింఛన్లు ప్రతినెలా రూ.10వేలు ఇవ్వాలని, రైతు అనుకూలమైన భూ సేకరణ చట్టం 2013ను అమలు చేయాలని పేర్కొన్నారు. లఖింపూరఖేరి ఘటనలో ప్రాణాలు కోల్పోయిన రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని, ఉద్యమంలో రైతులపై పెట్టిన కేసులన్నీ ఉపసంహరించుకునేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో చుండూరి రంగాంరావు, కె. వీరారెడ్డి, పి.హనుమం తరావు, షేక్ మాబు, శేష సాయి, ఎస్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభం

సందడి చేసిన సినీతారలు ● హాజరైన మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల, బీఎన్ తదితరులు





లక్కీ షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే బీఎన్, జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(కల్చరల్), జూలై 18:ఒంగోలు నగరం కర్నూల్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రముఖ సినీతార సంయుక్తమీనన్ షాపింగ్‌మాల్‌ను ప్రారంభించగా, మరో సినీతార శ్రీలీల వివిధ విభాగాలను ప్రారంభించారు. ఇక రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డీఎస్‌బీ.స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్.విజయ్‌కుమార్, జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ తదితర రాజకీయ ప్రముఖులు సైతం పాల్గొని మాల్‌లోని వివిధ విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో ఒక పెద్ద షాపింగ్‌మాల్‌ను ఏర్పాటుచేయటం అభినందనీయమని చెప్పారు. షాపింగ్ మాల్ అధినేతలు రత్తయ్య, స్వామి, శ్రీనులు మాట్లాడుతూ ప్రజల అభిరుచులకు అనుగుణంగా అధునాతన డిజైన్ల వస్త్రాలను అందుబాటు ధరలో అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇది తమ 11వ స్టోర్ అని వారు తెలిపారు. ఈ సందర్భంగా జబర్దస్త్ టీం నటులు, పలువురు కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. సినీతారను చూసేందుకు భారీగా జనం విచ్చేశారు.

ఎంపీ విజయసాయిరెడ్డిని బర్తరఫ్ చేయాలి

● ఏపీయూడబ్ల్యూజే, ఏపీఈజేఏ డిమాండ్





ఒంగోలులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన, చీమకుర్తిలో వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 18: జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని బర్తరఫ్ చేయాలని పలువురు డిమాండ్ చేశారు. విజయసాయిరెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం ఏపీయూడబ్ల్యూజే, ఏపీఈజేఏ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ముందుగా కలెక్టరేట్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా యూనియన్ నాయకులు మాట్లాడుతూ రాజకీయ నేతలు అసభ్యపదజాలం వాడితే వెంటనే వారిని రాజ్యాంగ పదవుల నుంచి తొలగించేలా చట్టాలు తీసుకొని రావాలని కోరారు. ఇప్పటికైనా ఎంపీ విజయసాయిరెడ్డి జర్నలిస్టులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి దాసరి కనకయ్య, ఎ.సురేష్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకులు కె.సురేష్‌కుమార్, కాశీరావు, బి.వెంకట్రావు, పి.శ్రీనివాసరావు, జయరాం, ఎం.మురళీ, ఎం.సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో నిరసన ర్యాలీ

చీమకుర్తి : జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజ్యసభసభ్యుడు, వైసీపీ నాయకుడు విజయసాయిరెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు గురువారం చీమకుర్తిలో ర్యాలీ జరిపారు. తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. విజయసాయిరెడ్డి రాజ్యసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న సింగయ్య

సింగరాయకొండ, జూలై 18 : మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని పెద గొల్లపాలెం ప్రాథమిక పాఠశాల, సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని శ్రీరాంనగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం దాతలు అందజేసిన నోట్‌పుస్తకాలు, పెన్నులు, పలకలు ఎంతవేలు కత్తి శ్రీనివాసులు, ఆవుల శ్రీనివాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పుష్పవాణి, టి.సుజాత, ఉపాధ్యాయుడు ప్రభాకరరెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ సెక్రటరీ అర్రిబోయిన రాంబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు మించల బ్రహ్మయ్య, ఉపసర్పంచ్ నక్కా బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

22నుంచి శిక్షా సప్తాహి కార్యక్రమాలు

● డీఈవో సుభద్ర

ఒంగోలు(విద్య), జూలై 18: జాతీయ విద్యావిధానం ప్రారంభమై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు వారం రోజుల పాటు అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహి కార్యక్రమం నిర్వహించాలని డీఈవో డి.సుభద్ర గురువారం ఒక ప్రకటనలో హెచ్‌ఎంలను ఆదేశించారు. ఇందులో భాగంగా రోజువారీగా నిర్వహించాల్సిన కార్యక్రమాలను వివరించారు. 22న ఉపాధ్యాయులు స్థానిక వనరులతో బోధనాభ్యాసన సామగ్రి తయారు చేసి పాఠశాలల్లో ప్రదర్శించాలి. 23న పునాది అభ్యాసన, సంఖ్యాశాస్త్ర నైపుణ్యాలను అభివృద్ధి, సమాజ భాగస్వామ్యంపై అవగాహన, 24న క్రీడాదినోత్సవం, విద్యార్థులకు క్రీడా పోటీలు, 25న సాంస్కృతిక దినోత్సవం, విద్యార్థులతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి. 26న డిజిటల్ కార్యక్రమాలు, నూతన నైపుణ్య అవసరాలను గుర్తించడం, 27న పర్యావరణ పరిరక్షణ సంకల్ప యాత్ర, 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవం రోజున విద్యార్థులతో కలిపి సహపంక్తి భోజనం చేయడం వంటి కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు.

ఎన్‌ఎంహెచ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై18: వైద్యఆరోగ్య శాఖలోని నేషనల్ హెల్త్‌మిషన్ (ఎన్‌ఎంహెచ్)లో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో వేతనాలు మంజూరు చేయాలని యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షు డు ఏపీ.నాగేశ్వరరావు కోరారు. గురువారం ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు సీహెచ్.ఏడుకొండలు అధ్యక్షత వహించారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యూలర్ చేయాలని ఆయన కోరారు. యూఎంఅండ్‌హెచ్‌ఈయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తాళ్ళూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జీపీఎస్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయడం అభినందనీయమన్నారు. దాని స్థానంలో ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జి.నాగేశ్వరరావు, ఎ.విజయభాస్కర్, ఉమామహేశ్వరరావు, హైమావతి, జి.అనిత, సీహెచ్.పూర్ణాదేవి, కె.హనుమంతరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి శుభాకాంక్షలు



ఎస్పీ దామోదర్‌కు బొకే అందజేస్తున్న శివారెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 18 : జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఏఆర్.దామోదర్‌ను బీజేపీ నాయకులు అభినందించారు. గురువారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాయపాటి అజయ్ కుమార్‌లు ఎస్పీని మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి బొకే అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. వారు పలు అంశాలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్ళారు.

కౌలు రైతుకార్డులను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఏవో రమేష్‌బాబు

మద్దిపాడు, జూలై 18: కౌలు రైతుకార్డులను సద్వినియోగం చేసుకోవాలని ఏవో జి.రమేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం నందిపాడులో వ్యవసాయశాఖ సిబ్బంది స్వాతి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతుకార్డులను అర్హత కలిగిన రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్డు ద్వారా కౌలు రైతులు ఎరువులు, పురుగు మందులను సబ్సిడీతో పొందవచ్చని చెప్పారు. కౌలురైతు కార్డు 11 నెలలు మాత్రమే వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో వెంకటశేషారావు, సిబ్బంది, కౌలురైతులు పాల్గొన్నారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

మద్దిపాడు, జూలై 18: గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం సమీపంలో మోటార్ సైకిల్ అదుపుతప్పి యువకునికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం జరిగింది. అద్దంకి వైపు నుంచి ఒంగోలు వెళ్తున్న ఆర్.కిరణ్‌కుమార్‌రెడ్డి కారును అధిగమించబోయి ముందు వెళ్తున్న ఆటోను ఢీకొట్టాడు. దీంతో అతనికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఒంగోలులోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

మద్దాలికి అంతర్జాతీయ సేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న మాధవరావు

ఒంగోలు(కల్చరల్), జూలై 18: శ్రీఅభయ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మాద్దాలి మాధవరావుకు లిటిల్ ఛాంప్స్ అకాడమీ, ఎల్‌సీఎస్ ఫౌండేషన్లు అంతర్జాతీయ సేవా సామ్రాట్ భూషణ్ పురస్కారంతో ఘనంగా సత్కరించారు. గురువారం శ్రీశైలం దేవస్థానం కళావేదిక ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో దేవాలయ ఈవో పెద్దిరాజు, ఎస్‌హెచ్‌ఆర్వో వర్కింగ్ ప్రెసిడెంట్ రామచందర్, ఎస్.శేఖర్, ఇమ్మడిశెట్టి హనుమంతరావు తదితర ముఖ్యఅతిథులు చేతులమీదుగా మాధవరావుకు పురస్కారాన్ని, సన్మానపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా దాదాపు 2 వేలకు పైగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన మాధవరావు అభినందనీయుడన్నారు. ఈ సందర్భంగా జిల్లాకు చెం దిన పలువురు కళాకారులు, బ్రాహ్మణ సంఘ నాయకులు మాధవరావుకు అభినందనలు తెలిపారు.

20న కర్నూలులో రాష్ట్ర కౌన్సిల్ సమావేశం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 18: కర్నూలులో ఈనెల 20వ తేదీన జరగనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు కోరారు. గురువారం ఒంగోలులోని మాదాల నారాయణస్వామి భవన్‌లో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, ఇతర సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. కార్యక్రమంలో చొప్పర జాలన్న, వి.రామ్మోహన్, ఎల్.రాజశేఖర్, చక్రవర్తి, రంగారావు, మోజేష్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందుల షాపుల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఏవో పావని

సంతనూతలపాడు, జూలై 18: మండలంలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను ఏవో పి.పావని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులు, పురుగుల మందులు నాణ్యమైనవి మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. అధికధరలకు విక్రయిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు. సంతనూతలపాడులోని చంద్రా ఫెర్టిలైజర్స్, భూమాత ఫెర్టిలైజర్స్ దుకాణాల్లోని శ్యాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపారు. అనంతరం పేర్నమిట్ట, మంగమూరు గ్రామాల్లోని సీహెచ్‌సీ యంత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టంగుటూరుకు వారం రోజులుగా తాగునీరు బంద్

టంగుటూరు, జూలై 18 : టంగటూరుకు వారం రోజులుగా తాగునీటి సరఫరా కావడంలేదు. దీంత జనం అల్లాడుతున్నారు. గ్రామానికి సమీపంలోని పాలేటిలో ఏర్పాటు చేసిన బోరు బావుల ఆధారంగా మంచినీటి పథకం నడుస్తోంది. రైల్వే బ్రిడ్జి రైల్వే మూడో లైన్ పనులు నీటి పథక నిర్వహణకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. బ్రిడ్జి రెండు పిల్లర్ల నడుమ పైప్‌లైన్ ఉంది. పిల్లర్ల పనులు జరుగుతుండగా మధ్యలో ఉన్న పైప్‌లైన్ ధ్వంసమైంది. 20వేలకు పైగా జనాబా ఉన్న గ్రామానికి నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తొలుత మూడు రోజుల్లో పైప్‌లైన్‌ను పునరుద్ధరించి నీటి సరఫరా కొనసాగిస్తామని పంచాయతీ వారు ప్రచారం చేశారు. వారం దాటినా పరిస్థితిలో మార్పురాలేదు. త్వరగా పైపులైన్‌కు మరమ్మతులుచేసి నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

పేర్నమిట్ట చెరువు పరిరక్షణకు కృషి

బీపీసీఎల్ పైపులైన్ మరొక చోట ఏర్పాటు చేయిస్తా : ఎమ్మెల్యే బీఎన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, జూలై 18: పేర్నమిట్ట చెరువు పరిరక్షణకు కృషి చేస్తానని, చెరువులోని నీరు కలుషితం కాకుండా బీపీసీఎల్ పైపులైన్‌ను మరొకచోట వేయించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. పేర్నమిట్టలో గురువారం పేర్నమిట్ట చెరువు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీపీసీఎల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉపసర్పంచ్, చెరువు పరిరక్షణ సమితి ప్రతినిధి కరిచేటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ కలెక్టర్‌తో మాట్లాడి రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. పేర్నమిట్ట చెరువు పరిధిలో 192.25 ఎకరాల సాగు భూమి ఉందని, దీనిలో బీపీసీఎల్ కంపెనీ వారు పైపులైన్ వేసేందుకు నాడు చర్యలు చేపట్టగా, ఈ సమస్యపై కోర్టులో పిటీషన్ వేసినట్లు రైతులు ఎమ్మెల్యేకు వివరించారు. అప్పటికి చెరువులో, సాగుభూమి కలుషిత మవుతుందని వేడుకున్న వారి నుంచి ఎటువంటి హామీ రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బీఎస్ మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ప్రజలకు సంబంధించి సమస్యల పరిష్కార విషయంలో ఎటువంటి రాజీలేదని, ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ప్రజలల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా విధులు నిర్వహించాలని తమకు సూచించారని, ఎవరు అధైర్యపడవద్దని తెలిపారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు కొండగుంట సురేష్, ఈదర విష్ణు, వాసేపల్లి వెంకటేశ్వరరెడ్డి, డి.అంజయ్య, టి.వెంకట్రావు, వెంకటేశ్వర్లు, బి.శ్రీను, కె.శ్రీనివాసరావు, శేషగిరిరావు, పి.శ్రీనివాసరావు, ఏవీ.సుబ్బారావు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



ఎమ్మెల్యే జనార్దన్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

ఒంగోలు(విద్య), జూలై 18: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు, ఏపీ ట్రెజరీ సర్వీస్ అసోసియేషన్ నాయకులు గురువారం ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువతో సత్కరించి బొకే అందజేశారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఒంగోలులో రూ.14కోట్ల వ్యయంతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ కాంప్లెక్స్‌లో అన్ని మౌలిక వసతులు కల్పించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, ఖాదర్, వెంకటేశ్వరరావు, డార్విన్, వెంకటస్వామి, నరేష్, చంద్రశేఖర్, జల్లిపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగి ఇంట్లో చోరీ


గిద్దలూరు టౌన్, జూలై 18 : గిద్దలూరు పట్టణంలో ఇంట్లో ఎవరూ లేని సమయం దొంగలు చోరీకి పాల్పడుతున్నారు. మూడురోజుల క్రితం కూడా ఇదే తరహాలో చోరీ జరిగింది. స్థానిక కొంగళవీడురోడ్డులో ఓసు వెంకటేశ్వర్లు అనే ఆర్మీ ఉద్యోగి ఇంట్లో గత రాత్రి దొంగలు దొంగతనానికి పాల్పడ్డారు. వృత్తిరీత్యా ఇతర ప్రాంతాల్లో వెంకటేశ్వర్లు ఆర్మీ ఉద్యోగం చేస్తున్నాడు. భార్య వెంకటశివలక్ష్మి మొహరం సందర్భంగా బుధవారం ఇంటికి తాళం వేసి బేస్తవారపేటకు వెళ్లింది. రాత్రి ఎవరూలేని సమయంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి ఒక జత కమ్మలు, మాటీలను చోరీ చేశారు. సుమారు రూ.50వేలు ఉంటుందని అంచనా. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పట్టించుకునే వారేరీ?

పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం

బదిలీ ప్రయత్నాల్లో బిజీ

కార్యాలయాల చుట్టూ ప్రజల ప్రదక్షిణలు



టంగుటూరు, జూలై 18 : ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో అధికారులు అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కార్యాలయాలకు వస్తున్న వారితో మాట్లాడేందుకు కూడా కొందరు సమయం కేటాయించడం లేదు. 'మనం ఎన్నికల సందర్భంగా జరిగిన బదిలీల్లో ఇక్కడికి వచ్చాం. మళ్లీ మన ప్రాంతానికి వెళ్తాం. ఇంతలో ఇక్కడి ప్రజలతో మనకేం సంబంధం' అన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో మండల ప్రజల సమస్యలను ఆలకించే నాథుడే కరువయ్యాడు. ప్రధానంగా తహసీల్దార్, ఎంపీడీవో, వెలుగు, ఎన్‌ఆర్‌ఈజీఎస్, వెటర్నరీ ఆసుపత్రి, విద్యాశాఖ, వ్యవసాయశాఖ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. వీటిలో పనిచేసే అధికారులంతా బదిలీల ప్రయత్నాల్లో బిజీగా ఉంటూ ప్రజల సమస్యలపై దృష్టి సారించలేకపోతున్నారు. కార్యాలయాలకు వివిధ పనుల కోసం వచ్చే జనం అధికారుల ప్రవర్తన చూసి విసుగు చెందుతున్నారు. 'త్వరగా వీళ్లను మార్చనన్నా మార్చండి. మా పనులన్నా అయ్యేలా చూడండి' మహాప్రభో అని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

పనుల కోసం తిరుగుతున్న ప్రజలు

త్వరలో ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసే అవకాశం ఉంది. వాటికి దరఖాస్తు చేసుకునేందుకు కొన్ని సర్టిఫికెట్లు అవసరం ఉంటుంది. ముందుగా వాటిని సమకూర్చుకునేందుకు, ఇతరత్రా సమస్యలపై ప్రజలు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కానీ మండల స్థాయి అధికారులెవ్వరూ సహకరించడం లేదని వారు వాపోతున్నారు. తాగునీరు లేని గ్రామాల విషయాన్ని అధికారులు గాలికొదిలేశారు. మండల కేంద్రమైన టంగుటూరుకు వారం రోజుల నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. పంచాయతీ పాలకవర్గం చేతులెత్తేయగా, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు టంగుటూరు వైపు కన్నెత్తి చూడలేదు. మంత్రి డాక్టర్ స్వామి ఆదేశాలతో సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఏఈ వచ్చి పరిస్థితిని పరిశీలించి వెళ్లారు. జనం నీటి కోసం పడుతున్న తిప్పలు వర్ణనాతీతమయ్యాయి. గ్రామాల నుంచి వచ్చి చిరుద్యోగాలు చేసుకుంటూ టంగుటూరులో నివాసం ఉండే వారు స్వగ్రామాలకు వెళ్లిపోగా, స్థానికులంతా ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేసి వాడుకుంటున్నారు. పంచాయతీ వారు ఆదివారం నుంచి నామమాత్రంగా నీటి సరఫరా కొనసాగిస్తున్నారు. అలాగే రామతీర్థం నీటిని టంగుటూరుకు ఆదివారం అరకొరగా సరఫరా చేశారు. శివారు ప్రాంతాలైన ఎస్సీ కాలనీలకు చుక్క నీరు రాలేదు. దీంతో ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారు.

నీటిశుద్ధిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

- కలెక్టర్ అన్సారియా
- రామతీర్థం తాగునీటి ప్రాజెక్ట్ పరిశీలన



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

కొండపి, జూలై 18: కొండపిలోని రామతీర్థం తాగునీటి భారీ ప్రాజెక్టును కలెక్టర్ తమీమ్ అన్సారియా గురువారం మధ్యాహ్నం పరిశీలించారు. రామతీర్థం ప్రాజెక్ట్ నుంచి నీరు వచ్చే విధానంతోపాటు నీటిశుద్ధి, జీఎల్ఎస్ఆర్, ఓవర్‌హెడ్ ట్యాంకుల విభాగాలను సందర్శించారు. ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నీటిని సరఫరా చేసే మోటార్లను పరిశీలించారు. అదేవిధంగా ప్రాజెక్ట్‌లోని ల్యాబ్‌ను పరిశీలించి, సిబ్బందిని వివరాలు అడిగారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ షేక్ మర్దన్‌అలీ, ఈఈ రామస్వామి, సింగరాయకొండ, కొండపి ఏఈలు కిషోర్, రసూల్ ప్రాజెక్ట్ పనితీరును కలెక్టర్‌కు వివరించారు. ప్రాజెక్ట్ రెండు దశలుగా కాంట్రాక్టర్లు నిర్వహిస్తున్నారని ఎస్ఈ కలెక్టర్‌కు వివరించారు. రామతీర్థం ప్రాజెక్ట్ నుంచి కొండపిలోని ప్రాజెక్ట్ వరకు ఒకరు మెయింటెన్స్ నిర్వహిస్తుండగా, కొండపిలోని ప్రాజెక్ట్ నుంచి సరఫరాను ఒకరు నిర్వహిస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టు కాలం పూర్తయినందున తిరిగి కొత్తగా అప్పగించాల్సి ఉందని ఎస్ఈ వివరించారు.

వ్యర్థాలతో ఇబ్బందులు..

ఈ సందర్భంగా పెదకండ్లగుంట గ్రామానికి చెందిన కొల్లా ప్రసాద్ కలెక్టర్‌కు గ్రామసమస్యలను వివరించారు. గ్రామంలోని వ్యర్థాలన్నీ దారి వెంట వేస్తుండటంతో దుర్వాసన వస్తోందని తెలిపారు. వెంటనే స్పందించిన కలెక్టర్ ఎంపీడీవో నాగమణిని డంపింగ్ యార్డు లేదా? అని అడిగారు. ఆమె లేదని సమాధానం చెప్పడంతో తహసీల్దార్ కిరణ్‌కుమార్‌ను డంపింగ్ యార్డుకు ప్రభుత్వ స్థలం ఉందేమో? చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ జె.రవికుమార్, ఏఈ ప్రసాదరావు, సర్వేయర్ ఫయాజ్, వీఆర్వోలు రామకృష్ణ, సుశీల పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీ మిస్సింగ్!

మార్కాపురంలో తప్పిపోయి.. గుంతకల్‌లో ప్రత్యక్షం

ఊపిరిపీల్చుకున్న పోలీసులు

మార్కాపురం, జూలై 18 : విశాఖపట్నం మానసిక వైద్యశాల నుంచి అనంతపురం తరలిస్తుండగా మార్కాపురం రైల్వేస్టేషన్‌లో దిగి కనిపించకుండా పోయిన రిమాండ్ ఖైదీ దొరికాడు. రిమాండ్ ఖైదీ కోసం మార్కాపురం, గిద్దలూరు పోలీసులు బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు గాలించారు. చివరికి గుంతకల్లులో దొరకడంతో ఊపిరి పీల్చుకున్నారు. పోలీసుల కథనం మేరకు అనంతపురం జిల్లా గుత్తి మండలం పి.కొత్తపల్లికి చెందిన నరేష్ గంజాయి రవాణా కేసులో నిందితుడు. అతడిని అనంతపురం కారాగారంలో ఉంచారు. మానసిక సమస్యలు ఉన్న నరేష్‌ను జైలు అధికారులు విశాఖపట్నంలోని మానసిక వైద్యశాలకు సిబ్బందితో కలిపి పంపారు. అక్కడ చికిత్స అనంతరం రిమాండ్ ఖైదీ నరేష్‌ను తీసుకుని సిబ్బంది బుధవారం ఉదయం విశాఖపట్నం నుంచి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో అనంతపురానికి బయలుదేరారు. రాత్రి 10.30 గంటల సమయంలో మార్కాపురం చేరుకున్న రైలులో నుంచి నరేష్ కిందకు దిగాడు. ఆ విషయాన్ని సిబ్బంది గమనించలేదు. గిద్దలూరు వెళ్లేసరికి చూసుకుని ఖంగుతిన్న వారు విషయాన్ని రైల్వే, సివిల్ పోలీసులకు తెలిపారు. వెంటనే అప్రమత్తమైన రెండు శాఖల అధికారులు, సిబ్బంది గాలింపు మొదలుపెట్టారు. గురువారం సాయంత్రం వరకు వెదికినా ఎలాంటి ఆచూకీ దొరకలేదు. కానీ మార్కాపురం రైల్వేస్టేషన్‌లో దిగిన మానసిక రోగి అయిన రిమాండ్ ఖైదీ నరేష్ ఆ వెంటనే స్టేషన్‌కు వచ్చిన అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. అనంతపురం జిల్లా గుంతకల్ వద్ద దిగాడు. అప్పటికే నరేష్ కోసం అన్నిచోట్ల వెదుకుతున్న పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని అనంతపురం జిల్లా కారాగారానికి తరలించారు.

అన్నక్యాంటీన్ల కోసం మేము సైతం..!



ఎమ్మెల్యే దామచర్లకు చెక్కును అందజేస్తున్న నారాయణ విద్యాసంస్థల కరస్పాండెంట్ సౌజన్య

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 18: పేదల ఆకలి తీర్చేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించనున్న అన్నక్యాంటీన్ల నిర్వహణలో పలువురు భాగ స్వాములవుతూ మేము సైతం అంటున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఆయన అభిమానుల నేతృత్వంలో నగరంలోని నాలుగు ప్రాంతాల్లో అన్నక్యాంటీన్లను ప్రారంభించి ఉచితంగా భోజనం అందిస్తున్నారు. దిగ్విజయంగా 32 రోజులకు చేరుకుంది. ఈక్రమంలో పలువురు ఈ క్యాంటీన్లలో ఆహారం అందించేందుకు తమ వంతు సహకారాన్ని అందించారు. ఈ సందర్భంగా గురువారం నారాయణ విద్యాసంస్థల కరస్పాండెంట్ కొల్లా సౌజన్య వారి కుటుంబం నుంచి రూ.లక్ష, అలాగే అగ్రికల్చర్ ఏవో పోతినేని వెంకట్రావు రూ.50వేలు, జంపాని కృష్ణమోహన్ రూ.25వేలు, చేకూరి పూర్ణచంద్రరావు రూ.20వేల నగదును ఎమ్మెల్యే దామచర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. అన్నార్తుల ఆకలి తీర్చడం కోసం అన్నక్యాంటీన్లను పునఃప్రారంభిస్తుందని, అయితే ఇప్పటికే పేదలకు ఉచితంగా భోజనం పెట్టడం, అందులో దాతలు ముందుకు రావడం అభినందనీయన్నారు. ఈ సందర్భంగా దాతలను ఎమ్మెల్యే దామచర్ల ప్రశంసించారు.

భారీ వర్షాల సూచనతో విద్యుత్‌శాఖ అప్రమత్తం

- సిబ్బందికి నాలుగు రోజుల సెలవులు రద్దు

ఒంగోలు(క్రైం), జూలై 18: జిల్లాలో భారీ వర్షాలు పడే సూచనలు ఉండటం, గాలులు వీస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ సత్యనారాయణ కోరారు. గురువారం ఒంగోలులోని విద్యుత్‌భవన్‌లో జరిగిన మీడియా సమావేశం ఏర్పాటు చేసి ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. అదేవిధంగా సిబ్బందికి నాలుగు రోజులు పాటు సెలవులు రద్దు చేశారు. వర్షాలు పడే సమయంలో కరెంటు స్తంభాలు తాక వద్దని, రైతులు మోటార్లు వేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా విద్యుత్ సమస్యలు పరిష్కారం కోసం 1912 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. అదేవిధంగా ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయని, అందుకోసం గస్తీ ఏర్పాటు చేసినట్లు ఎస్ఈ చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలపై ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు. అదేవిధంగా వచ్చే సోమవారం నుంచి మంచినీటి ప్రాజెక్టులకు అంతరాయం లేకుండా కరెంటు సరఫరా చేస్తామన్నారు. సమావేశంలో విజిలెన్స్ సీఐ బీటీనాయక్ పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది పారదర్శకంగా పనిచేయాలి

- ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), జూలై 18: పోలీసు సిబ్బంది పారదర్శకంగా పని చేయడంతో పాటు ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఎస్పీ దామోదర్ పేర్కొన్నారు. గురువారం ఒంగోలు తాలుకా, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా గంజాయిపై ఉక్కుపాదం మోపాలని, రౌడీలపై నిఘా ఉంచాలని, రాత్రులు గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. డీఎస్పీ కిషోర్‌బాబు, ఎస్బీ సీఐ రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

మచిలీపట్నం రైలు స్టాపింగ్

గిద్దలూరు, జూలై 18 : ధర్మవరం నుంచి మచిలీపట్నం వెళ్ళే (17216) ఎక్స్‌ప్రెస్ రైలుకు గిద్దలూరులో స్టాపింగ్ ఇస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఈ ఎక్స్‌ప్రెస్ రైలుకు గిద్దలూరులో స్టాపింగ్ లభించనుంది. అత్యధికంగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తే శాశ్వతంగా స్టాపింగ్ ఏర్పాటు చేస్తామని, ప్రస్తుతం ప్రయోగాత్మకంగా స్టాపింగ్ ఏర్పాటు చేశారు. ఇక యశ్వంత్ పూర్-మచిలీపట్నం (17212) ఎక్స్‌ప్రెస్ రైలుకు ఈనెల 23 నుంచి కంభంలో స్టాపింగ్‌ను ఏర్పాటు చేశారు.

తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం, కందిపప్పు

పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో విక్రయ కేంద్రాలు

ప్రారంభించిన అధికారులు



నాగులుప్పలపాడులో కందిపప్పును అందజేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు



పొన్నలూరులో సరఫరాను ప్రారంభిస్తున్న ఎంపీడీవో కల్పన

నాగులుప్పలపాడు, జూలై 18 : ఎంపిక చేసిన రిటైల్ దుకాణాల ద్వారా ప్రజలకు అందుబాటు ధరలో నాణ్యమైన బియ్యం, కందిపప్పును అందిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం నాగులుప్పలపాడులో పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బయట మార్కెట్లో బియ్యం, కందిపప్పు ధరలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన బీపీటీ స్టీమ్ రైస్ కిలో రూ.49కి, పచ్చి బీపీటీ బియ్యం కిలో రూ.48, కందిపప్పును రూ.160లకు అందిస్తున్నారు. ప్రస్తుతం మండల కేంద్రాల్లో రిటైల్ దుకాణాన్ని పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి విక్రయాలు ప్రారంభించినట్లు వివరించారు. త్వరలోనే గ్రామస్థాయిలో విక్రయాలను ప్రారంభించి ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహాలక్ష్మి, ఫుడ్ ఇన్స్పెక్టర్ వంశీ, టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ళ మనోజ్ కుమార్, మెట్టు సుబ్బయ్య నాయుడు, మారెళ్ళ వెంకటశేషయ్య, చుండూరి నాగేశ్వరరావు, గూడూరు ఝాన్సీ, స్వర్ణ కిషోర్, ఉన్నం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు పౌరసరఫరశాఖ అధికారులు కేంద్రాల్లో బియ్యం, కందిపప్పు తక్కువ ధరకు ప్రజలకు విక్రయించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. కిలో బియ్యం రూ.49లు, కిలో కందిపప్పు రూ.160లకే అందించనున్నట్లు పౌరసరఫరశాఖ అధికారులు తెలిపారు. సంతనూతలపాడులోని పెద్దబజారు, వడ్డెరపాలెం సెంటర్లలో కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కృష్ణమోహన్, డీటీ ఎస్‌కే.సుష్మ, ఎంపీడీవో కె.శ్రీహరి, నాయకులు టి.శ్రీను, ఎస్.శ్రీరామ్మూర్తి, బి.శంకర్, ఆర్.సురేష్, ఆంజనేయులు, సుబ్బారావు, రాజేష్, శ్రీను, డీలర్లు పాల్గొన్నారు.

పొన్నలూరులో..

పొన్నలూరు (కొండపి): ప్రభుత్వం తరపున నాణ్యమైన బియ్యం, కందిపప్పు విక్రయించే దుకాణాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు గురువారం పొన్నలూరులో ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్ రావు, ఎంపీడీవో కల్పన, నాయకులు మండవ మురళి తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండలో..

సింగరాయకొండ: బియ్యం, కందిపప్పు ధరలు పెరిగిపోవడంతో కూటమి ప్రభుత్వం సబ్సిడీ ధరలతో నిత్యవసర సరుకులను అందించడానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక కౌంటర్లను ప్రారంభిస్తున్నారు. అందులోభాగంగా స్థానిక అడితిబజారులో గురువారం తహసీల్దార్ భవానీశంకర్ కూటమి నేతలతో కలిసి సబ్సిడీ ధరలతో అందించే కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యులకు నిత్యవసరాలు అందుబాటులో ఉంచటానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కౌంటర్లను ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కౌంటర్లలో స్టీమ్డ్ బియ్యం కిలో రూ.49, బీపీటీ రూ.48 కందిపప్పు రూ.160 అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నేతలు షేక్ సంధానీబాషా, చీమకుర్తి కృష్ణ, కూనపరెడ్డి సుబ్బారావు, సుదర్శి చంటి, యస్దాని, రవిశంకర్‌రెడ్డి, అంకమరావు, జనసేన మండల అధ్యక్షుడు రాజేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సౌకర్యాన్ని వినియోగించుకోవాలి

కొండపి: రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా తక్కువ రేటుకు అందజేస్తున్న బియ్యం, కందిపప్పును తీసుకెళ్లి సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి చెప్పారు. గురువారం సాయంత్రం కొండపి తహసీల్దార్ కార్యాలయంలో బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మార్కెట్ ధర కన్నా దాదాపు 10 రూపాయలకు పైగా కేజీకి తగ్గించి నాణ్యమైన సరుకు ప్రభుత్వం సరఫరా చేస్తున్నదన్నారు. ఈరోజు నుంచి కేంద్రం అందుబాటులో ఉంటుందని, కావాల్సిన వారు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగమణి, సింగరాయకొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జి డీటీ కృష్ణమోహన్, టీడీపీ నాయకులు నన్నూరి సుబ్బరామయ్య ముప్పరాజు శ్రీనివాసరావు, యనమద్ని వెంకటేశ్వర్లు, తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్ ఖాజాషా వీఆర్వో రామకృష్ణ పాల్గొన్నారు.



సింగరాయకొండ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దార్ భవానీశంకర్



కొండపిలో సరుకులు అందజేస్తున్న అధికారులు, నాయకులు

వైసీపీ నేతల భూ కబ్జాలపై త్వరలో విచారణ

- టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు



మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు), జూలై 18 : ఐదేళ్ల పాలనలో వైసీపీ నాయకులు చేసిన భూ కబ్జాలపై విచారణ చేయించి అక్రమాలు వెలికి తీస్తామని టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. వారి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. గురువారం ఎర్రగొండపాలెం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో భూదందాలు, సహజవనరుల దోపిడిని ఆయన వివరించారు. మాజీ మంత్రి సురేష్, వైసీపీ నాయకులు ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో సహజవనరులను దోపిడీ చేశారన్నారు. గత ప్రభుత్వంలో సచివాలయలకు వచ్చిన ఇసుకను అధికారపార్టీ నేతలు 24 వేల టన్నులు అక్రమంగా అమ్ముకొని రూ.3కోట్ల అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. ఇసుక దోపిడీపై అప్పట్లో కలెక్టరుకు ఫిర్యాదు చేస్తే ఆయన కేసు నమోదుకు ఆదేశించారన్నారు. అయినప్పటికీ, అప్పటి మంత్రి ఒత్తిడితో ఫిర్యాదును బుట్టదాఖలు చేశారని చెప్పారు. ఇసుక మేతలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా మిల్లంపల్లి జగనన్నకాలనీలో పట్టాలు వైసీపీ నేతలు అక్రమాలకు పాల్పడ్డారన్నారు. మిల్లంపల్లికాలనీలో పట్టాల లెక్క తేలలేదని తెలిపారు. త్వరలోనే ప్రత్యేక అధికారి ద్వారా విచారణ చేయిస్తామన్నారు. రాళ్లవాగు ఆక్రమణలకు గురైందని అన్నారు. భూదందాలను నివారించేందుకు సీఎం చంద్రబాబునాయుడు త్వరలోనే ల్యాండ్ గ్యాబ్రింగ్ (ప్రొబేషన్) యాక్టును తీసుకొస్తారన్నారు. వైసీపీ నేతల చేతిలో దోపిడీకి గురైన బాధితులకు భూములను త్వరలోనే వెనక్కు ఇప్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు చేకూరి సుబ్బయ్య, పయ్యావుల ప్రసాద్, ముఖ్య నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, వెంగళరెడ్డి, కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, సత్యనారాయణ గౌడ్, మంత్రునాయక్, వలీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అడుగంటిన ఎస్‌ఎస్‌ట్యాంకు


త్రిపురాంతకంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు

- గొల్లపల్లి ట్యాంకు నుంచి సగం గ్రామాలకే నీరు సరఫరా
- మరో పది రోజుల్లో పూర్తిగా ఖాళీ

త్రిపురాంతకం, జూలై 18: మండలంలోని పలు గ్రామాలకు తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన గొల్లపల్లి ఎస్‌ఎస్ ట్యాంకులో నీరు అడుగంటింది. అసలే సగం గ్రామాలకు కూడా సరఫరా చేయలేని పరిస్థితులలో ఉన్న ట్యాంకులో ప్రస్తుతం నీరు 40 శాతం కంటే దిగువకు పడిపోయింది. ఫిల్టర్ బెడ్లకు నీరు అందించాలంటే ట్యాంకులో సుమారు 25 శాతంకు పైగా నీరుండాలి. కాగా సరఫరా అయ్యే గ్రామాలకు సక్రమంగా నీటిని సరఫరా చేస్తే మరో పది రోజుల్లో ఎస్‌ఎస్ ట్యాంకు ఖాళీ అవుతుంది. ప్రజలను ఫ్లోరిన్ బారినుంచి కాపాడేందుకు రూ.10 కోట్ల నిధులతో ఏర్పాటు చేసిన ఈ తాగునీటి పథకం ద్వారా 35 గ్రామాలకు నీరు అందాల్సి ఉన్నా కేవలం 15 గ్రామాలకు మాత్రమే నీరు అందుతోంది. గత ఏప్రిల్‌లో వచ్చిన సాగర్ జలాలతో ఎస్‌ఎస్ ట్యాంకును నీటితో కొంతవరకు నింపారు. ప్రస్తుతం ట్యాంకులో 35 శాతం లోపు నీరు ఉంది. 35 గ్రామాలకు పైపులైన్లు ఏర్పాటు చేసిన కొన్ని గ్రామాలకు నీరు పూర్తిస్థాయిలో అందడం లేదు. మండలంలోని సంఘం తాండ, సుగాలి తాండ, చెరువుకొమ్ము తాండ గ్రామాలకు నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన పైపలైన్లు అప్పుడే పగిలిపోవడంతో ఇప్పటి వరకు ఆయా గ్రామాలకు సాగర్ జలాలు ఒక చుక్క కూడా అందలేదు. పైపులైన్లు ఏర్పాటు చేసినా చాలా గ్రామాలకు నీటి సరఫరా ఇంత వరకు జరగలేదు. అయితే లేళ్లపల్లి, దువ్వలి, టి.చెర్లోపల్లి గ్రామాలకు పైపులైన్లు ఏర్పాటు చేసిన ఆ గ్రామాలకు నీరందే పరిస్థితి లేదు. ఈ గ్రామాలకు తాగునీటిని అందించాలంటే విశ్వనాథపురం సమీపంలోని ఎన్నెస్పీ కాలువ వద్ద సంప్ ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మూడు తాండాలకు నీటి సరఫరా చేయాలన్నా నూతన పైపులైన్లను ఏర్పాటు చేయడంతోపాటు ఎందూరివారి పాలెం వద్ద సంపును ఏర్పాటు చేయాల్సి ఉంది. అదనంగా మరో సమస్యగా నూతనంగా ఏర్పాటు చేసిన హైవే రోడ్డు పనులలో భాగంగా పలు చోట్ల పైపులైన్లు దెబ్బతినడం కూడా ఒక కారణం. దీంతో గ్రామాలకు నీరు సరఫరా కాకపోవడంతో, ఆయా గ్రామాల్లో ఓహెచ్ఎస్ఆర్‌లు అలంకారప్రాయంగా మిగిలాయి. కాగా ప్రస్తుత పరిస్థితిని అధిగమించాలంటే రానున్న సాగర్ జలాలతో పూర్తిస్థాయిలో ఎస్‌ఎస్ ట్యాంకు నింపితేనే గ్రామాలకు పంపిణీ చేసే అవకాశం ఉంటుంది. అధికారులు స్పందించి మంచినీటి సరఫరాకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పెట్రోలు బంకు ఏర్పాటుకు స్థల పరిశీలన

గిద్దలూరు, జూలై 18 : జైళ్లశాఖ ఆధ్వర్యంలో గిద్దలూరుకు పెట్రోల్‌బంకు మంజూరైంది. ఈ పెట్రోల్ బంకును పట్టణంలోని క్లబ్‌రోడ్డులోని సబ్‌జైలు ఆవరణలో ఏర్పాటు చేయాలని భావించారు. ఆ స్థలాన్ని మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, తహసీల్దార్ సిద్దార్థ పరిశీలించారు. ఆ ప్రాంతంలో పెట్రోల్‌బంకు ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలచారు. ఆ స్థలం పట్టణ నడిబొడ్డున ఉండడం, పక్కనే చిన్నపాటి రోడ్డు ఉండడంతో పెట్రోల్ బంకు ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జాతీయ రహదారిపై పెట్రోల్ బంకును ఏర్పాటు చేస్తే వ్యాపారపరంగా కూడా ఉపయోగకరంగా ఉంటుందని పరిశీలకులు భావిస్తున్నారు.

కొమరోలులో మరో బంకుకోసం..


స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

కొమరోలు, జూన్ 18 : స్థానిక డ్రీమ్ రెస్టారెంట్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేయనున్న భారత్ పెట్రోలు పంపు ఏర్పాటుకు స్థలాన్ని మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా గురువారం పరిశీలించారు. మండలంలోని ఇడమకల్లు గ్రామ రెవెన్యూ ఇలాకాలోని సర్వేనెం. 81లో 1.93 ఏకరాల వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చమని నిర్వాహకులు రంగస్వామి పెట్టుకున్న వినతిపై ఆయన స్పందించారు. కొమరోలులోని స్థలాన్ని పరిశీలించారు. చట్ట ప్రకారం ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమంలో భాగంగా వీటిని పరిశీలించారు. అనంతరం అన్ని అనుమతులు రాగానే ప్రజలకు భారత్ పెట్రోల్ బంకు సేవలను కొమరోలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు.

గిద్దలూరులో స్టాపింగ్

గిద్దలూరు, జూలై 18 : ధర్మవరం నుంచి మచిలీపట్నం వెళ్ళే (17216) ఎక్స్‌ప్రెస్ రైలుకు గిద్దలూరులో స్టాపింగ్ ఇస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఈ ఎక్స్‌ప్రెస్ రైలుకు గిద్దలూరులో స్టాపింగ్ లభించనుంది. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అత్యధికంగా ప్రయాణికులు రాకపోకలకు రైలును వినియోగించుకొంటే శాశ్వతంగా స్టాపింగ్ ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా స్టాపింగ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.

కంభంలో

యశ్వంత్‌పూర్-మచిలీపట్నం (17212) ఎక్స్‌ప్రెస్ రైలుకు కంభంలో స్టాపింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ నెల 23 నుంచి ఈరైలు కంభం రైల్వేస్టేషన్‌లో ఆగనుంది.

సమస్యలు పరిష్కరించండి

పొదిలి, జూలై 18 : పొదిలి ఆర్టీసీ డిపోలో యాజమాన్యం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక కక్షసాధింపు చర్యలకు నిరసనగా ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ తలపెట్టిన నాలుగోరోజు చేపట్టిన నిరాహార దీక్షలు గురువారం కొనసాగాయి. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఎక్సెస్ పేరుపై కనిగిరి డిపోకు రిలీవింగ్‌పై పంపిన డ్రైవర్లను వెంటనే సొంత డిపోలకు తీసుకురావాలని కోరారు. ఉద్యోగులకు నిబంధనలకు విరుద్ధంగా చిన్న చిన్న పొరపాట్లకు 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయకుండా అనుమతి ఇస్తున్నారన్నారు. ఇంక్రిమెంట్లు నిలిపివేస్తూ ఆర్థికంగా నష్టం చేస్తున్నార్నారు. కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగి ఇంట్లో చోరీ

గిద్దలూరు టౌన్, జూలై 18 : ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి దొంగలు చోరీకి పాల్పడుతున్నారు. మూడురోజుల క్రితం కూడా ఇదే తరహాలో దొంగతనానికి పాల్పడ్డారు. కొంగళవీడు రోడ్డులో ఓసు వెంకటేశ్వర్లు అనే ఆర్మీ ఉద్యోగి ఇంట్లో గత రాత్రి దొంగలు పడి చోరీకి పాల్పడ్డారు. వృత్తిరీత్యా ఇతర ప్రాంతాల్లో వెంకటేశ్వర్లు ఆర్మీ ఉద్యోగం చేస్తున్నాడు. భార్య వెంకటశివలక్ష్మి మొహర్రం పండుగ సందర్భంగా బుధవారం ఇంటికి తాళం వేసి బేస్తవారపేటకు వెళ్లింది. రాత్రి ఎవరూలేని సమయంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి ఒక జత కమ్మలు, మాటీలను చోరీ చేశారు. సుమారు రూ.50వేలు ఉంటుందని అంచనా. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న కాశీనాథ్

మార్కాపురం వన్‌టౌన్, జూలై 18: జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్ గురువారం సాయంత్రం ప్రారంభించారు. స్థానిక కంభం రోడ్డులోని జనసేన కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్‌ల ఆదేశాల మేరకు ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు పార్టీ క్రియాశీలక సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన సభ్యత్వాలతోపాటు రెన్యువల్ కూడా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని పార్టీ ముఖ్య కార్యకర్తలు వేగవంతం చేయాలని అన్నారు. అనంతరం పలువురి సభ్యత్వాన్ని నమోదు చేయించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, వీరమహిళలు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డి వ్యాఖ్యలపై నిరసన



నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 18: మీడియాపై ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన ప్రదర్శన చేపట్టారు. స్థానిక ప్రెస్‌క్లబ్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు గురువారం నిరసన ప్రదర్శన కొనసాగింది. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎన్‌వీ.రమణ మాట్లాడుతూ.. మీడియా జర్నలిస్టులపై విజయసాయిరెడ్డి తనస్థాయి మరిచి దిగజారుడు తనంతో మాట్లాడటం అమానుషమన్నారు. బ్లాక్ మెయిల్ చేసే విధంగా విజయసాయిరెడ్డి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. తక్షణమే తన పదవికి విజయసాయిరెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మీడియా స్వేచ్ఛను కాపాడాలని రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి విలేకర్లు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మార్కాపురం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు దొండపాటి మోహన్‌రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కమిటీ సభ్యులు షేక్ అజ్మతుల్లా, పలువురు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకర్లు పాల్గొన్నారు.

పీర్లకు ఘనంగా షరగత్, సహాదత్

మార్కాపురం వన్‌టౌన్, జూలై 18: మొహర్రం సందర్భంగా మార్కాపురంలోని పీర్లకు గురువారం పెద్ద షరగత్, రాత్రి సహాదత్ కార్యక్రమం నిర్వహించారు. గొర్లగడ్డలోని బాదుల్లా సాహెబ్, బారా ఇమామ్, కాశీం సాహెబ్, రంగు హుస్సేని, తూర్పు వీధిలోని చిన్నబాదుల్లా సాహెబ్, కాలువకట్ట, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న పీర్లకు ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. స్థానిక ప్రధాన వీధిలోని గొర్లగడ్డ, తూర్పు వీధి పీర్లు సలామ్‌లు అందుకున్నాయి. అనంతరం రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన చాందీరలలో బాదుల్లా సాహెబ్, చిన్న బాదుల్లా సాహెబ్ పీర్లకు నగరోత్సవం నిర్వహించారు. అనంతరం పీర్లను స్థానిక గుండ్లకమ్మ నదీ తీరం వద్ద ఆల్వీదా పాడుకుంటూ నీళ్లల్లో ముంచారు. అనంతరం భక్తులకు చొంగ రొట్టె, పెరుగు బుత్తి ప్రసాదంగా పంచారు. పీర్లను పెట్టెలలో భద్రపరిచి మకానాల వద్దకు తీసుకెళ్లారు.


ఊరేగింపులో గొర్లగడ్డ, కాలువకట్ట పీర్లు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

పెద్దదోర్నాల : మండలంలో మొహర్రం ముగింపు కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా తిమ్మాపురం, ఐనముక్కల, పెద్ద బొమ్మలాపురం, దోర్నాల, చింతల అగ్రహారం తదితర గ్రామాల్లో వారం, పది రోజులుగా నిర్వహిస్తున్న మొహర్రం ముగింపు కార్యక్రమాల్లో భాగంగా పీర్లను గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం నీళ్లలో తడిపే కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.


దోర్నాల మండలంలో పీర్ల ఊరేగింపు

ముగిసిన మొహర్రం

కొమరోలు : స్థానిక పెద్దచావిడి, చిన్న చావిడిల్లో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న మోహర్రం వేడుకలు గురువారంతో ఘనంగా ముగిశాయి. కొమరోలు గ్రామంలో చిన్న, పెద్ద చావిడిలోని పీర్లును అందంగా అలంకరించి చావిడి ఆవరణలో భక్తుల మధ్య సందడిచేశారు. అనంతరం సాయంత్రం పీర్లును గుండం చుట్టు భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. గ్రామంలోని భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం రాత్రి చావిడి ముందున్న గుండాల్లో పెద్దఎత్తున కలపను వేశారు.

భూ కబ్జాలపై త్వరలో విచారణ చేయిస్తాం

టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు), జూలై 18 : ఐదేళ్ల పాలనలో వైసీపీ నాయకులు చేసిన భూ కబ్జాలపై విచారణ చేయించి అక్రమాలు వెలికి తీస్తామని టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. వారి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. గురువారం ఎర్రగొండపాలెం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ పాలనలో భూ దందాలు, సహజవనరుల దోపిడీని ఆయన వివరించారు. మాజీ మంత్రి సురేష్, వైసీపీ నాయకులు ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో సహజ వనరులను దోపీడీ చేశారన్నారు. గత ప్రభుత్వంలో సచివాలయలకు వచ్చిన ఇసుకను అధికారపార్టీ నేతలు 24 వేల టన్నులు అక్రమంగా అమ్ముకొని రూ.3 కోట్ల అవినీతికి పాల్పడ్డారన్నారు. ఇసుక దోపీడీపై అప్పట్లో కలెక్టరుకు ఫిర్యాదు చేస్తే ఆయన కేసు నమోదుకు ఆదేశించారన్నారు. అయినప్పటికీ, అప్పటి మంత్రి ఒత్తిడితో ఫిర్యాదు ను బుట్టదాఖలు చేశారన్నారు. ఇసుక మేతలపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. అదే విధంగా మిల్లంపల్లి జగనన్న కాలనీలో పట్టాలు వైసీపీ నేతలు అక్రమాలకు పాల్పడ్డారన్నారు. మిల్లంపల్లి కాలనీలో పట్టాల లెక్కతేలలేదని అన్నారు. త్వరలోనే ప్రత్యేక అధికారి ద్వారా విచారణ చేయిస్తామన్నారు. రాళ్లవాగు ఆక్రమణలకు గురైందని అన్నారు. భూదందాలను నివారించేందుకు సీఎం చంద్రబాబునాయుడు త్వరలోనే ల్యాండ్ గ్యాబ్రింగ్ (ప్రొబేషన్) యాక్టును తీసుకొస్తారని అన్నారు. వైసీపీ నేతల చేతిలో దోపిడీకి గురైన బాధితులకు భూములను త్వరలోనే వెనక్కు ఇప్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు చేకూరి సుబ్బయ్య, పయ్యావుల ప్రసాద్, టీడీపీ ముఖ్య నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, వెంగళరెడ్డి, కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, సత్యనారాయణ గౌడ్, మంత్రునాయక్, వలీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

కందులను పరామర్శించిన ఎమ్మెల్యే ఉగ్ర


నారాయణరెడ్డిని పరామర్శిస్తున్న ఉగ్ర

మార్కాపురం, జూలై 18: కాలికి శస్త్రచికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డిని గురువారం కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పరామర్శించారు. సాయంత్రం మార్కాపురం వచ్చిన ఆయ న తొలుత కందుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రధా నంగా కాలు కదపకుండా జాగ్రత్తలు తీసుకుంటే త్వరగా కోలు కోవచ్చని సూచించారు. అసెంబ్లీ సమావేశాల నాటికి కోలుకునేందుకు పలు జాగ్రత్తలు తెలియజేశారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబుతో కలిసి పలు విషయాలపై చర్చించారు. వారివెంట టీడీపీ నాయకులు కందుల రామిరెడ్డి, ఎం.వెంకటరెడ్డి, సూర పరమేశ్వరరెడ్డి ఉన్నారు.

బాధ్యతతో వ్యవహరించే ఉద్యోగి కమిషనర్


కమిషనర్‌కు సన్మానిస్తున్న కృష్ణకిశోర్

గిద్దలూరు టౌన్, జూలై 18 : వృత్తినే దైవంగా భావించి బాధ్యతతో పనిచేసిన వ్యక్తి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అని టీడీపీ నాయకుడు ముత్తుముల కృష్ణ కిశోర్ రెడ్డి అన్నారు. కుప్పం మున్సిపాలిటీకి బదిలీపై వెళుతున్న కమిషనర్ శ్రీనివాసరావును గురువారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణకిశోర్‌రెడ్డి మాట్లాడుతూ తక్కువ కాలం కమిషనర్‌గా పని చేసినప్పటికీ అటు అధికారులు, ఇటు ప్రజల మన్ననలు పొందిన వ్యక్తి శ్రీనివాసరావు అని పేర్కొన్నారు. గడిచిన ఎన్నికలలో బాధ్యతయుతంగా పనిచేసి ఉన్నతాధికారుల మెప్పు పొందారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, అర్బన్ సీఐ సోమయ్య, వైస్ చైర్మన్ ఆర్‌డీఈ రామకృష్ణ, కౌన్సిలర్లు లొక్కు రమేష్, పెద్దబాషా, గడ్డం బాస్కర్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు షానేషావలి, కో-ఆప్షన్ సభ్యులు దమ్మాల జనార్ధన్, టీడీపీ నాయకులు పాలుగుళ్ల చిన్నశ్రీనివాసరెడ్డి, బిల్లా రమేష్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారును వినియోగించుకోవాలి


కొమరోలులో సరుకులు అందజేస్తున్న ఎంపీడీవో

ఎర్రగొండ పాలెం(పుల్లలచెరువు), జూలై 18 : రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం నిత్యవసర సరుకులను అందించేందుకు ఏర్పాటు చేసిన రైతు బజారును సద్వినియోగం చేసుకోవాలని వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. గురువారం ఆయన ఎర్రగొండపాలెం పంచాయతీ కార్యాలయంలో రైతు బజారును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతు బజారును ఏర్పాటు చేసి తక్కువ ధరకు బియ్యం కంది పప్పు అందిస్తుందని అన్నారు. కందిపప్పు 160, సోనా మసూరి బియ్యం కీలో రూ.49, రెండవ రకం రూ.48 వరకు అందుబాటులో వున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈదుల రాజశేఖరరెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల, జూలై 18: ప్రభుత్వ ఆధ్వర్యంలో స్థానిక షణ్ముఖ గోవర్ధన్ ట్రేడర్స్ దుకాణంలో ఏర్పాటు చేసిన నిత్యావసర సరు కుల ప్రత్యేక దుకాణాన్ని మండల అధికారులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హమీద్ మాట్లాడుతూ బియ్యం కందిపప్పులను సామాన్యులకు అందుబాటు ధరల్లో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ తిరుపతిరెడ్డి, ఎంపీడీవో నాసర్‌రెడ్డి, పంచాయతీ ఈవో మోహన్‌రావు, ఆర్ఐ వీ.నాగేశ్వరరావు, వీఆర్‌వో ఏడుకొండలు, సునీత, కాశీశ్వరరెడ్డి, దుకాణం యజమాని సుబ్బారావు పాల్గొన్నారు.

కొమరోలు : స్థానిక చిన్న పీర్లచావిడి ఏదురుగా కొత్తపల్లి శ్రీనివాసులు దుకాణంలో ప్రభుత్వం రాయితీపై ఇచ్చే బియ్యం, కందిపప్పులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ప్రజలకు అందిస్తారని ఎంపీడీఓ నరశింహారావు, తహశీల్ధార్ మల్లిఖార్జునరావులు తెలిపారు.ఈ అవకాశాన్ని మండలంలోని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యాక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి, నాయకులు గజ్జగకొండ నారాయణ, బిజ్జాల తిరుమలరెడ్డి, లాయర్ పాలుగుళ్ళ విజయ్‌కుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు.

బేస్తవారపేట : పట్టణంలో సూపర్‌మార్కెట్‌లో నిత్యావసరాలైన బియ్యం, కందిపప్పులను తక్కువ ధరలకు అందుబాటులో ఉంచినట్లు ఎంపీడీవో టి.పార్వతి తెలిపారు. కార్యక్రమయంలో డీటీ అనిల్ కుమార్, ఎంపీడీవో టి.పార్వతి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సోరెడ్డి మోహన్‌రెడ్డి, పూనూరు భూపాల్‌రెడ్డి, బీసు అరుణ్ కుమార్, మూప్పూరి రాము, వీఆర్వోలు నాగేశ్వరరావు,రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణ రక్షణకు హెల్మెట్ తప్పనిసరి

జూనియర్ సివిల్ న్యాయాధికారి ఓంకార్

గిద్దలూరు టౌన్, జూలై 18 : ద్విచక్ర వాహన దారులు వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రమాదాలు జరిగే సమయంలో ప్రాణాలకు రక్షణ కలిగిస్తుందని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్‌లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశానుసారం గురువారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించడంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ గాంధీబొమ్మ సెంటర్ నుండి కూరగాయల మార్కెట్ మీదుగా కుమ్మరాంకట్ట వరకు కొనసాగింది. ర్యాలీలో అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.మేరీసారాదానమ్మ, స్పెషల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ తోట శ్రీనివాసులు, న్యాయవాదులు, పోలీసులు ర్యాలీలో పాల్గొన్నారు.

పొదిలి : హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని పొదిలి జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రత్యూష అన్నారు. జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణపై పొదిలి కోర్టు కూడలి నుంచి విశ్వనాథపురం కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సీఐ మల్లిఖార్జునరావు, ఎస్సై జి కోటయ్య, పోలీస్ సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కాపురం : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరిస్తే ప్రాణాలకు రక్షణ ఉంటుందని మార్కాపురం ఆరవ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.శుభవాణి అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో హెల్మెట్ ధరించడంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోర్టు సముదాయం నుంచి ప్రారంభమైన ర్యాలీ కంభం బస్టాండ్ మీదుగా గడియారస్తంభం వరకు అక్కడి నుంచి కోర్టు కూడలి వరకు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి జె.కిషోర్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు భూపతి కాశయ్య తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయాధికారులు, న్యాయవాదులు

అవీ.. ఇవీ..

ఆక్రమణలు తొలగించారు కానీ..!


రోడ్డుపై అడ్డంగా ఉన్న విద్యుత్, టెలిఫోన్ స్తంభాలు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 18: మార్కాపురం పట్టణంలోని రాజాజీ, తేరు వీధుల ముఖ్య కూడలి వినాయక స్వామి గుడి. ఆ గుడి మూలమలుపు వద్ద కొందరు వ్యాపారులు, విద్యుత్, టెలిఫోన్ స్తంభాన్ని ఆసరాగా చేర్చుకుని ఆక్రమణలకు పూనుకున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగేది. చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సమయంలో రథోత్సవం నిర్వహించే క్రమంలో ఈ ఆక్రమణ తీవ్ర ఇబ్బందులు కలిగించేంది. దీంతో అధికారులు ఆక్రమణలు తొలగించారు. కానీ ఆక్రమణలకు మూలకారణమైన టెలిఫోన్, విద్యుత్ స్తంభాలను తొలగించలేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు వీటిని తీసివేస్తే ఈ ప్రాంతంలో ఆక్రమణలు తిరిగి జరుగకుండా ఉంటాయి.

కేన్సర్‌పై అవగాహన

గిద్దలూరు, జూలై 18 : పట్టణంలోని ఈసీహెచ్‌ఎస్ మిలటరీ ఆసుపత్రిలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నెల 19, 20 తేదీలలో ఒంగోలుకు చెందిన రమేష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నందున రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మిలటరీ ఆసుపత్రి ప్రతినిధులు తెలిపారు.

ఏకపాత్రాభినయంలో ప్రతిభ


నాటకంలోని ఓ సన్నివేశం

గిద్దలూరు, జూలై 18 : రేనాటి సూర్యుడు, తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితచరిత్రపై ఏకపాత్రాభినయ నాటికను ప్రదర్శించారు. మండలంలోని తాళ్లపల్లె గ్రామంలో మొహర్రం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా యోగా గురువు బి.ఎస్.నారాయణరెడ్డి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఏకపాత్రాభినయాన్ని ప్రదర్శించి నరసింహారెడ్డి చూపిన పోరాట పటిమను వివరించారు. నరసింహారెడ్డి చరిత్రను నేటి యువతరం తెలుసుకొని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ హబీబ్‌ఖాన్, టీడీపీ మండల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, వివిధ సంఘాల ప్రతినిధులు దేమా పోతులూరి, హుస్సేన్‌ఖాన్, యాసిన్‌ఖాన్, నాగూర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మార్కాపురం రూరల్, జూన్ 18: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ బండి లక్ష్మీదేవి అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చందన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల కో-ఆప్షన్ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఆయా గ్రామాలలోని సమస్యలను సభలో చర్చించాలని సూచించారు. మండలంలోని సంబంధిత శాఖల అధికారులు ఆయా శాఖల సమగ్ర నివేదికలతో హాజరుకావాలని కోరారు.

పశువుల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పొదిలి, జూలై 18 : పశుపోషకులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బేబీరాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ప్రతిఒక్కరూ గ్రామాల్లో తిరిగి ముందుగా టీకాలు వేయించుకోవాలని పశుపోషకులకు తెలపాలన్నారు. పశువులను పరీక్షించి, వ్యాధులను గురించి నివారణ టీకాల గురించి అవగాహన కల్పించాలన్నారు. వైద్యశాలల్లో అన్ని రకాల టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతిఒక్కరూ టీకాల కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ వేణు, అన్నీ పశువైద్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతమ్మకు ఆషాడ మాస పూజలు


వడిబియ్యం సమర్పిస్తున్న మహిళలు

మార్కాపురం వన్ టౌన్, జూలై 18: స్థానిక ప్రసన్న రామాలయంలో సీతాదేవికి ఆషాడ మాసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి మహిళా భక్తులు పూజలు చేశారు. వడిబియ్యం సమ ర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

సప్తహ పారాయణం ముగింపు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 18: గురుపౌర్ణమిని పురస్కరించుకుని నెహ్రూ బజార్‌లో వెలసిన షిరిడీ సాయిబాబా మందిరంలో బాబా జీవిత చరిత్ర సప్తహ పారాయణం గురువారం ముగిసింది. ఆలయంలో జూలై 11వ తేదీ నుంచి సుమారు 650 మంది సాయిభక్తులు గ్రూపుల వారీగా రేయింబవళ్లు పారాయణం చేసి గురువారంతో ముగించారు. ఈ సందర్భంగా ఆలయంలో సినీ గాయకులు భారతి, శైలజ, బాలరాజులతో భక్తిగీతాల పాటల కచేరి నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పింఛనర్ల వివరాలు తెలియజేయాలి

కొమరోలు, జూన్18: మండలంలోని ప్రభుత్వ పింఛను తీసుకుంటున్న వారు, వారి కుటుంబ సభ్యులు తమ ఆధార్‌కార్డు, పాన్‌కార్డు జిరాక్స్ కాపీలను కొమరోలులోని విశ్రాంత ఉపాధ్యాయుల కార్యాలయంలో ఈ నెల 23వ తేదీ లోపు అందచేయాలని ఆ శాఖ మండల అధ్యక్షులు యాసం అమరేశ్వరరావు గురువారం తెలిపారు. గిద్దలూరు ట్రెజరీ కార్యాలయం నుంచి వచ్చిన విన్నపం మేరకు ప్రతి పింఛనుదారులకు సంబంధించిన ఆధార్, పాన్‌కార్డుల జిరాక్స్ కాపీలను ఇవ్వాలన్నారు.

రిమాండ్ ఖైదీ మిస్సింగ్!

- మార్కాపురంలో తప్పిపోయి.. గుంతకల్‌లో ప్రత్యక్షం
- ఊపిరిపీల్చుకున్న పోలీసులు

మార్కాపురం, జూలై 18 : విశాఖపట్నం మానసిక వైద్యశాల నుంచి అనంతరం తరలిస్తుండగా జిల్లాలోని మార్కాపురం రైల్వేస్టేషన్‌లో దిగి కనిపించకుండా పోయిన రిమాండ్ ఖైదీ దొరికాడు. రిమాండ్ ఖైదీ కోసం మార్కాపురం, గిద్దలూరు పోలీసులు బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు గాలించారు. చివరికి గుంతకల్లులో దొరకడంతో ఊపిరిపీల్చుకున్నారు. పోలీసుల కథనం మేరకు అనంతపురం జిల్లా గుత్తి మండలం పి.కొత్తపల్లికి చెందిన నరేష్ గంజాయి రవాణా కేసులో నిందితుడు. అతడిని అనంతపురం కారాగారంలో ఉంచారు. మానసిక సమస్యలు ఉన్న నరేష్‌ను జైలు అధికారులు విశాఖపట్నంలోని మానసిక వైద్యశాలకు సిబ్బందితో కలిపి పంపారు. అక్కడ చికిత్స అనంతరం రిమాండ్ ఖైదీ నరేష్‌ను తీసుకుని సిబ్బంది బుధవారం ఉదయం విశాఖపట్నం నుంచి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో అనంతపురానికి బయలుదేరారు. రాత్రి 10.30 గంటల సమయంలో మార్కాపురం చేరుకున్న రైలులో నుంచి నరేష్ కిందకు దిగాడు. ఆ విషయాన్ని సిబ్బంది గమనించలేదు. గిద్దలూరు వెళ్లేసరికి చూసుకుని ఖంగుతిన్న వారు విషయాన్ని రైల్వే, సివిల్ పోలీసులకు తెలిపారు. వెంటనే అప్రమత్తమైన రెండు శాఖల అధికారులు, సిబ్బంది గాలింపు మొదలుపెట్టారు. గురువారం సాయంత్రం వరకు వెదికినా ఎలాంటి ఆచూకీ దొరకలేదు. కానీ మార్కాపురం రైల్వేస్టేషన్‌లో దిగిన మానసిక రోగి అయిన రిమాండ్ ఖైదీ నరేష్ ఆ వెంటనే స్టేషన్‌కు వచ్చిన అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. అనంతపురం జిల్లా గుంతకల్ వద్ద దిగాడు. అప్పటికే నరేష్ కోసం అన్నిచోట్ల వెదుకుతున్న పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని అనంతపురం జిల్లా కారాగారానికి తరలించారు.



ఒన్‌కే రన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయాధికారి కే భరత్‌చంద్ర

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

● న్యాయాధికారి భరత్‌చంద్ర

కనిగిరి, జూలై 18: హెల్మెట్ వాడకంతో ప్రమాదాలకు చెక్ పెట్టొచ్చని కనిగిరి జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కే భరత్‌చంద్ర అన్నారు. హెల్మెట్ వాడకంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ గురువారం పట్టణంలో న్యాయవాదుల అధ్వర్యంలో ఒన్ కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న న్యాయాధికారి మాట్లాడుతూ రోజు రోజుకు పెరుగుతున్న మోటర్‌సైకిల్ ప్రమాదాలను అరికట్టాలంటే ప్రధాన ఆయుధం హెల్మెట్ ఒక్కటే అన్నారు. శిరస్త్రాణం ధరించటం వలన రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తలకు గాయం కాకుండా ఉంటే ప్రాణాలకు ముప్పు వాటిల్లదన్నారు. మోటర్ బైక్ నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ విజయరామరాజు, మున్సిపల్ చైర్మన్, న్యాయవాది గఫార్, పోలీసు అధికారులు, సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, విజేత కళాశాల విద్యార్థులు, మండల న్యాయసేవాధికార సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవినీతి

సామాజిక తనిఖీలో బట్టబయలు

మస్టర్లలో మాయాజాలం

పనులకు, బిల్లులకు తేడా

చేతివాటం ప్రదర్శించిన సిబ్బందికి నోటీసులు

కురిచేడు, జూలై 18: పనులు లేక ఖాళీగా ఉండే రైతు కూలీలు వలసలు పోకుండా ఉండేందుకు ప్రభుత్వం పనులు కల్పించి ఉపాధి చూపేందుకు ఉపాధి హామీ పథకం ఏర్పాటు చేసి పనులు కల్పించింది. దీంతో కూలీలకు జీవనోపాధి లభించి వలసలు తగ్గుముఖం పట్టాయి. అయితే అక్రమార్కులకు ఇదే అవకాశం లభించినట్లు అయింది. సామాజిక తనిఖీలలో వారి బండారం బట్ట బయలు అవుతున్నా వారు ఏ మాత్రం లెక్క చేయడం లేదు. కురిచేడు మండలంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక గురువారం కురిచేడు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీవో సీతారామ్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో మండలంలో జరిగిన అవినీతి గురించి విచారణ బృందం వెల్లడించింది. మొత్తం రూ.10,33,491 ల అవినీతి జరిగినట్లు తేల్చారు. ఆ మొత్తం సిబ్బంది కట్టాలని సూచించారు.

కురిచేడు మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 871 పనులు జరిగాయి. కూలీ మొత్తం రూ.5,89,96,054లు కాగా మెటీరియల్ రూ.1,54,06,675 లు మొత్తం మీద రూ.7,44,02,729లు. ఈ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం ఈ నెల 4వ తేదీ నుంచి 17వ తేదీ వరకు పనులను తనిఖీ చేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహించి తమ తనిఖీ రిపోర్టులు వెల్లడి చేశారు. ప్రతి పంచాయతీలో అవినీతి జరిగినట్లు నిర్ధారించారు. పనులు చేసిన కూలీల సంఖ్యకు, మస్టర్లకు తేడాలు ఉన్నాయని తేల్చారు. పనులు చేశాక ఇచ్చిన కొలతలకు, సామాజిక తనిఖీలో వెల్లడి అయిన కొలతలకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది. ఈ విషయాలను తనిఖీ బృందాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. ప్రజా వేదిక సాక్షిగా ఉపాధి హామీ పథకం సిబ్బంది అవినీతిని ఎండగట్టారు. ప్రధానంగా బోదనంపాడు పంచాయతీలో రూ.4,44,319లు అవినీతి జరిగినట్లు తేల్చారు. కురిచేడు పంచాయతీలో రూ. 3,09,674లు అవినీతి లెక్క తేలింది. మిగిలిన పంచాయతీలలో సైతం సిబ్బంది చేతి వాటం ప్రదర్శించినట్లు తేల్చారు. అవినీతికి పాల్పడిన వారందరికి నోటీసులు జారీ చేశారు. సదరు మొత్తాలను కట్టాలని సూచించారు.

గత ఆర్థిక సంవత్సరంలో రూ. 55 వేల అవినీతి జరిగినట్లు తేల్చగా ఆ మొత్తాలను చెల్లించారని, అలాగే ఈ ఆర్థిక సంవత్సరంలో అవినీతికి పాల్పడి కూలీల సొమ్ము మింగిన అధికారులు, ఫీల్డ్ స్టాఫ్ వెంటనే సదరు మొత్తాలను చెల్లించాలని చెప్పారు. ఇదే ప్రజా వేదికలో తెలుగుదేశం పార్టీ నాయకులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. సిబ్బంది అవినీతికి పాల్పడుతుంటే ఉన్నతాధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. అవినీతికి పాల్పడిన వారిని వెంటనే మార్చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ బి. అర్జున్‌రావు, ఏపీవోలు, నిర్మల్, ఝాన్సీ, ఎంపీడీవో సీతారామయ్య, ఎపీపీ బెల్లం కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.


తాళ్లూరులో మాట్లాడుతున్న ఎస్పార్పీ నందిని


సామాజిక తనిఖీలో వివరాలు వెల్లడిస్తున్న ఉపాధి అధికారులు

అవినీతి, అక్రమాలకు తావులేకుండా సామాజిక తనిఖీ

తాళ్లూరు : 2023-2024 సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టిన పనుల్లో అవినీతి, అక్రమాలకు తావు లేకుండా సామాజిక తనిఖీ నిర్వహిస్తామని ఎస్పార్పీ నందినీ తెలిపారు. స్థానిక తాళ్లూరు సచివాలయం-1 వద్ద సామాజిక తనిఖీ గ్రామసభ గురువారం జరిగింది. నాలుగు రోజులుగా గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో చేపట్టిన పనులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. తనిఖీల్లో వెల్లడయిన వివరాలను సభవద్ద వెల్లడించారు. కొత్తపాలెం గ్రామంలో ఎన్నార్జీఎస్ కింద చేపట్టినపనుల వివరాలను వెబ్‌సైట్‌లో ఎందుకు కనపడకుండా చేశారని తనిఖీ అధికారులను కొత్తపాలెం గ్రామస్థులు ప్రశ్నించారు. దీంతో ఎస్పార్పీ మాట్లాడుతూ పనుల వివరాలు పబ్లిక్ డిమాండ్‌లో తనవద్ద వున్న సెల్‌లో చూపించి వారికి నివృత్తి చేశారు. తనిఖీకి రావాలని ఇంజనీరింగ్ అధికారులకు సమాచారం ఇచ్చినా, సామాజిక తనిఖీ గ్రామ సభకు హాజరుకాని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లామని ఎస్పార్పీ నందిని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈసీ ప్రసాద్, గ్రామకార్యదర్శులు షేక్ నూర్ అహమ్మద్, చిరంజీవి, డీఆర్‌పీలు పాల్గొన్నారు.


అగ్ని గుండాన్ని పూడ్చుతున్న భక్తులు

ముగిసిన మొహర్రం వేడుకలు

పామూరు, జూలై 18 : స్థానిక పాత బస్టాండ్ సర్కార్ పీర్ల చావిడికి సంబంధించిన అగ్నిగుండంలో గురువారం తెల్లవారుజామున పీర్లను చేతపట్టుకొన్న భక్తులు నిప్పుల గుండంలో పలుమార్లు దూకుతూ తమ భక్తి ప్రపత్తులను చాటుకొన్నారు. అనంతరం అగ్నిగుండంలో దూకిన పీర్లను, పీర్ల గుమ్మటాన్ని అక్కడి నుంచి మేళ తాళాలు, తప్పెట్లతో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గోపాలపురం పీర్లతో పామూరుకు చెందిన పీర్లు సలాములు అందుకొని వీడ్కోలు పలికాయి. ఈ సందర్భంగా బెల్లం పానకాన్ని నైవేద్యంగా సమర్పించుకొన్నారు.మోహర్రం పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ఎం రామానాయక్ ఆధ్వర్యంలో పామూరు, సీఎస్‌పురం ఎస్‌ఐలు ఎం సైదుబాబు, ప్రవీణ్‌కుమార్‌లు గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

విజయసాయిరెడ్డిని అరెస్ట్ చేయాలి

జర్నలిస్టుల డిమాండ్

కనిగిరి, జూలై 18: జర్నలిస్టులను దూషించడంతోపాటు అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంపీ విజయసాయిరెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని జర్నలిస్టులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ కనిగిరిలో గురువారం జర్నలిస్టులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత స్థానిక పామూరు బస్టాండు సెంటరులో మానవహారం నిర్వహించారు. అనంతరం జర్నలిస్టులు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో జాన్‌ఇర్విన్, ఎస్‌ఐ త్యాగరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ప్రాంత జర్నలిస్టులు పాల్గొన్నారు.

దర్శి : ఎంపీ విజయసాయిరెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ దర్శిలో ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఐ సుమన్‌కు వినతిపత్రం సమర్పించారు.

గాయపడిన టీడీపీ నేతకు పరామర్శ

ముండ్లమూరు, జూలై 18 : మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని తమ్మలూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు యారసి అంజిరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయ పడి ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. విషయం తెలిసిన దర్శి నియోజక వర్గ టీడీపీ నాయకులు డాక్టర్ కడియాల లలిత సాగర్ గురువారం సాయంత్రం అంజిరెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. లలిత సాగర్ వెంట మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు బిజ్జి గోపాలరెడ్డి, నాగేశ్వరరావు, బిజ్జం వెంకట సుబ్బారెడ్డి, కాసా అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

సరసమైన ధరలకే నాణ్యమైన సరుకులు

కనిగిరి ఆర్డీవో జాన్‌ఇర్విన్

దొనకొండ, జూలై 18 : నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం సరసమైన ధరలతో నాణ్యమైన సరుకుల అమ్మకం చేపట్టిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కనిగిరి ఆర్డీవో జాన్‌ఇర్విన్ పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఏర్పాటు చేసిన సరసమైన ధరలతో నాణ్యమైన సరుకుల అమ్మకం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు హోల్‌సేల్ ధరలకు నాణ్యమైన సరుకులు అందిస్తున్నదన్నారు. కందిపప్పు మార్కెట్‌లో రూ.181 ధర ఉండగా ప్రభుత్వం రూ.160, స్టీమ్డ్, బీపీటీ, సోనమసూరీ బియ్యం మార్కెట్‌లో రూ.55.85 ధర ఉండగా ప్రభుత్వం రూ.49, పచ్చి, బీపీటీ, సోనామసూరి బియ్యం మార్కెట్‌లో రూ.52-40 ధర ఉండగా ప్రభుత్వం రూ.48 ధరకే అందిస్తుందన్నారు. ప్రజల ఆర్థిక ఇబ్బందులు గుర్తించి ప్రభుత్వం మంచి నిర్ణయంతో హోల్‌సేల్ ధరలకు అందించే వస్తువులను గ్రామాల్లో ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని కోరారు. మండల టీడీపీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదేళ్లుగా కొనసాగిన రాక్షస పాలనలో ప్రజలు అన్నీ విధాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు బియ్యం, కంది పప్పు అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, ఈవోఆర్డీ ప్రసాదు, వీఆర్వోలు తన్నీరు హరినారాయణ, ఐలూరి పిచ్చిరెడ్డి, దర్శి నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ ఎం. సుధాకర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, టీడీపీ నాయకులు మన్నెం గాలయ్య, కొమ్మతోటి సుబ్బారావు, బండ్లా నారాయణ, షేక్ తోహీద్, పరుచూరి రామలింగయ్య, కుందుర్తి లక్ష్మణ్, బీఏ సైరస్, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.


ప్రజలకు బియ్యం, కందిపప్పు అందిస్తున్న ఆర్డీవో జాన్‌ఇర్విన్, మండల టీడీపీ అధ్యక్షుడు శివకోటేశ్వరరావు


మార్కెట్లో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ మధుబాబు, ఎంపీడీవో జనార్దన్

ధరల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి

పీసీపల్లి: రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరల నియంత్రణకు ప్రభుత్వం కృషి చేస్తుందని తహసీల్దార్ పద్మావతి అన్నారు.అందులో భాగంగానే గ్రామాల్లో విక్రయకేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండల కేంద్రమైన పీసీపల్లిలో కందిపప్పు, బియ్యం విక్రయకేంద్రాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టిన ప్రభుత్వం గ్రామాల్లో విక్రయాకేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ఆదేశాలను ఇచ్చిందన్నారు. ఈ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకు బియ్యం, కందిపప్పు విక్రయించడం జరుగుతుందని ఆమె అన్నారు. కిరాణాషాపుల్లో కంది పప్పు కిలో 180రూపాయలకు విక్రయిస్తుండగా ప్రభుత్వం 160 కే ఇస్తుందన్నారు. బియ్యం కిలో 60రూపాయలు ఉండగా ప్రభుత్వం 48రూపాయలకే విక్రయిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బారావు, డీటీ శ్రీను, స్థానిక టీడీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

తక్కువ ధరకే నాణ్యమైన సరుకులు

ముండ్లమూరు : నిత్యావసర సరుకులు మండలంలో ప్రతి ఒక్కరికి సరసమైన ధరలకే రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తహసీల్దార్ జే.మధుబాబు, ఎంపీడీవో ఆర్.జనార్దన్‌లు అన్నారు. గురువారం మండలంలోని మారెళ్ళలో నిత్యావసర సరుకులైన కంది పప్పు, బియ్యంను పంపిణీ చేశారు. హాజరైన వారిని ఉద్దేశించి తహసీల్దార్ మాట్లాడుతూ ప్రస్తుతం బయట మార్కెట్‌లో కంది పప్పు కిలో రూ. 181 ఉందని, ప్రభుత్వం కిలో రూ. 160కే సరఫరా చేస్తుందన్నారు. బియ్యం బయట మార్కెట్‌లో రూ. 55.85 ఉండగా రైతు బజారులో రూ. 49లుగా నిర్ణయించామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకొని నిత్యావసర సరుకుల భారాన్ని తగ్గించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో బీ గురవయ్య, పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, ఎంపీటీసీ పాలపర్తి సుబ్బారావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు మట్టా సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను కలిసి అభినందనలు తెలుపుతున్న టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

● ఎస్పీని కలిసి విజ్ఞప్తి చేసిన గొట్టిపాటి లక్ష్మి దంపతులు

దర్శి, జూలై 18 : దర్శి నియోజకవర్గంలో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు విజ్ఞప్తి చేశారు. జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన దామోదర్‌ను వారు ఒంగోలు ఎస్పీ బంగ్లాలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ నాయకులు చేసిన దాడులను, పోలీసులు అనుసరించిన అనుచిత వైఖరిని ఎస్పీకి వివరించారు. దర్శి నియోజకవర్గంలో పోలీసు అధికారులు వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరించి ఆపార్టీకి ఊడిగం చేశారని ఫిర్యాదు చేశారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. ఏకపక్షంగా వ్యవహరించటమే కాక గాయాలపాలైన టీడీపీ కార్యకర్తలపై ఎదురు కేసులు పెట్టారని వివరించారు. వైసీపీతో అంటకాగి ఏకపక్షంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు డాక్టర్ లక్ష్మి దంపతులు తెలిపారు. దర్శి నియోజకవర్గంలో జరిగిన సంఘటనను విచారించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

ఇసుక అక్రమరవాణాపై ఫిర్యాదు

పీసీపల్లి,జూలై18: మైనింగ్ అధికారులు సీజ్‌చేసిన ఇసుకను కొంతమంది వ్యక్తులు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన కొందరు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేశారు. వివరాలలోకి వెళ్తే మండలంలోని నేరేడుపల్లి గ్రామసమీపంలోని నేరేళ్లవాగులో అక్రమంగా ఇసుకను వెలికితీసి డంప్‌చేశారు. ఎన్నికలకు ముందు గ్రామప్రజలు ఫిర్యాదు చేయడంతో మైనింగ్ అధికారులు డంప్ చేసి ఉన్న ఇసుకను సీజ్‌చేశారు. అయితే బుధవారం అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అధికారులు సీజ్‌చేసి ఉంచిన ఇసుకను ట్రాకర్‌కు నింపుకుని ఎత్తుకెళ్లి విక్రయించి సొమ్ము చేసుకున్నాడని తహసీల్దార్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.అక్రమంగా ఇసుకను తరలించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పీసీపల్లి పోలీసులకు కూడా గ్రామస్థులు ఫిర్యాదు చేశారు.

ప్రతి పంచాయతీలో ఉపాధి హామీ పనులు చేపట్టాలి

ముండ్లమూరు, జూలై 18 : మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు ఈనెలాఖరు కల్లా చేపట్టాలని, ప్రతి రోజూ ఐదు వేల నుంచి ఏడు వేల వరకు జాబ్ కార్డు ఉన్న వారికి పని కల్పించాలని ఎంపీడీవో ఆర్ జనార్దన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పనులు చేపట్టని ఫీల్డ్ అసిస్టెంట్ల పై చర్యలు తీసుకుంటామన్నారు.ఈ సమావేశంలో ఏపీవో నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్‌లు తదితరులు ఉన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

దర్శి, జూలై 18 : ప్రజలకు కార్పొరేట్‌స్థాయిలో మెరుగైన వైద్యం అందించాలని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సూచించారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను గురువారం ఆమె పరిశీలించారు. అక్కడ రోగులకు అందుతున్న వైద్యాన్ని ప్రత్యక్షంగా చూశారు. ఆసుపత్రిలో మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రికి అవసరమైన అన్నీ వనరులను సమకూర్చుతామన్నారు. ఐదేళ్లుగా ఆసుపత్రికి పట్టిన అవినీతి జబ్బును వదిలించాలని సూచించారు. ఈ సందర్భంగా అక్కడ రోగుల వద్దకు వెళ్లి వైద్య సేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అందిస్తున్న సేవలను వైద్యాధికారి డాక్టర్ సుమన్ వివరించారు. తాగునీటి వసతి కోసం ఆర్వో ప్లాంట్ మంజూరు చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ కూటమి నాయకులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


దర్శి ప్రభుత్వ ఆసుపత్రి పనితీరును పరిశీలిస్తున్న టీడీపీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

దొనకొండ : గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని ఇండ్లచెరువు గ్రామంలో బుధవారం నిర్వహించిన మొహర్రం వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. త్యాగాలకు ప్రతీకగా జరుపుకునే మొహర్రం వేడుకలను గ్రామస్థులు కలిసి మెలిసి ప్రశాంత వాతావరణంలో పండుగ నిర్వహించుకోవాలని కోరారు. అనంతరం గ్రామానికి చెందిన మండల టీడీపీ నాయకుడు పత్తి వెంకటేశ్వర్లు గృహంలో ఆయన కుటుంబ సభ్యులు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, దుగ్గెంపూడి చెంచయ్య, ఫణిదపు అనంతరాములు, పలువురు టీడీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి

దర్శి, జూలై 18 : నడికుడి-శ్రీకాలహస్తి రైల్వేలైనులో దర్శి సమీపంలో అండర్ బైపాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని దర్శి రైతులు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని ఒంగోలులో కలిసి విజ్ఞప్తి చేశారు. రైల్వేలైను దర్శి పట్టణానికి తూర్పువైపు నుంచి వెళ్తున్న విషయం తెలిసిందే. అనేకమంది రైతులకు రైల్వేలైనుకు అవతలివైపున సాగుభూములు ఉన్నాయి. రైళ్ల రాకపోకలు సాగితే పొలాలకు ప్రతిరోజు వెళ్లేందుకు వీలులేక ఇబ్బంది పడాల్సి వస్తుందని రైతులు మొరపెట్టుకున్నారు. సుమారు 300 ఎకరాలకు పైగా పొలం కట్టకు అటు వైపు ఉందని, ఆ పొలాలకు వెళ్లాలంటే రైల్వేలైను దాటి వెళ్లాల్సి వస్తుందన్నారు. సమస్యను తెలుసుకున్న ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించి బ్రిడ్జి నిర్మించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం రైతులు కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రం సమర్పించారు.


ఎంపీ మాగుంటకు సమస్యను వివరిస్తున్న రైతులు

వైసీపీ హయాంలో భూదోపిడీ

●టీడీపీ మండల అధ్యక్షుడు శివకోటేశ్వరరావు

దొనకొండ, జూలై 18 : గత ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం రాక్షస పాలనతో భూదోపిడీకి పాల్పడిందని మండల టీడీపీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో అధిష్ఠానం ఆదేశాల మేరకు గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు, దోపిడీలపై ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం శ్వేతపత్రాలు విడుదల చేసిందన్నారు. రాష్ట్రంలో 1.75 లక్షల ఎకరాల భూ ఆక్రమణలు జరిగాయని, వాటి విలువ రూ. 35.576 కోట్లు, ఇళ్ల పట్టాల పేరుతో పదివేల ఎకరాలు, ఇసుక దందాలో రూ.9,750 కోట్లు దోచుకున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన భయంకరమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జీవో 512ను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. టీడీపీ దర్శి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ సుధాకర్, నాయకులు కొత్తం రఘునాథరెడ్డి, యగ్గని యల్లారెడ్డి, యరగొర్ల బసవయ్య, కొమ్మతోటి సుబ్బారావు, నాగసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Public are hereby informed that Our Corporation has sanctioned a Term Loan of **Rs.30.00 Lakhs (Rupees Thirty Lakhs Only) Dr. Kagitha Ratna Bharathi, W/o Dr. Yadala Ashok, C/o Ashok International Dental Hospital,** D.No.8-25/1, R.C.C.Building First Floor, South facing, Shop No.01, Opposite to Bethune Nursing Home, Mangamur Road, Ongole, Prakasam District, resident of Flat No.104, Silver Spring Apartment, Mangamuru Road, Ongole, Prakasam District. The Corporation proposes to create equitable mortgage over the following property. **Collateral Security :** Freehold Interest in the Residential Building in site admeasuring 227.75 Sq.yards in Sy.Nos.100/1 and 100/2, Plot No.3, Nearby Door No.1-3-13/3, Mamidipalem Village, Housing Board Colony, within the limits of Ongole Municipal Corporation, Prakasam District and is **Bounded by : North** : Land belongs to Sri Edupalli Venkaiah and others, **South** : Road, **East** : Plot No.4 property belongs to Smt.Pallapolu Lingamma, **West** : Plot No.2 property belongs to Sri Cherukuri Venkata Subba Rao, together with buildings constructed/and to be constructed thereon. The above property belongs to **Sri Yadala Ashok, S/o Sri Yadala Garataiah,** resident of Flat No.104, Silver Spring Apartment, Mangamuru Road, Ongole, Prakasam District and he purchased the property **vide registered sale deed document No.1354/2024** registered with Sub Registrar Office, Ongole, Prakasam District. He is now offering the above property as collateral security by depositing the above referred **original registered sale deed document No.1354/2024** together its link documents through registered memorandum of deposit of title deed by creating charge in favour of the Corporation in consideration of aforesaid Term Loan of **Rs.30.00 Lakhs (Rupees Thirty Lakhs Only)** sanctioned to **Dr.Kagitha Ratna Bharathi, W/o Dr.Yadala Ashok, C/o Ashok International Dental Hospital,** D.No.8-25/1, R.C.C.Building First Floor, South facing, Shop No.01, Opposite to Bethune Nursing Home, Mangamur Road, Ongole, Prakasam District, resident of Flat No.104, Silver Spring Apartment, Mangamuru Road, Ongole, Prakasam District. If there are any objections for the above mortgage, the same shall be inform to the undersigned along with necessary documentary evidence within seven days from the date of issuance of this public notice. If no objections are received, further action will be taken concluding the at the property is free from all claims/objections from the public.

Date : 18.07.2024 — **Branch Manager, A.P.State Financial Corporation**
Place : Ongole — **37-1-406(4), 2nd Lane, Bhagyanagar, Ongole-523001**

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
శుక్రవారం 19 జూలై 2024







గుండ్లపాడులో టీడీపీ నేత చంద్రయ్యను నడిరోడ్డులో గొంతుకోసి హత్య చేస్తున్న వైసీపీ మూకలు. ఇన్‌సెట్‌లో చంద్రయ్య (ఫైల్‌ఫొటో)



రెంటాలలో దగ్ధమవుతున్న బ్రహ్మానందరెడ్డి వాహనం (ఫైల్)



కారంపూడిలో టీడీపీ కార్యాలయాన్ని ధ్వంసం చేసిన వైసీపీ మూకలు (ఫైల్)



కారంపూడిలో టీడీపీ నేత కారుకు నిప్పుపెట్టిన దృశ్యం (ఫైల్‌ఫొటో)



మాచర్ల పట్టణంలో టీడీపీ కార్యాలయం వద్ద కారుకు నిప్పు పెట్టిన దృశ్యం (ఫైల్)



మాచర్ల టీడీపీ కార్యాలయానికి నిప్పుపెట్టిన దృశ్యం (ఫైల్)



జగనన్నా!... వీరికేదీ పరామర్శ..?

- వినుకొండకు వస్తున్నావ్... అండగా ఉంటానంటున్నావ్
- ఎన్నాళ్లకు జనంలోకొస్తున్నావ్!... చాలా సంతోషం...
- మరి వైసీపీ దాడి చేసిన వారినీ పరామర్శిస్తే బాగుండేదికదన్నా!
- ఎన్నికల ముందూ, తర్వాతా మీ వారు బరితెగించారు
- వారికీ సూక్తులు చెబితే బాగుండేదికదన్నా
- పోలీసుల తీరుపై విమర్శలు అస్సలు బాగోదేమో!
- వారిని మీరు వాడినంత ఎవరూ వాడలేదేమో!

నరసరావుపేట, తెనాలి, జూలై 18, (ఆంధ్రజ్యోతి): నోరు మెదిపితే సీఐడీ... కాలు కదిపితే పోలీస్ కేసు.. కబ్జాలపై నిలదీస్తే రౌడీ మూకలతో దాడులు... ఒకటా? రెండా ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, దాడులు, అకృత్యాలు, అరాచకాలే. ఇవన్నీ గడచిన ఐదేళ్ల మీ పాలనా కాలంలో సాగిన అధికారిక దందా. మీ దారుణాలు చూడలేక, భరించే ఓపికలేక జనం మీకు వ్యతిరేకంగా తీర్పునిచ్చినా మీ అకృత్యాలు మాత్రం ఆగలేదు. పల్నాడులో అయితే మారణహోమమే సృష్టించారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలో తెదేపా నాయకుడు చంద్రయ్యను అదే గ్రామానికి చెందిన వైసీపీ నేతలు పట్టపగలు అందరూ చూస్తుండగానే గ్రామ నడిబొడ్డున గొంతుకోసి హత్యచేశారు. ఇలాంటి సంఘటనలు పల్నాడు జిల్లాలో కోకొల్లలు, అంతేనా ప్రశాంతంగా ఉండే డెల్టా విషయానికి వస్తే.. 'ఇక సెలవు' అని పోస్ట్ పెట్టినందుకు ఓ నాయీబ్రాహ్మణుడి దుకాణాన్నే తగలెట్టేశారు. జనసేన జెండా పెట్టినందుకు ఇంటిపై దాడిచేసి విచక్షణా రహితంగా కొట్టారు. ఇట్లా చెబుతూపోతే మీ మూకలు చేసిన దారుణాలు ఎన్నో! మీరు అధికారంలో ఉండగా అన్యాయం జరిగిందని కన్నీరు పెట్టుకున్నా కరగని మనసు ఇప్పుడు చలించిందా? మీలో మానవత్వం ఇన్నాళ్లకు నిద్రలేచిందా! నిజంగా జనం, కార్యకర్తలకోసమే వస్తున్నారా? లేక ఇదీ రాజకీయమేనా? జనం కోసమే అయితే మీరు పరామర్శించాల్సిన కుటుంబాలు చాలానే ఉన్నాయి. వైసీపీ కార్యకర్తలతోపాటు, మీ పార్టీ గూండాలు చేసిన దాడుల్లో గాయపడి, ఆసుపత్రుల్లోచేరి ప్రాణాల కోసం పోరాడుతున్న టీడీపీ, జనసేన కార్యకర్తలను, వారి కుటుంబాలను కూడా పరామర్శిస్తే, వారికీ అండగా నిలిస్తే చాలా సంతోషం జగనన్నా. మీరు చెప్పాల్సిన శ్రీరంగ నీతులు, మానవత్వం తాలూకు సుభాషితాలు మీ ప్రభుత్వం పడిపోయాక కూడా ఆపకుండా దాడులకు తెగబడుతున్న మీ అనుచరులకు, కార్యకర్తల ముసుగులో వీరంగం చేస్తున్న గూండాలకు కూడా చెప్పగలిగితే రాష్ట్రంలో శాంతియుత వాతావరణం నెలకొనే అవకాశం ఉంటుందని బాధితులు వాపోతున్నారు.

మరో చంబల్ తరహాలో పల్నాడు జిల్లా

మేం చెప్పిందే జరగాలి..అడ్డొస్తే అంతమొందిస్తాం.. మీకు దిక్కున్న చోట చెప్పుకోండి..మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు. పల్నాడులో ఐదేళ్ల వైసీపీ నేతల బెదిరింపులివి. గ్రామాల్లోని ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలను తమవైపు రావాలని బెదిరించటం.. వినకపోతే వారిపై అక్రమ కేసులు బనాయించడం.. అప్పటికీ లొంగకపోతే దాడులు.. హత్యలు చేసే విష సంస్కృతి పల్నాడు జిల్లాలో గత ఐదేళ్ల సదరు నేతలు అమలు చేశారు. తమ ఆధిపత్యానికి అడ్డుగా ఉంటున్నారనుకున్న వారిని వైసీపీ శ్రేణులు అంతమొందించాయి. హత్యల పరంపరను కొనసాగించాయి. మాచర్ల, గురజాల, నరసరావుపేట నియోజకవర్గాల్లో ఈ అరాచక ధోరణి అమలు చేశారు. గ్రామాల్లో బలంగా ఉండే ప్రతిపక్ష పార్టీల నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులే లక్ష్యంగా ఈ హత్యలన్నీ ఒక దాని తర్వాత మరొకటి ప్రణాళిక ప్రకారం సాగించారు. దాడులు, హత్యలు జరిగితే.. అవి వ్యక్తిగత, పాత కక్షలతోనే జరిగాయని.. రాజకీయాలతో సంబంధం లేదని వెనువెంటనే పోలీసు అధికారులు ప్రకటించేవారు. కనీస దర్యాప్తు కూడా లేకుండానే ఆ హత్యలు, దాడులతో వైసీపీ నేతలకు సంబంధం లేదంటూ తేల్చేసేవారు. తమ ప్రాణాలకు ముప్పు ఉందని ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు తెలియజేసినా వారి రక్షణకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గ్రామాల్లో వైసీపీని ఎదిరిస్తే ప్రాణాలకే ముప్పు ఏర్పడేది. కొందరైతే గ్రామాలు వదలి వెళ్లి బంధువుల ఇళ్లలో తలదాచుకు న్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ పరిస్థితి కొనసాగింది.

కొన్ని ఘటనలు ఇలా..

- వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు చంద్రయ్యను అదే గ్రామానికి చెందిన వైసీపీ నేతలు పట్టపగలు అందరూ చూస్తుండగానే అత్యంత పాశవికంగా గుండెలమీద మోకాళ్లతో తొక్కిపెట్టి జై జగన్ అని అనలేదని గ్రామం నడిబొడ్డున గొంతుకోసి హత్యచేశారు. దుర్గి మండలం జంగమహేశ్వరపాడులో తెలుగుదేశం పార్టీ నాయకుడు జల్లయ్యను వైసీపీ నాయకులు పట్టపగలు గ్రామం ప్రధాన రహదారిపై దాడిచేసి హత్యచేశారు. ఈ గ్రామంలో తెలుగుదేశం సానుభూతిపరులైన 50 కుటుంబాలు గ్రామం విడిచిపెట్టి బంధువుల ఇళ్లలో తలదాచుకున్నాయి. వీరి పొలాలను బీడులుగా మార్చారు. గురజాల మండలం అంబాపురంలో ఎస్సీ సామా జికవర్గానికి చెందిన తెలుగుదేశం కార్యకర్త విక్రంను అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు హత్యచేశారు. గురజాల పోలీసు స్టేషన్ నుంచి ఇంటికి వెళుతుండగా గ్రామంలోనే దాడిచేసి మట్టుబెట్టారు. దాచేపల్లి మండలం పెదగార్లపాడుకు చెందిన మాజీ సర్పంచి, టీడీపీ నేత పురంశెట్టి అంకుల్ దాచేపల్లిలో హత్యకు గురయ్యారు. అదే గ్రామానికి చెందిన వైసీపీ నేత ఒకరు హత్యలో కీలకపాత్ర పోషించారు. దాచేపల్లిలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనం వద్దకు రావాలని పిలిచి గొంతుకోసి హత్యచేశారు.
- నరసరావుపేటలో మసీదు స్థలం వివాదంలో టీడీపీకి చెందిన ఇబ్రహీంను జనసంచారంలోనే వైసీపీ వారు కత్తులతో దాడి చేసి హతమార్చారు. పిడుగురాళ్ల పట్టణ శివారులో తుమ్మలచెరువుకు చెందిన తెలుగుదేశం కార్యకర్త షేక్ సైదాను వైసీపీ కార్యకర్తలు కర్రలతో కొట్టి గాయపరిచారు.
- మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో తెలుగుదేశం వారిపై వైసీపీ అల్లరిమూకలు దాడులకు తెగబడ్డాయి. అప్పట్లో గ్రామాలు వదిలివెళ్లిన 50 కుటుంబాలవారు బంధువుల ఇళ్లల్లో తలదాచుకున్నారు. ఎన్నికల ముందే ఈ కుటుంబాలు పిన్నెల్లికి తిరిగి వచ్చాయి. తురక పాలెంలో టీడీపీ కార్యకర్త ఇంటికి నిప్పు పెట్టి తగలబెట్టారు. ఆ సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న నలు గురు ప్రాణాలతో బయటపడ్డారు. ఇదే గ్రామంలో టీడీపీ సానుభూతిపరులకు చెందిన నలుగురి గడ్డివాములు తగలబెట్టారు. కొత్తగణేశునిపాడులో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ వారు దాడి చేసి కొట్టారు. ఇలా అనేక సంఘటనలు జరిగాయి. వైసీపీలోకి వస్తే సరే.. లేదంటే అంతే.. ఆధిపత్యం కోసం ప్రత్యర్థులపై దాడులు.. హత్యలు సాగించారు. పల్నాడులో పట్టపగలే హత్యలు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఐదేళ్ల వరసగా ఘటనలు చోటుచేసుకుంటు న్నాయి. ఆర్థిక, రాజకీయపరమైన కారణాలతోపాటు ఆధిపత్యం కోసం హత్యలు, దాడులు సాగించిన వైసీపీ అరాచకాలను జిల్లా వాసులు ఇంకా మరిచిపోలేదు.

శాంతియుత డెల్టాలో దారుణాలెన్నో!

ఎన్నికలకు ముందు అధికారం, అన్నిరకాల అండదండలు ఉండటంతో చేసిన దాడులు, దారుణాలెన్నో ఉన్నాయి. నిత్యం పచ్చని పైరుగాలులతో, ప్రశాంతంగా ఉండే డెల్టా ప్రాంతం కక్షలు, కార్పణ్యాలతో రగిలిపోయింది. అప్పుడు అధికారం, పోలీస్ యంత్రాంగం పూర్తిగా సహకరించాయి కదా అనుకుంటే, అధికారంలో నుంచి దిగిపోయాక కూడా దాడులు ఆగలేదు. గుంటూరు, బాపట్ల జిల్లాల్లో కృష్ణా డెల్టా ప్రాంతం కిందున్న నియోజకవర్గాలు తెనాలి, పొన్నూరు, మంగళగిరి, వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజకవర్గాల్లో జరిగిన దాడులే దీనికి ఉదాహరణ. తెనాలి నియోజకవర్గంలో ఎన్నికల తర్వాత కూటమి గెలవటంతో బాణాసంచా పేల్చుకుంటూ సంబరాలు చేసుకుంటున్న టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కౌన్సిలర్, ఆయన అనుచరులు దాడిచేయటం అమానుషమే. దీనికి అప్పట్లో పోలీసులు కూడా మీ పార్టీ నాయకులకే అండగా నిలిచిన పరిస్థితి. మరో కౌన్సిలర్ టీడీపీ నాయకులపై కత్తులతో దాడిచేయించిన సంఘటనా మర్చిపోలేనిదే. తేలప్రోలులో జనసేన జెండా ఇంటిపై కట్టాడని, జెండా దిమ్మె ఏర్పాటు వివాదాన్ని పెంచి, చివరకు కత్తులతో దాడిచేసిన సంఘటన తాజాగా జరిగిందే. బాధితుడు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడుకూడా. మరో వైసీపీ నాయకుడు టీడీపీ కార్యకర్తపై దాడిచేసి, తల పగులగొట్టిన సంఘటనా తాజాగానే జరిగింది. ఇతనూ ఆసుపత్రిలోనే ఉన్నాడు. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం అద్దేపల్లిలో టీడీపీ దిమ్మెను పగులగొట్టి, తర్వాత టీడీపీ శ్రేణులపై దాడులకు దిగిన పరిస్థితి. అమృతలూరు మండలం పాంచాలవరం గ్రామంలో ఓ నాయీబ్రాహ్మణుడు ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక 'ఇక సెలవు జగన్' అని ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టినందుకు వైసీపీ శ్రేణులు అతని మంగలి షాప్ బడ్డీనే తగలబెట్టేశారు. అతను జీవనాధారం పోయి రోడ్డున పడిన పరిస్థితి. ఇటువంటివారిని పరామర్శిస్తే నిజంగా జనం కోసం జగన్ జనంలోకి వచ్చినట్లువుతుందని, లేకుంటే... కేవలం రాజకీయ దురుద్దేశమే అవుతుంది జగనన్నా.



వైసీపీ మూలక దాడిలో గాయపడ్డ సీఐ నారాయణ స్వామి (ఫైల్)



వైసీపీ మూకల చేతిలో హత్యకు గురైన జల్లయ్య (ఫైల్)



తీవ్ర గాయాలతో టీడీపీ ఏజెంట్ శేషగిరిరావు (ఫైల్)



వైసీపీ మూకల దాడిలో గాయపడిన శేర్రెడ్డి మంజుల (ఫైల్)

నేడు వినుకొండలో జగన్ పర్యటన

పాత కక్షలతోనే హత్య : ఎస్పీ శ్రీనివాసరావు

పాత కక్షలతో రషీద్ హత్య జరిగిందని పల్నాడు ఎస్పీ కే శ్రీనివాసరావు ప్రకటించారు. అయితే దీనిని రాజకీయం చేసి టీడీపీకి అంటగట్టేందుకే జగన్ వినుకొండ వస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రషీద్ హత్య సంఘటనపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాపు చేయాలని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు డిమాండ్ చేశారు. రషీద్ హత్యను రాజకీయ లబ్ధి కోసం వాడుకునేందుకు జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలు యత్నిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనంతా అరాచకాలతో సాగిందని జిల్లాలో ఎవరిని అడిగినా చెబుతారు. నాడు అరాచకాలతో బరితెగించి ఎదురు ప్రశ్నించిన వారిని వైసీపీ నేతలు అడ్డుతొలగించారు. వినుకొండలో హత్యకు గురైన షేక్ రషీద్ కుటుంబాన్ని పరామర్శించడానికి వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం వస్తున్నారు. ఐదేళ్ల తన పాలనలో జిల్లా దాడులు.. హత్యలతో అట్టుడికిపోతే నోరు మెదపని జగన్‌రెడ్డి నేడు అరాచకపాలన జరుగుతుందని అయన విమర్శించడాన్ని జిల్లా వాసులు నవ్వుకుంటున్నారు. నాడు అరాచకాలు జగన్‌కు కనపడలేదా అని నిలదీస్తున్నారు.

టీడీపీ నేతల ఆస్తుల ధ్వంసం

మాచర్ల పట్టణంలో టీడీపీ ఆధ్వర్యంలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని అప్పటి టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మానందరెడ్డి నిర్వహిస్తుండగా పిన్నెల్లి రౌడీ గ్యాంగ్ చిన కాన్వెంట్ వద్ద కవ్వింపు చర్యలకు పాల్పడి టీడీపీ నేతల కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. పోలీసులు ఆ కార్యక్రమాన్ని నిలిపివేసి బ్రహ్మానందరెడ్డిని ఊరు నుంచి బయటకు పంపేశారు. తదుపరి రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి తన రౌడీ గ్యాంగుతో పట్టణంలో టీడీపీకి చెందిన కార్లు, గృహాలు, పార్టీ కార్యాలయాలు ధ్వంసం చేసి తగులబెట్టారు. మాచర్ల పట్టణాన్ని రావణకాష్టంగా మార్చారు. దీనిపై పోలీసులు తిరిగి టీడీపీ వారిపైనే 307 కేసులు కట్టి జైలుపాలు చేశారు.

సార్వత్రిక ఎన్నికల్లో అకృత్యాలు...

సార్వత్రిక ఎన్నికల ముందు రోజు రెంటచింతలలో టీడీపీ ఏజెంట్లు సిద్దయ్య, మల్లయ్యలపై వైసీపీ రౌడీ మోర్తాల ఉమామహేశ్వరరెడ్డి దాడి చేసి తలలు పగులకొట్టారు. పోలింగ్ రోజు మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రౌడీ గ్యాంగ్‌ను వేసుకొని పాలువాయి గేటులోని 202 పోలింగ్ బూత్‌లో ప్రవేశించి ఈవీఎం, వీవీ ప్యాడ్స్‌ను ధ్వంసం చేశారు. అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంట్ నంబూరి శేషగిరిరావును తన రౌడీ గ్యాంగ్‌తో పదునైన ఆయుధాలతో దాడి చేయించారు. ప్రశ్నించిన మరో మహిళ చెరుకూరి నాగశిరోమణిను దూషిస్తూ వేలుచూపిస్తూ మరీ బెదిరించారు. ఇదే మండలంలోని రెంటాలలో టీడీపీ ఏజెంట్ శేర్రెడ్డి మంజుల, గోపాలరెడ్డిలపై దాడి, కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డిపై కారం చల్లి దాడికి యత్నించడం, కారు ధ్వంసం చేసి తగులబెట్టారు. కేపీ గూండెంలో ఏజెంట్ రేఖ్యానాయక్‌పై దాడి చేసి ఏజెంట్లను పోలింగ్‌బూత్‌ల నుంచి బయటకు లాగేశారు. పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి కండ్లకుంటలో ఏజెంట్‌గా కూర్చున్న నోముల మాణిక్యరావు కుటుంబ సభ్యులపై దాడి చేయించి వీడియో చూపించి ఏజెంట్‌ను బయటకు లాగేశారు. అలాగే మాచర్ల పట్టణంలో పీడబ్ల్యూడీ కాలనీలో తన గ్యాంగ్‌ను వెంట వేసుకొచ్చి కారుతో ఢీకొట్టి 8 మందిని తీవ్రంగా గాయపరిచారు. టీడీపీ నేత యెనుముల కేశవరెడ్డి గృహాన్ని ధ్వంసం చేశారు. పోలింగ్ మరుసటి రోజు కారంపూడిలో రౌడీ గ్యాంగును వెంటబెట్టుకొని వెళ్లి టీడీపీ కార్యాలయం, టీడీపీ సానుభూతిపరుల దుకాణాలు, కార్లు ధ్వంసం చేసి నిప్పు పెట్టారు. అడ్డుకున్న సీఐ నారాయణస్వామి తలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఇలా గత ఐదేళ్లలో వైసీపీ అరాచకాల చిట్టాకు అంతేలేదు.

భూ సేకరణ తప్పదా?

- సీడ్ యాక్సెస్ రోడ్డుకు భూములపై తర్జన భర్జనలు

విజయవాడ, జూలై 18(ఆంధ్రజ్యోతి): సీడ్ యాక్సెస్ రోడ్డుకు 2వ దశ (బ్యాలెన్స్) పనులకు భూసేకరణ దిశగానే వెళ్లాలని సీఆర్‌డీఏ మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. ఆ దిశగా వెళ్లాలన్నది అధికారికంగా సీఆర్‌డీఏ ప్రకటించలేదు. భూసేకరణ అంశంపై మరోమారు సీఆర్‌డీఏ అధికారులు పునరాలోచన చేయాలని భావిస్తున్నారు. రెండురోజుల్లో ఈ అంశంపై పూర్తి స్పష్టత వస్తుంది. ప్రభుత్వస్థాయిలో జోక్యం ఉంటే భూసమీకరణ వైపు మొగ్గుచూపే అవకాశాలున్నాయి. అమరావతి పునర్నిర్మాణ పనుల్లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు యుద్ధప్రాతిపదికన సీడ్ యాక్సెస్ రోడ్డును పూర్తిచేయాలన్నది సీఆర్‌డీఏ ప్రధాన లక్ష్యం. సీడ్‌యాక్సెస్ రోడ్డు ప్రస్తుతం వెంకటపాలెం వరకు 18 కిలోమీటర్ల నిడివిన ఉంది. ఇక్కడినుంచి మరో 3 కిలోమీటర్ల మేర బ్యాలెన్స్ పనులు మిగిలిఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పలువురు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీం తో ఉండవల్లి మండలం పెనుమాక నుంచి కనకదుర్గ వారధి వద్ద మణిపాల్ హాస్పిటల్ పక్కనుంచి ఎన్‌హెచ్-16కు సీడ్ యాక్సెస్ రోడ్డును అనుసంధానించటం ఆగిపోయింది. మళ్లీ ప్రభుత్వం కొలువు తీరాక.. అమరావతి రాజధాని విధ్వంసాన్ని కళ్లారా చూసిన అనుభవంతో తమకు తాముగా సహకరించేందుకు రైతులు సంసిద్ధమయ్యారు. మంత్రి నారాయణ రాజధా నిలో పర్యటించిన సందర్భంలో రైతులు తమ సమ్మతిని తెలిపారు. దీంతో సీఆర్‌డీఏ అధికారులు రైతులతో సంప్రదింపులు జరిపా రు. ఉండవల్లి మండల పరిధిలో భూములు అవసరమైన గ్రామాల్లో సమావేశాలను తలపెట్టారు. రైతుల్లో మిశ్రమ అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. తమ భూముల ధరలు ఎక్కువగా ఉన్నందున పూలింగ్ ప్యాకేజీని పెంచాలన్నది వీరి ప్రధాన డిమాండ్. దాదాపుగా 2వేల చదరపు గజాల మేర అభివృద్ధి చేసిన ప్లాట్లు కోరుతున్నారు. అందరి రైతుల్లోనూ ఇదే ప్యాకేజీ కావాలన్న డిమాండ్ రావటం లేదు. పలువురు రైతులు ఇంకా ఎక్కువ డిమాండ్ చేస్తున్నారు. రైతుల మధ్య భిన్నాభిప్రాయాలు నెలకొనటంతో ఏకాభిప్రాయానికి వచ్చేవరకు కొంత సమయం ఇవ్వాలని సీఆర్‌డీఏను రైతులు కోరారు. ఫలితంగా రైతులతో సంప్రదింపుల ప్రక్రియను తాత్కాలికంగా సీఆర్‌డీఏ అధికారులు నిలిపివేశారు. రైతులు కోరినట్టుగా గరిష్ట ప్యాకేజీ ఇచ్చే విషయంలో కొన్ని సమస్యలున్నాయి. ప్రస్తుతం అదనంగా పూలింగ్ కింద భూములిచ్చే పరిస్థితి దాదాపుగా లేదని తెలుస్తోంది. పూలింగ్ కింద కొత్తగా రిటర్నబుల్ ప్లాట్లను ఇవ్వటం కొంత కష్టంగానే ఉందని తెలుస్తోంది. పూలింగ్ కింద ప్యాకేజీ కల్పించాలంటే.. ఈ ప్యాకేజీ కోసం మళ్లీ భూములు తీసుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. దీనికితోడు ప్యాకేజీ ఎక్కువగా అడగటం ఇంకాస్త ఇబ్బందిగా ఉంటోంది. దీనికంటే భూసేకరణ దిశగా వెళ్లటం వల్లనే సమస్య తేలిగ్గా పరిష్కారమౌతుందన్న ఆలోచన కూడా చేస్తున్నట్టు తెలుస్తోంది. దీనికితోడు సీడ్‌యాక్సెస్ రోడ్డు (ఈ-3)తో పాటుగా ఈ-11, ఈ-13 రోడ్లను కూడా ఎన్‌హెచ్-16కు అనుసంధానించాలని సీఆర్‌డీఏ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ 2 రోడ్లను ఎన్‌హెచ్-16కు అనుసంధానించటానికి పెద్దగా భూములు అవసరం లేదు. జాతీయ రహదారి దగ్గర అనుసంధానించేచోట కొంతమేర భూములు సేకరించాల్సి ఉంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని భూసేకరణ దిశగా వెళ్లాలని భావిస్తున్నా.. ప్రభుత్వం భూసమీకరణ దిశగానే వెళ్లమంటే మాత్రం ఆ దిశగానే సీఆర్‌డీఏ అడుగులు వేసే అవకాశం ఉంది.

తీర ప్రాంతంలో ఆక్వా పార్కు టూరిజం అభివృద్ధి

- కలెక్టర్ వెంకటమురళి

రేపల్లె, జూలై 18: తీరప్రాంతంలో టూరిజం ఆక్వాపార్కు ఏర్పా టుకు స్థల సమీకరణను పరిశీలిస్తున్నామని కలెక్టర్ వెంకటమురళి అన్నారు. నిజాంపట్నం మండలం సంజీవ్‌నగర్‌లో గురువారం కలెక్టర్ వెంకటమురళి, మత్స్యశాఖాధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్రం వెనక్కివెళ్ళటం వల్ల ఈ ప్రాంతాల్లో 300 ఎకరాల భూమి లభించటం, ఆ భూమిని అభివృద్ధి కోసం కేటాయించటం జరిగిందన్నారు. 50 ఎకరాలు టూరిజం కోసం, 192 ఎకరాలు ఆక్వాపార్కుకు, అటవీశాఖకు 50 ఎకరాలు కేటాయిస్తామన్నారు. సముద్రతీర ప్రాంతంలో టూరిజం అభివృద్ధి చేస్తే వెనుకబడిన ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎప్పటినుంచో వనామి పంట వేస్తున్నారని, ఆ పంటవల్ల ఆక్వా రైతులు నష్టపోతున్నారన్నారు. ఈ కారణంగా దూర ప్రాంతాల నుంచి వేరే సీడ్‌ను రైతులు తెప్పించుకుని ఆక్వా పంట వేయటం, దానిలో నష్టాలు చవిచూడటం జరుగుతుందన్నారు. ఆక్వా రైతుల కష్టాలను తొలగించేందుకే ఆక్వాపార్కును ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు కేంద్రప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయని, స్థలసమీకరణ పూర్తైతే ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామన్నారు. పర్యాటక రంగంగా అభివృద్ధి చేసేందుకు అన్ని ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. సముద్రం వెంట పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. వీటికి కావాల్సిన స్థలాన్ని తక్షణమే సేకరించేలా రెవెన్యూ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో హేలా షారోన్, మత్స్యశాఖ జేడీ సురేష్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ శిల్ప, అనగాని శివప్రసాద్, పంతాని మురళీధరరావు, నర్రా సుబ్బయ్య, తాతా ఏడుకొండలు, బొమ్మిడి రామకృష్ణ పాల్గొన్నారు.

నిజాంపట్నం మండలంలో కలెక్టర్ వెంకటమురళికి స్థలాన్ని చూపెడుతున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్





చుట్టూ గడ్డితో నిరుపయోగంగా ఉన్న ఈపురుపాలెంలోని ఓ బ్లాక్ లెవల్ క్లస్టర్

ఉన్నా.. లేనట్లే..!

- నిరుపయోగంగా హ్యాండ్లూమ్ బ్లాక్ లెవల్ క్లస్టర్లు
- చంద్రబాబు రాకతో ప్రారంభించాలని కోరుతున్న నేతన్నలు

చీరాల, జూలై 18 : చేనేత రంగం సంక్షోభంలో ఉంది. ఆ రంగానికి చేయూతనిస్తామని వైసీపీ పాలకులు చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయి. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో చీరాల నియోజకవర్గంలో బ్లాక్ లెవల్ క్లస్టర్లు ఏర్పాటుకు బీజం పడింది. రెండు విడతలుగా నిధులు మంజూరు చేశారు. ఆ క్రమంలో కొన్ని నిర్మాణాలు పూర్తయ్యాయి. మరి కొన్ని తుది దశకు చేరాయి. ఆ క్రమంలో 2019లో టీడీపీ ప్రభుత్వం మారి వైసీపీ వచ్చింది. 2019-24 మధ్య ఆ క్లస్టర్లును వినియోగంలోకి తెచ్చేందుకు పాలకులు, అధికారులు చేసిన ప్రయత్నం నామమాత్రం కూడా లేవనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. చీరాల నియోజకవర్గంలో 9 బీఎల్‌సీ (బ్లాక్ లెవల్ క్లస్టర్)లు ఉన్నాయి. అందులో చీరాల మండలం తోటవారిపాలెంలో 1, దేవాంగపురిలో 1, ఈపురుపాలెంలో 3, వేటపాలెం మండలం వేటపాలెంలో 1, దేశాయిపేటలో 2, కొణిజేటి చేనేతపురిలో 1 ఉన్నాయి. వీటిలో తోటవారిపాలెంలో 769 మంది, దేవాంగపురిలో 744 మంది, ఈపురుపాలెంలో తూర్పులో 765 మంది, పశ్చిమలో 770 మంది, దక్షిణంలో 772 మంది, దేశాయిపేట తూర్పులో 767 మంది, పశ్చిమలో 767 మంది, చేనేతపురిలో 730 మంది, వేటపాలెంలో 741 మంది చేనేత కార్మికులకు ప్రయోజనం చేకూర్చాలనేది లక్ష్యం. అందుకు 2015 డిసెంబర్‌లో ఒక్కో క్లస్టరుకు సుమారు రూ. 42 లక్షలు మంజూరు చేశారు. తరువాత 2017 డిసెంబరులో ఒక్కో క్లస్టరుకు సుమారు రూ.24 లక్షలు మంజూరు చేశారు.

ప్రస్తుత పరిస్థితి ఏంటి..?

నియోజకవర్గ పరిధిలోని 9 క్లస్టర్లలో ఉమ్మడి అవసరాలకు సంబంధించి మగ్గాలు కొన్నింటిలో ఉన్నాయి. కొన్నింటిలో మగ్గాలు కూడా లేవు. ఇప్పటి వరకు అధికారికంగా ఆ క్లస్టర్లను కూడా ప్రారంభించలేదు. అయితే కొన్ని చోట్ల మాత్రం ఐదారు నెలల కిందట అధికారులు వచ్చి కొందరు కార్మికులను మగ్గాల దగ్గర పనిచేస్తున్నట్లు ఉంచి ఫొటోలు తీసుకున్నట్లు తెలిసింది. ఆ క్రమంలో కొన్నింటిని చేనేత సహకార సంఘాలకు అప్పగించినట్లు సమాచారం. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున బ్లాక్ లెవల్ క్లస్టర్లు పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చి చేనేత కార్మికులకు ఉపయోగపడేలా చూడాలని నేతన్నలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రాజమోహన్‌రావు

నల్లమడ వాగు అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

- గుంటూరు చానల్‌ను పొడిగించి ఆదుకోవాలి
- రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ రాజమోహన్

చెరుకూరు(పర్చూరు), జూలై 18 : నల్లమడ వాగులను అభివృద్ధి చేయకపోవడం వల్ల కొద్దిపాటి వరదలకు సైతం వేల ఎకరాల్లో పంట భూములు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారని నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్ అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయించి నల్లమడ వాగు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం చెరుకూరులో నలమడ రైతు సంఘం అధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రైతులతోపాటు, ప్రజలు తాగు, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగిస్తే నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రైతులు పండించిన పంటలకు కూడా గిట్టుబాటు ధరలు కల్పించే విధంగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించాలన్నారు. ప్రభుత్వం పంటలకు మద్దతు ధర కల్పించినా వ్యాపారులు తక్కువ ధరలకే కొంటున్నారన్నారు. రైతులు పండించిన పంటలకు ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ విజయకుమార్, యార్లగడ్డ అంకమ్మచౌదరి, మానం విజేత, వైఏ చౌదరి, కామేపల్లి కృషిబాబు, అడ్డగడ్డ వెంకటేశ్వర్లు, యర్రాకుల వెంకటేశ్వర్లు, దాసరి ఉషారాణి, రామకృష్ణ పాల్గొన్నారు.

రాయితీపై నిత్యావసర సరుకులు

మేదరమెట్ల, జూలై 18 : సామాన్య ప్రజలకు రాయితీపై నిత్యావసర సరుకులు అందించేందుకు ప్రభుత్వం ప్రారంభించిన దుకాణాలను ప్రజలు ఉపయోగించుకోవాలని తహసీల్దార్ బి.సుశీల తెలిపారు. గురువారం మేదరమెట్లలో రాయితీపై బియ్యం, కందిపప్పు అమ్మకాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు సామాన్య ప్రజలకు నిత్యావసరమైన సరుకులను తక్కువ ధరకు రైసు మిల్లర్స్ అసోసియేషన్ ద్వారా పంపిణీ చేసినట్లు చెప్పారు. బాయిల్డ్ రైస్ కేజీ రూ.48, కందిపప్పు రూ.160, ముడి బియ్యం కేజీ రూ.49 చొప్పున విక్రయిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గీతారాణి, వీఆర్‌వో రాజేశేఖర్‌రెడ్డి, రైస్ మిల్లర్లు దోప్పలపూడి హరిబాబు, అయ్యవరయ్య, శ్రీనివాసరావు, స్థానిక రేషన్ డీలర్లు ఉన్నారు.

మంచిరోజులొచ్చాయ్!

పాడి రైతులకు శుభవార్త
రాయితీపై పశువుల షెడ్లు
గొర్రెలు, మేకలు, పౌల్ట్రీలకు కూడా
ఉపాధి నిధులతో అనుసంధానం
పశుసంవర్థకశాఖ ద్వారా లబ్ధిదారుల ఎంపిక
విధి విధానాలపై అధికారులతో ఆశాఖ డైరెక్టర్ వీడియో కాన్ఫరెన్స్
గత టీడీపీ కాలంలో గోకులం పేరుతో అమలు, వైసీపీ వచ్చాక నిర్లక్ష్యం



పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులకు మంచిరోజులొచ్చాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే వారి సంక్షేమంపై దృష్టిపెట్టింది. మొదటిగా భారీ రాయితీపై వారికి షెడ్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు అధికారులకు ఆదేశాలు అందాయి. దీనిపై కసరత్తు మొదలైంది. ఎప్పటి నుంచి ఆశగా ఎదురు చూస్తున్న పాడిరైతులకు ఇక 90శాతం రాయితీపై షెడ్లు నిర్మించేందుకు అంతా సిద్ధం చేస్తున్నారు. పశుసంవర్థక శాఖ లబ్ధిదారులను ఎంపిక చేయనుండగా, డ్వామా ఆధ్వర్యంలో మంజూరు, నిర్మాణం వంటివి చేపడతారు. ఉపాధి హామీ పథకం నిధుల అనుసంధానంతో పథకం అమలుకానుంది. మూడు విభాగాలుగా షెడ్లను నిర్మించనున్నారు.

ఒంగోలు, జూలై 18(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వకాలంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన పశుసంవర్థక శాఖపై ప్రస్తుత తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. పాడి రైతులతో పాటు గొర్రెలు, మేకల పెంపకందారులు, పౌల్ట్రీ రంగంపై ఆధారపడిన వారికి శుభవార్త వచ్చింది. ఆయా వర్గాల రైతులకు భారీ రాయితీపై షెడ్ల నిర్మాణానికి సర్కార్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉపాధి పథకం నిధులు అనుసంధానంతో ఈ షెడ్ల నిర్మాణం చేయనున్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పశుసంవర్థకశాఖ ఆద్వర్యంలో జరగనుండగా షెడ్ల మంజూరు, నిర్మాణం ఇతరత్రా అంశాలు ఉపాధి పథకం పర్యవేక్షించే డ్వామా పరిధిలో జరగనున్నాయి. ప్రాథమికంగా పశుసంవర్థకశాఖ అధికారులు ఇందుకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ అమరేందర్‌రావు సోమవారం సాయంత్రం అన్ని జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి పశుసంవరకశాఖ జిల్లా అధికారి డాక్టర్ బేబీరాణి, ఏసీడీపీ మేనేజర్ సీహెచ్ వెంకట్రామిరెడ్డి, పలువురు ఇతర ఆ శాఖ అధికారులు ఆ వీసీలో పాల్గొన్నారు.

పాడి పరిశ్రమను నిర్లక్ష్యం చేసిన వైసీపీ

గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో పశు సంరక్షణకు పెద్దపీట వేసింది. పశువైద్యం, రుణాలు ఇచ్చి గేదెల కొనుగోలు, వ్యాక్సినేషన్ వంటి వాటితోపాటు పశుసంరక్షణ కోసం భారీ షెడ్లు నిర్మాణం చేపట్టింది. గోకులం పేరుతో పెద్దవి, మినీగోకులం పేరుతో చిన్నవి సుమారు రూ.9కోట్లతో 500లకుపైగా చేపట్టారు. వాటిలో 90 శాతం నిర్మాణాలు ప్రారంభించి సగం వరకు పూర్తిచేశారు. అలాగే ఊరూరా పశుగ్రాస క్షేత్రాల పేరుతో పెద్దఎత్తున గడ్డి పెంపకం చర్యలు చేపట్టారు. కాగా వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పథకాలను అటకెక్కించింది. గోకులాలు నిర్మించుకున్న వారికి కూడా డబ్బులు చెల్లింపు చేయలేదు. పాడి పరిశ్రమను, పశుసంరక్షణను నిర్లక్ష్యం చేసింది. పశుబీమా పథకాన్ని, మొబైల్ వైద్య సేవలను ఆర్భాటంగా ప్రకటించినా ఆచరణలో పశుపోషకులకు అవి అందిన దాఖలాలు లేవు.

అధికారంలోకి వస్తూనే దృష్టి

కాగా తిరిగి తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి రాగానే పశుసంరక్షణపై దృష్టిసారించింది. తొలినెల రోజులు గడిచేలోపే పాడి రైతులకు ఉపకరించే పథకాలకు శ్రీకారం చుట్టింది. పశువులతో పాటు గొర్రెలు, మేకలు, పౌల్ట్రీ షెడ్ల నిర్మాణాలు చేపట్టాలని సంకల్పించింది. అందుకు సంబంధించి ఈనెల 1నే సంబంధిత మంత్రి కే.అచ్చెన్నాయుడు ఉత్తర్వులు ఇవ్వగా పూర్తిస్థాయి విధివిధానాలు తాజాగా వెల్లడయ్యాయి. వాటి అమలుపై పశుసంవర్థక శాఖ అధికారులతో ఆ శాఖ డైరెక్టర్ అమరేందర్‌రావు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పశువుల షెడ్లను మూడు విభాగాలుగా విభజించారు. గరిష్ఠంగా ఆరు గేదెలు కోసం నిర్మించే షెడ్లకు రూ.2.30లక్షలు మంజూరు చేయనున్నారు. అందులో కేవలం పదిశాతం మాత్రమే లబ్ధిదారుడు చెల్లిస్తే మిగిలిన 90శాతం నిధులను ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ప్రభుత్వం సమకూర్చనుంది. అదే నాలుగు గేదెలకు అయితే రూ.1.85 లక్షలు, రెండు గేదెలకు అయితే రూ.1.15 లక్షలుగా యూనిట్ విలువగా నిర్ణయించారు.

జీవాల పెంపకందారులకు కూడా...

అలాగే గొర్రెలు, మేకలకు సంబంధించి చూస్తే 20 గొర్రెలకు రూ.1.30 లక్షలు, 50 గొర్రెల కోసం రూ.2.30లక్షలు, పౌల్ట్రీ షెడ్లకు రూ.87వేలు, అదే 100కు అయితే రూ.1.32 లక్షలుగా యూనిట్‌గా నిర్ణయించారు. అయితే పశువుల షెడ్లకు లబ్ధిదారులు 10శాతం చెల్లిస్తే సరిపోనుండగా మిగతా వాటికి 30శాతం వాటా చెల్లించాలి. ఆ మేరకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వగా లబ్ధిదారులకు అవగాహన కల్పించి వారిని ఎంపిక చేసే బాధ్యతను పశుసంవర్థకశాఖ అధికారులపై పెట్టింది. సంబంధిత అంశాలను సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో డైరెక్టర్ అమరేందర్‌రావు ఆ శాఖ అధికారులకు వివరించారు.

జిల్లావాసులకు ఊరట

తాగునీటి అవసరాల కోసం సాగర్ జలాలు విడుదల
రెండు రోజుల్లో జిల్లాకు చేరే అవకాశం

ఒంగోలు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాగునీటి ఎద్దడితో ఇబ్బందిపడుతున్న ప్రజానీకానికి కాస్తంత ఊరట కలగనుంది. తాగునీటి అవసరాల కోసం సాగర్ డ్యామ్ నుంచి బుధవారం జలాలను విడుదల చేశారు. రెండు రోజుల్లో అవి జిల్లాకు చేరే అవకాశం ఉంది. జిల్లాలో తాగునీటి అవసరాలు తీర్చే ప్రధాన వనరు సాగర్ నీరు కాగా గత ఏడాది డ్యామ్ నిండకపోవడంతో సక్రమంగా నీటి సరఫరా జరగలేదు. దాదాపు ఏడాదిన్నరగా అరకొరగానే నీటి విడుదల జరుగుతుంది. దీంతో ఒంగోలు నగరంతో పాటు మార్కాపురం, కనిగిరి, పొదిలి, దర్శి వంటి ప్రధాన పట్టణాలు వందలాది గ్రామాల్లో నీటికి జనం ఇబ్బందిపడుతున్నారు. ఎప్పటికప్పుడు ఆయా నీటి వనరులైన రామతీర్థం రిజర్వాయర్‌తోపాటు ఇతర ఎస్ ఎస్ ట్యాంకులు, సాగర్ కాలువల ఆధారిత చెరువులు అడుగంటిపోతున్నాయి. గత మేలో అరకొరగా డ్యామ్ నుంచి నీటిని ఇవ్వగా ప్రస్తుతం కూడా రామతీర్థం ఇతర వనరులలో నీరు డెడ్‌స్టోరేజీకి చేరింది.



స్పందించిన కేఆర్ఎంబీ

సాగర్ కుడి కాలువ పరిధిలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోనూ ఇలాంటి పరిస్థితే ఉండటంతో నాలుగు రోజుల క్రితం జరిగిన కేఆర్ఎంబీ సమావేశంలో ప్రభుత్వం ఈ విషయాన్ని ప్రముఖంగా చర్చకు పెట్టి తక్షణం కుడి కాలువకు ఐదు టీఎంసీలు విడుదల చేయాలని కోరింది. దీనిపై కేఆర్ఎంబీ స్పందించి ఇచ్చిన ఆదేశాలతో బుధవారం డ్యామ్ నుంచి కుడి కాలువకు నీటిని విడుదల చేశారు. కుడికాలువ పరిధిలోని నాలుగు జిల్లాలకు తొమ్మిదిరోజుల పాటు 4.50 టీఎంసీల నీరు డ్యామ్ నుంచి బుగ్గవాగుకు చేరుతుండగా అక్కడి నుంచి శుక్రవారం దిగువకు ఇవ్వనున్నారు. జిల్లాలోని రామతీర్థంకు నీరు చేరేలా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు ఆదివారం జిల్లా సరిహద్దుకు ఆ నీరు రానుంది. కాగా ఒంగోలు ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోని వనరులకు 2 టీఎంసీలు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుండగా అందులో అర టీఎంసీని బాపట్ల జిల్లాలోని చెరువులకు, ఒక టీఎంసీ నీటిని రామతీర్థం రిజర్వాయర్‌కు చేర్చి మిగిలిన అర టీఎంసీ నీటిని రామతీర్థం ఎగువ ప్రాంతంలో ఉన్న ట్యాంకులు, అలాగే సాగర్ కాలువ ఆధారంగా జిల్లాలో ఉన్న 70కిపైగా చెరువులను నింపేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు నీరు వృథా పోకుండా వనరులకు నింపడంపై ఇరిగేషన్ ఎస్ఈ నాగ మురళీ మురళీమోహన్ గురువారం ఎన్నెస్పీ ఈఈ, డీఈలతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.

పేదల ఆకలి తీరుస్తాం

త్వరలో అన్నక్యాంటిన్లు ప్రారంభం
ఒంగోలులో అన్న క్యాంటీన్లను పరిశీలించిన మునిసిపల్ మంత్రి



అన్న క్యాంటిన్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 18: పేదల ఆకలి తీర్చేందుకు తక్కువ ధరకే నాణ్యమైన భోజనం అందజేస్తామని రాష్ట్ర పట్టణ, పురపాలక శాఖ మంత్రి పొంగూరి నారాయణ తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన ఒంగోలులో పర్యటించారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో కలిసి నగరంలోని అన్నక్యాంటీన్లను, పోతురాజు కాలువను పరిశీలించారు. తొలుత పోతురాజు కాలువ, అనంతరం పవర్ ఆఫీస్, కొత్తపట్నం బస్టాండ్ సెంటర్, కలెక్టరేట్ ఎదురు ఉన్న అన్నక్యాంటీన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సైకో పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తం చేశారన్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీలు అధ్వానంగా మారాయన్నారు. సీఎం జగన్‌మోహన్ టీడీపీపై కక్షసాధింపు చర్యలు చేపట్టారన్నారు. అయితే పేదవారు ఏం పాపం చేశారని అన్న క్యాంటీన్లను తొలగించారని ప్రశ్నించారు. త్వరలోనే తిరిగి అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించేందుకు సీఎం కసరత్తు చేస్తున్నారని తెలిపారు. పారిశుధ్యం మెరుగు, మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగు కోసం రాష్ట్రంలో కాలువ పూడికతీత పనులకు రూ.50 కోట్లు నిధులు కేటాయించినట్లు తెలిపారు. అన్నీ కార్పొరేషన్లలో, మున్సిపాలిటీలలో కాలువ పూడికతీత పనులు వేగవంతం చేయాలని తెలిపారు.

పోతురాజు కాలువ ఆధునికీకరణ

ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ పోతురాజు ఆధునికీకరణకు టీడీపీ హయాంలో రూ.89కోట్లు నిధులు మంజూరు కాగా, వైసీపీ ప్రభుత్వం మూడు సార్లు రివర్సు టెండర్లు పిలిచినా వైసీపీ నేతలు పనులు పూర్తి చేయలేకపోవడంతో ఆ పనులు రద్దయ్యాయన్నారు. నగరంలో డ్రైనేజి వ్యవస్థ మెరుగుపడాలంటే పోతురాజు బాగు అవసరం అన్నారు. అందుకోసం మరలా డీపీఆర్ తయారుచేసి, అవసరమైన నిధులను కోరుతామన్నారు. అలాగే నగరంలో మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరుస్తామని స్పష్టం చేశారు. నగర సుందరీకరణ కోసం అవసరమై నిధులు కోరుతామని, అయితే గత వైసీపీ పాలనలో రాష్ట్ర ఖజానా ఖాళీచేసి, పట్టణాలను అస్తవ్యస్తం చేశారన్నారు. దశల వారీగా నగర అభివృద్ధి కోసం అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలపై కమిషనరు ఎం. జశ్వంతరావు, ఎంఈ జానీబాషాను అడిగి తెలుసుకున్నారు.

నగర అభివృద్ధికి నిధులు కోరిన మేయర్

ఒంగోలు నగరంలో పలు అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరుచేయాలని మేయర్ గంగాడ సుజాత మంత్రి నారాయణను కోరారు. గురువారం మంత్రిని స్థానిక కొత్తపట్నం బస్టాండ్ వద్ద ఆమె కలిశారు. ఈ సందర్భంగా మేయర్ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో మాట్లాడారు. నిధుల విషయమై ప్రస్తావించగా ఐదేళ్లలో ఖజానా మీ పార్టీనే ఖాళీ చేసింది. ఆ విషయం మీకు కూడా తెలుసు అని చమత్కరించారు. అయితే నిధులు రాబడి, సౌలభ్యతను బట్టి పరిశీలిస్తామని మంత్రి తెలిపారు.



చోరీల నిరోధంపై చర్చిస్తున్న విద్యుత్, పోలీస్ అధికారులు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై నిఘా

- దొంగలను పట్టుకునేందుకు రెండు బృందాల ఏర్పాటు

అద్దంకి, జూలై 18 : విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ల చోరీల నిరోధానికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని విజిలెన్స్ సీఐ బీటీ నాయక్ అన్నారు. అద్దంకి డివిజన్ పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల చోరీలు బాగా పెరిగిన నేపథ్యంలో గురువారం స్థానిక శింగరకొండ రోడ్డులోని విద్యుత్ భవన్‌లో విద్యుత్, పోలీస్ అధికారులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. నేరస్థులను పట్టుకోవటానికి, పాత నేరస్థుల కదలికలపై నిఘా పెట్టడానికి, దొంగతనాలు జరగకుండా అరికట్టేందుకు రెండు బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. సమావేశం లో సీఐ కృష్ణయ్య, విద్యుత్ డీఈఈ సత్యనారాయణ, ఏఈ శివప్రసాద్ పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ అద్దె బస్సు

అద్దంకి, జూలై 18 : ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఆర్టీసీ అద్దె బస్సు ఢీ కొట్టింది. స్థానికుల కథనం మేరకు అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్ సమీపంలో గురువారం మధ్యాహ్నం వేలమూరిపాడు క్రాస్ రోడ్డు వద్ద మలుపు తిరి గేందుకు లారీ ఆగింది. ఒంగోలు నుంచి అద్దంకి వైపు వస్తున్న ఆర్టీసీ అద్దె బస్సు ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఆ సమయంలో బస్సులో 11 మంది ప్రయాణికులు ఉన్నప్పటికీ ఎలాంటి గాయాలు కాలేదు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- ఎంపీ పురందేశ్వరి

కారంచేడు (పర్చూరు), జూలై 18 : గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసే విధంగా కార్యకర్తలు, నాయకులు ప్రణాళికాబద్ధంగా కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురుందేశ్వరి అన్నారు. గురువారం కారంచేడు గ్రామంలోని ఆమె నివాసంలో పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అమ్మ కోసం ఒక చెట్టు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొక్కలు నాటాలని శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా మండలాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గత పాలకుల పాపం..జనానికి కష్టం!

కొత్తపట్నంలో అసంపూర్తిగా సిమెంటు రోడ్డు నిర్మాణం
నిధులు లేకుండానే పనులు చేపట్టి మధ్యలో నిలిపేసిన అధికారులు
రాకపోకలకు నిత్యం నరకయాతనే

కొత్తపట్నం(ఒంగోలునగరం), జూలై 18: అధికారుల అనాలోచిత నిర్ణయం.. ఓట్ల కోసం వైసీపీ నేతల కుట్ర... ఫలితంగా ఆ రోడ్డు పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. ఎన్నికలకు ముందు విశాలమైన రోడ్డును కొత్తపట్నంలో నిర్మిస్తామని హడావుడిగా పనులు ప్రారంభించారు. ఎన్నికల అనంతరం రోడ్డు పనులను మధ్యలోనే వదిలేసి పలాయనం చిత్తగించారు. దీంతో కొత్తపట్నం నడిబొడ్డులో నిత్యం రద్దీగా ఉండే ఆ రోడ్డు పనులు మధ్యలోనే ఆగిపోయి రాకపోకలకు పూర్తి అవరోధంగా మారింది. ఎన్నికలకు ముందుకు నాటి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఎన్నికల స్టంట్‌గా ఈ రోడ్డు పనులను వాడుకున్నారు. తగినన్ని నిధులు లేకుండానే డబుల్ రోడ్డు నిర్మాణ పనులను హడావుడిగా డిజైన్ చేసి అధికారులు చేపట్టారు. కొత్తపట్నంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఊరి చివరి వరకు డబుల్ సిమెంటు రోడ్డు పనులను మొదలుపెట్టారు. పెద్ద రోడ్డు నిర్మించి మధ్యలో డైవైడర్ ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు పనులను ఎన్నికలకు ఖచ్చితంగా నెలరోజుల ముందు ఆర్భాటంగా ప్రారంభించారు. ఇందుకోసం గ్రామంలోని మెయిన్ రోడ్డులో ఉన్న ఖరీదైన భవనాలను సైతం కూల్చేశారు.



చిన్నపాటి వర్షానికే రొచ్చురొచ్చుగా మారిన బీచ్ రోడ్

వైసీపీ శ్రేణులే కూల్చేశాయి

సంబంధింత అధికారులు లేకుండానే వైసీపీ కార్యకర్తలు, స్థానిక నాయకులు మూకుమ్మడిగా రోడ్డుపక్కన ఉన్న భవనాలను కూల్చేశారు. ఆక్రమణలను తొలగిస్తున్నామంటూ పార్టీ నాయకులే దొమ్మిగాపోయి భారీ కట్టడాలను కూల్చేశారు. అయితే తర్వాత పనులు చేపట్టి ఎన్నికల కౌంటింగ్ అయిన వెంటనే అర్థంతరంగా ఆపేశారు. కొత్తపట్నం గ్రామం మధ్యలో రెండు వైపులా సిమెంటు రోడ్లు వేసి మధ్యలో డైవైడర్ ఏర్పాటు చేయాల్సిన ప్రాంతంలో ఖాళీగా వదిలేశారు. ఇదేంటని అడిగితే నిధులు లేవు అంటూ ఆర్అండ్‌బీ అధికారులు సమాధానమిస్తున్నారు. అటూఇటూ వేసిన సింగిల్ సిమెంటు రోడ్డు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వాటి మధ్యలో చెరువు బంక మట్టి పోశారు. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ మట్టి జారీపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. కొందరు వాహనదారులు పడిపోయారు కూడా. రెండు రోడ్లకు మధ్యలో వాన నీరు నిలబడి దోమల వ్యాప్తికి కారణమవుతోంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వానలకు కొత్తపట్నంలోని మండల కార్యాలయాల సముదాయం నుంచి బీచ్ రోడ్డులో నల్లూరి గార్డెన్స్ వరకు రోడ్డు బురదతో రొచ్చురొచ్చుగా మారింది. బంక మట్టి కావటంతో వాహనాలు జారిపోయి రోజులో పదికి పైగా ప్రమాదాలు జరుగుతున్నాయి.



కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో
అసంపూర్తిగా నిలిచిపోయిన సిమెంటు రోడ్ల మధ్య నిలిచిన నీరు

నేతలు చెప్పారని.. నిధులు లేకుండానే పనులు

ఈ రోడ్డు నిర్మాణంలో ఆనాటి ఎమ్మెల్యే బాలినేని ఆదేశాలతోనే ఆర్అండ్‌బీ అధికారులు నిధులు తగినన్ని లేకుండానే పనులు చేపట్టారు. పూర్తిచేయకుండా మధ్యలో నిలిపివేసి నేడు ప్రజలు పడుతున్న అవస్థలకు కారణమయ్యారు. కొత్తపట్నంలోని మండల కార్యాలయాల నుంచి హైస్కూలు వరకు తారు రోడ్డు, అంబేడ్కర్ నగర్ నుంచి నల్లూరి గార్డెన్స్ మీదుగా పల్లెపాలెం వరకు తారు రోడ్డును ప్రతిపాదించారు. అయితే ప్రభుత్వం నుంచి తొలుత పంపిన ప్రతిపాదనల మేరకు రూ.2.70 కోట్లు మంజూర య్యాయి. పాత డిజైన్‌లో గ్రామం మధ్యలో నిర్మించాల్సిన సిమెంటు రోడ్డులో డివైడర్ లేదు. రోడ్డును వెడల్పు చేసి డివైడర్ ఏర్పాటు చేయాలనుకుంటే ఆర్అండ్‌బీ అధికారులు డిజైన్ మార్చి ప్రభుత్వానికి ప్రతిపాదనలను మళ్లీ పంపి నిధులు విడుదలయ్యాక పనులు చేపట్టాల్సి ఉంది. అలా చేయకుండా ఎన్నికలకు ముందు హడావుడిగా శంకుస్థాపన చేయించి పనులను ప్రారంభించారు. ఈ రోడ్డును పూర్తి చేసి కొత్తపట్నం రూపురేఖలు మార్చుతామంటూ బాలినేనితోపాటు స్థానిక వైసీపీ నాయకులు కూడా ఊదరగొట్టేశారు. ఆర్భాటంగా పనులు చేపట్టి నిధులు లేక మధ్యలోనే ఆపేశారు. దీంతో రెండు నెలలుగా కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ నుంచి అంబేద్కర్ నగర్ వరకు ట్రాఫిక్ నిత్యం నిలిచిపోతూనే ఉంది. వాహన చోదకులు ఈ ప్రాంతంలో నడపాలంటే భయపడిపోతున్నారు. రోడ్డు బురదమయంగా మారటంతో కొత్తపట్నంలోని రోడ్డు పక్కన నివాసగృహాల్లో ఉన్న వారు నిత్యం నరకం చూస్తున్నారు.

మట్టి తవ్వితే కేసులే

- ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్ హెచ్చరిక
- రిజర్వ్ ఫారెస్ట్ భూమిగా బొబ్బేపల్లి గ్రావెల్ కొండ
- హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన అటవీశాఖ
- లీజు పేరుతో కొల్లగొట్టిన వైసీపీ నేతలు
- దోచుకున్నవారిపై చర్యలకు పట్టు

మార్టూరు, జూలై 18 : ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఇసుక, మద్యం, గ్రావెల్, గ్రానైట్, రేషన్ బియ్యం తదితర రంగాలలో వేలకోట్ల రూపాయలను అక్రమంగా దోచుకొని, దాచుకున్న ఆ పార్టీ నాయకుల కబంధహస్తాల నుంచి ఆయా రంగాలను టీడీపీ కూటమి ప్రభుత్వం విముక్తి కల్పిస్తోంది. రాష్ట్ర అటవీ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో ఆక్రమణకు గురైన అటవీ భూములపై అధికారులు దృష్టిసారించారు. మార్టూరు మండలంలోని బొబ్బేపల్లి గ్రావెల్ కొండను రిజర్వ్‌ఫారెస్ట్ భూమిగా జిల్లా అటవీ శాఖాధికారులు గుర్తించినట్లు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్ గురువారం విలేకరులకు తెలిపారు. ఇప్పటిదాకా ఈ గ్రావెల్ కొండపై ఎంతోమంది అక్రమ తవ్వకాలు చేపట్టి కోట్లు కొల్లగొట్టారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే అటవీ భూములను గుర్తించే పనిలో భాగంగా బొబ్బేపల్లి గ్రామంలోని సర్వే నంబరు 387-సీ11లోని కొండపై ఉన్న 357 ఎకరాలు 27 సెంట్లు భూమిని 23-10-1894న మద్రాసు ఫారెస్టు యాక్టులో రిజర్వ్ ఫారెస్ట్‌గా నమోదైన విషయం వెలుగులోకి వచ్చింది. దాంతో అటవీ శాఖాధికారులు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్, వేటపాలెం సెక్షను ఆఫీసర్ వై.జాన్సన్ రెండు రోజుల నుంచి బొబ్బేపల్లి కొండను పరిశీలించారు. ఈ కొండపై ఇక నుంచి ఎలాంటి అక్రమ తవ్వకాలు చేయకూడదని, ఇది రిజర్వ్ ఫారెస్ట్ భూమి అని హెచ్చరిస్తూ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.


తవ్విన కొండను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

ఆక్రమణదారులకు బంగారుబాతు

బొబ్బేపల్లి గ్రావెల్ కొండ ఆక్రమణదారులకు బంగారుబాతుగా మారింది. జగన్‌రెడ్డి పాలనలో లీజుదారులు అనే వంకతో కొండను కొల్లగొట్టారు. మట్టిని తవ్వి లక్షలు ఆర్జించారు. కొండపై ఉన్న చర్చి, గుడి పరిసరాలను కూడా వదల్లేదు. పొలాలకు రైతులు వెళ్లే మట్టిరోడ్లను, కొండ అంచున ఉన్న పొలాలను కూడా తవ్వేసి ఎర్ర మట్టిని అమ్ముకున్నారు. సుమారు 150 ఎకరాలు కొండ ప్రాంతాన్ని తవ్వి దోచుకున్నారు. వైసీపీకి చెందిన రాజకీయనాయకులకు, కాంట్రాక్టర్లకు మండల స్థాయి రెవెన్యూ అధికారులు అండగా ఉండడంతో కొండపైన మట్టిని తోడేశారు. ఏడాది కిందట కొండ నుంచి ఎలాంటి మట్టితవ్వకాలు జరపరాదని, లీజుదారులకు వారి లైసెన్సులను రద్దు చేయాలని గ్రామ పంచాయతీ పాలకవర్గం ఏకంగా గ్రామ సభలో తీర్మానం చేసింది. కానీ దానిని అధికారులు పట్టించుకోలేదు. వందలాది టిప్పర్లు, లారీలు ద్వారా మట్టిని తరలించేటపుడు గ్రామంలోని అంతర్గత రహదారులు కూడా దెబ్బతిన్నాయని దాంతో గ్రామం మీదుగా వాహనాలు రాకూడదని పంచాయతీ వారు అడ్డుకట్టవేశారు. అయినా అక్రమంగా గ్రావెల్‌ను కొల్లగొట్టడంతో కొండ ప్రాంతం భారీ గుంతలుగా ఏర్పడింది..


కొండ వద్ద ఫారెస్ట్ శాఖ ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

కేసులు నమోదు చేస్తాం

బొబ్బేపల్లి కొండను రిజర్వ్ ఫారెస్ట్‌గా గుర్తించారు. ఈ కొండపై ఎవరైనా మట్టిని తవ్వితే అటవీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తాం. రెవెన్యూ అధికారులకు కూడా ఈ విషయాన్ని తెలియజేశాం. లీజుదారులకు తవ్వే అనుమతి లేదు.

- రమేష్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్

మట్టిని తవ్విన వారి నుంచి డబ్బులు వసూలు చేయాలి

ఎంతో కాలం నుంచి బొబ్బేపల్లి గ్రావెల్ కొండ నుంచి గ్రావెల్‌ను తరలించి లక్షల రూపాయలను సంపాదించారు. లీజు పొందిన చోట కాకుండా ఇతర ప్రదేశాలలో కూడా మట్టిని తవ్వి డబ్బులు సంపాదించారు. గ్రామ పంచాయతీ కి పైసా కూడా ఆదాయం రాలేదు. కొండ మట్టిని అమ్ముకున్న వారందరిపై కేసులు నమోదు చేయాలి. వారి నుంచి అటవీశాఖ అధికారులు డబ్బులు రికవరీ చేయాలి. ఈ విషయంలో కోర్టును ఆశ్రయిస్తాం.

- తాళ్లూరి లావణ్య, సర్పంచ్ బొబ్బేపల్లి


దుకాణాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు వీరయ్య

తక్కువ ధరకే బియ్యం, పప్పు

చినగంజాం, జూలై 18 : పౌరసరఫరాల శాఖ ద్వారా పేద, మధ్యతరగతి, వర్గాల ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన సరుకులు అందిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య అన్నారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో మార్కెట్ సెంటర్‌లో రాయితీపై బియ్యం, కందిపప్పు విక్రయించే దుకాణాన్ని గురువారం ఆయన టీడీపీ నాయకులతో కలిసి ప్రారభించారు. పెరిగిన నిత్యావసరాలను అదుపులోకి తెస్తామని ఇచ్చిన మాట ప్రకారం టీడీపీ కూటమి చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గీత, వీఆర్‌వో రాధిక, టీడీపీ నాయకులు టీ.జయరావు, చెరుకూరి రాఘవయ్య శ్రీనివాసరావు, బెల్లంకొండ రమేష్‌బాబు, రామసుబ్బారావు, శ్రీనివాసరావు, షేక్ జిలాని, భయ్యా సతీష్, పార్థసారిథి, ఏసునారాయణ పాల్గొన్నారు.

నేడు సమాచార హక్కు చట్టంపై సదస్సు

అద్దంకిటౌన్, జూలై 18 : అద్దంకి ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హల్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు వ్యవసాయశాఖకు సంబంధించి సమాచార హక్కు చట్టం కమిషనర్ చావల సునీల్ ఆదేశాల మేరకు అవగాహన సదస్సు జరుగుతుంది. ఈ సదస్సుకు మండల స్థాయి అధికారులు, ప్రజలు అందరూ పాల్గొన వచ్చునని వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకట కృష్ణ గురువారం ప్రకటనలో తెలిపారు.

యాచకుడిపైకి దూసుకెళ్లిన వాహనం

చీరాలటౌన్, జూలై 18 : దిక్కు మొక్కులేక యాచన చేసుకుని పొట్ట నింపుకుంటున్న యాచకుడి పైకి కారు దూసుకెళ్లింది. ఈ ఘటన గురువారం చీరాల రైల్వే స్టేషన్ ప్రాంగణంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం కంచర్ల సుబ్బారావు వృద్ధుడు. ఇతనికి నా అనేవారు లేరు. దీంతో చాలాకాలంగా యాచన చేసుకుని బతుకుతున్నాడు. ఈక్రమంలోనే యాచన చేసుకుని అన్నం కూడా యాచించి తెచ్చుకుని తింటుండగా రైల్వే కాంట్రాక్ట్ పనులు చేస్తున్న వాహనం యాచకుడి కుడి కాలుపైకి ఘోరంగా దూసుకెళ్లింది. కాలు నుజ్జునుజ్జయి రక్తపు మడుగయింది. స్థానికులు, పోలీసులు అక్కడికి చేరుకుని బాధితుడిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అంతేకాకుండా వాహనం స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బోట్లకు లైసెన్స్ తప్పనిసరి

చినగంజాం, జూలై 18 : ప్రతి బోటు యాజమాని తమ బోటుకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకొని, లైసెన్సులు తీసుకోవాలని ఫిషరీస్ అసిస్టెంట్ ఎన్.పుల్లారావు అన్నారు. పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని బాపయ్య నగర్ గ్రామంలో మత్స్య సాగు బడిపై గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన బోటు యాజమానులకు, మత్స్యకారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బోట్ల యాజమానులు రిజిస్ట్రేషన్, లైసెన్సు లేకుండా సముద్రంలో చేపల వేట చేయరాదని పుల్లారావు తెలిపారు. ఎమ్ఎస్ యాక్ట్-1958, ఏపీఎంఎఫ్ఆర్ యాక్ట్-1994పై, బోట్లకు రిజిస్ట్రేషన్, లైసెన్సులు ఎలా చేసుకోవాలి, వాటికి ఏమేమి పత్రాలు కావలసి ఉంటుంది అనే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సాగరమిత్ర జి.లావణ్య, బోట్ల యజమానులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

వలపర్ల హైస్కూల్లో నాటిన మొక్కలు


మొక్కలను నాటుతున్న వెంకటేశ్వర్లు

మార్టూరు, జూలై 18: మండలంలోని వలపర్ల జడ్పీ హైస్కూల్లో గురువారం ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ సునీల్ గౌతమ్ ఆదేశాలు మేరకు మొక్కలను నాటారు. ఎన్‌సీసీ అధికారి కేశినేని వెంకటేశ్వర్లు, చీరాల డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఎం.నిర్మల ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

వినియోగదారుల సంఘ జిల్లా అధ్యక్షుడిగా కరిముల్లా

మార్టూరు, జూలై 18 : జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా మండలంలోని వలపర్ల గ్రామానికి చెందిన సయ్యద్ కరిముల్లాను నియమించారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం అధ్యక్షుడు కే తిరుపాల్ తనకు నియామకపత్రం పంపినట్లు కరిముల్లా తెలిపారు.

కుష్టు నివారణకు కృషి చేయాలి


సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా వైద్యాధికారి విజయమ్మ

ఇంకొల్లు, జూలై 18 : కుష్టు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్యశాఖాధికారి విజయమ్మ సిబ్బందికి సూచించారు. గురువారం ఇంకొల్లు మండల పరిధిలో ఇడుపులపాడు, వంకాయలపాడు గ్రామాలలో పలు ప్రాంతాలను పరిశీలించారు. గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించి, వారి వివరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపడంతోపాటు వారికి అవసరమైన వైద్య సేవలను ఏఎన్ఎం, ఆశా, వైద్య సిబ్బంది అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కోటేశ్వరరావు, సూపర్‌వైజర్లు, ఆశాలు, ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

100మందికి గుండె పరీక్షలు

మార్టూరు, జూలై 18 : మండల పరిధిలోని కోలలపూడి గ్రామంలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం విజయవాడ హెల్త్ ఆస్పత్రి వారు ప్రజలకు ఉచిత గుండె పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ ఎం.సతీష్ కుమార్ ప్రారంభించారు. వైద్యులు 100 మందికి గుండె పరీక్షలను నిర్వహించగా, వారిలో 10 మందికి మెరుగైన పరీక్షలు నిర్వహించాలని, వారు విజయవాడకు రావాలని వైద్యులు సాయికుమార్ సూచించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కందిమళ్ల నిర్మల, అరుణకుమారి, రాధ పళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని పంచాయతీ సెక్రటరీ లక్ష్మి, అంజనీకుమారి పర్యవేక్షించారు.

సుబ్బారావు సేవలు మరువలేనివి

చినగంజాం, జూలై 18 : చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు ఎంఎన్‌వో సుబ్బారావు అందిస్తున్న వైద్య సేవలు మురవలేనివని పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.విజయభాస్కరరావు, పీ.సాయిశ్రీచరణ్ అన్నారు. పీహెచ్‌సీలో గ్రామస్థులు, వ్యాధిగ్రస్తులు వైద్యాధికారుల సమక్షంలో మేల్ నర్సింగ్ పమిడాల సుబ్బారావుని గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, వ్యాధిగ్రస్తులు షేక్ జిలాని, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, వీరరాఘవులు, నాగమల్లేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


సుబ్బారావును సన్మానిస్తున్న వైద్యాధికారులు


కేక్ కట్ చేస్తున్న కళాశాల ప్రతినిధులు

సెయింట్ ఆన్స్‌లో కన్వీనర్ కోటాలో 100 శాతం సీట్లు భర్తీ

వేడుకలు నిర్వహించిన కళాశాల ప్రతినిధులు

చీరాల, జూలై 18 : సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఏపీఈఏపీ సెట్-2024కు సంబంధించి కన్వీనర్ కోటాలో 100 శాతం సీట్లు భర్తీ అయినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. కన్వీనర్ కోటాలోని సీట్లన్నీ భర్తీ అయిన నేపథ్యంలో గురువారం కళాశాలలో వేడుకలు నిర్వహించారు. ముందుగా భారీ కేక్‌పై క్రాకర్స్ వెలిగించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో కన్వీనర్ కోటాలోని నూరుశాతం సీట్లు పూర్తి కావడం వెనుక యాజమాన్యంతో పాటు, అధ్యాపకుల కృషి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అందిస్తున్న ప్రోత్సాహం ఉందన్నారు. 2001లో మూడు కోర్సులతో 180 సీట్లతో ఫౌండర్ చైర్మన్ వనమా వెంకటేశ్వరరావు స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకు కళాశాల విజయపథంలో నడుస్తోందన్నారు. ఇప్పటి వరకు కళాశాలలో విస్తృతంగా పెరిగిన వివిధ కోర్సులు, విద్యార్థుల ఫలితాలు, ప్లేస్‌మెంట్స్ ఇలా ప్రతి అంశంలోనూ అంకిత భావంతో పనిచేస్తున్న తీరును వివరించారు. జిల్లాలో తమ కళాశాల ఫలితాలు, పురోగతిలో అధిగమించిన మైలురాళ్లను మననం చేశారు. అనంతరం విద్యార్థులు పెద్దఎత్తున బాణసంచా పేల్చి హర్షాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు సన్మానం


న్యాయవాదులను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, జూలై 18 : అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం అద్దంకిలోని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో న్యాయవాదులను సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు పి. ఉదయబాస్కర్, షేక్ మహమ్మద్ రఫీ, కొల్లు సురేంద్రబాబు, ఏజీపీ రమేష్‌బాబు, చిన్ని మురళికృష్ణ, గృహలక్ష్మిను రోటరీ సభ్యులు సత్కరించారు. భారతదేశంలో సామాన్యుడికి కూడా న్యాయ వ్యవస్థ అందుబాటులో ఉందని, చట్టం దృష్టిలో అందరు సమానమేని, పౌరులు చట్టాలను గౌరవించి మెలగాలని న్యాయవాదులు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య,సెక్రటరీ చుండూరి మురళి సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటాలు చేయాలి


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రతినిధులు

చీరాలటౌన్, జూలై 18 : దళితులు సంఘటితంగా సమస్యల పరిష్కారానికి పోరాడాలని పలువురు వక్తలు అన్నారు. గురువారం పట్టణంలోని ఓల్డ్ పీకాక్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన దళిత మహాసభ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం డా. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా ఉద్యమాలలో ఉజ్జీవం పోసి గెలుపు దిశగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. అలాగే నేటి యువతరం కూడా ఉద్యమ ఆశయాల సాధనకు తమవంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో దంత వైద్య నిపుణులు డా.అబ్రహం బ్లెస్సీ, మాచవరపు జూలియన్, పులిపాటి బాబురావు, దామర్ల శ్రీకృష్ణ, చుండూరి వాసు, ప్రకాష్, వాసు, మేరిగ రమేష్, రత్నం, రాజు, బాషా, యానీగ్రేస్, లావణ్య నాగేంద్ర మణి పాల్గొన్నారు.

హెల్మెట్‌తో సురక్షిత ప్రయాణం

అద్దంకి, జూలై 18 : హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణం చేయాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ద్విచక్రవాహనచోదకులు హెల్మెట్ వినియోగించటం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తూ గురువారం సాయంత్రం అద్దంకిలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సీనియర్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి స్థానిక కోర్టు భవనాల సముదాయం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగవెంకటలక్ష్మి మాట్లాడుతూ హెల్మెట్ ధరించక పోవడంవల్ల రోడ్డు ప్రమాదాలలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ద్విచక్ర వాహనచోదకులు సురక్షితంగా ఇంటికి చేరాలంటే తప్పనిసరిగా హెల్మట్ ధరించాలన్నారు. పాతబస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. మోటార్‌సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి సీత, అడిషనల్ జూనియర్ న్యాయాధికారి ప్రియదర్శిని, సీఐ కృష్ణయ్య, న్యాయవాదులు, పోలీసులు, న్యాయవాదుల గుమస్తాలు, పారా లీ గల్ వలంటీర్లు, ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల, హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

పేరాల(చీరాలటౌన్) : హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం వలన ప్రాణాపాయ స్థితి నుంచి రక్షిస్తుందని న్యాయాధికారి ఎం.సుధ అన్నారు. ఉన్నత న్యాయస్థానాల పిలుపు మేరకు గురువారం కోర్టు భవన సముదాయముల నుంచి నిర్వహించిన 1కే రన్‌ను న్యాయాధికారి జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సురక్షితమైన ప్రయాణాలపై దృష్టిసారించి ముందుకు సాగాలన్నారు. అలాగే మారిన చట్టాల కారణంగా భిన్నమైన ప్రయాణాలు సాగిస్తే జరిమానాలు భారీగా విధించనున్నట్లు సూచించారు. నిర్లక్ష్యమైన డ్రైవింగ్‌లతో కుటుంబాలు వీధిన పడుతాయని చెప్పారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే రెహనా, సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, న్యాయవాదులు ఈశ్వరిరెడ్డి, టూటౌన్ సీఐ సోమశేఖర్, మదీన్, ఇమ్మాని యేల్, తదితర న్యాయవాదులు, పోలీసులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న న్యాయాధికారి సుధ

హెల్మెట్ ధరించడం బాధ్యత

పర్చూరు : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం బాధ్యతగా గుర్తించాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.శాంతి అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం హెల్మెట్ ధరించడంపై న్యాయవాదులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కోర్టు భవనాల సముదాయం నుంచి న్యాయమూర్తి శాంతి జెండాఊపి ర్యాలీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హెల్మెట్ ధరించండి ప్రాణాలను కాపాడుకోండి అంటూ గ్రామ ప్రధాన వీధుల్లో ప్లకార్డులతో నినాదాలు చేశారు. అనంతరం బొమ్మల సెంటర్‌లో హెల్మెట్‌లను ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో పర్చూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్.రమణి, న్యాయవాదులు డి.రాఘవయ్య చౌదరి, ఓ.గోవిందరాజులు, రావి శ్రీనివాసరావు, పూరిమెట్ల జాన్‌బాబు, తులసి రాజేష్, కొమ్మాలపాటి రవి కుమార్, రుక్సానా, ఎస్సై జీవీ చౌదరి, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.


నోట్ పుస్తకాలను అందజేస్తున్న సభ్యులు

రోటరీ సేవలను వినియోగించుకోవాలి

అద్దంకిటౌన్, జూలై 18 : ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం అందించే వసతులతోపాటు రోటరీ క్లబ్ సభ్యులు అందించే సేవలను వినియోగించుకోవాలని ఎంఈవో బూదాటి సుధాకరరావు అన్నారు. గురువారం పట్టణంలోని రాజీవ్‌కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పాఠశాలకు బీరువ, విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. నాతాని రవీంద్రుడు సహకారంతో ఐరన్ బీరువాను అందజేశారు. తాళ్లూరి బాబూరావు మనుమడు పత్తిపాటి అభినవ్ పుట్టినరోజు సందర్భంగా నోట్‌పుస్తకాలు, పెన్నులతో పాటు స్వీట్లను పంపిణీ చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం కరి రామయ్య, రోటరీ సెక్రటరీ సీహెచ్.మురళిసుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, చిన్ని మురళి కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలను సత్కరించారు.


రైతులతో మాట్లాడుతున్న జేసీ సుబ్బారావు

అగ్రహారం భూములకు పట్టాలు

జేసీ సుబ్బారావు

సంతమాగులూరు, జూలై 18 : మండలంలోని అగ్రహారం భూములు సాగుచేస్తున్న రైతులకు పట్టాలను పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ సుబ్బారావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అగ్రహారం రైతులతో జాయింట్ కలెక్టర్ సుబ్బారావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ సంతమాగులూరు మండలంలో 1071 ఎకరాల అగ్రహారం భూములు ఉన్నాయని, వాటిలో రహదారులు పోను మిగిలిన 886 ఎకరాల భూమికి సంబంధించి మొత్తం 590 మంది రైతులకు పట్టాలు త్వరలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో బీ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

త్వరలో చేప పిల్లల పెంపకం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అద్దంకి, జూలై 18 : మండలంలోని చక్రాయపాలెం చేప పిల్లల పెంపక కేంద్రంలో త్వరలో చేప పిల్లల పెంపకం చేపట్టడం జరుగుతుందని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ సురేష్ గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన చేప పిల్లల పెంపకం అస్తవ్యస్థం అనే కథనానికి మత్స్యశాఖ అధికారులు స్పందించారు. భవనాసి చెరువు కు నీరు వచ్చిన వెంటనే చేప పిల్లల పెంపక కేం ద్రం లోని తొట్టెలకు నీరు నింపి చేప పిల్లల పెంపకం చేపట్టడం జరుగుతుందన్నారు. చేపి పిల్లల పెంపక కేం ద్రం ఆవరణ లో చిల్లచెట్ల ను త్వరలో తొలగించటం జరుగుతుందన్నారు.ఎపిఐయల్‌ఐపి పథకం ద్వారా భవనాసి చెరువు నుండి చేప పిల్లల పెంపక కేం ద్రం కు పైప్ లైన్ ఏర్పాటు కు ప్రతిపాదనలు పంపటం జరిగిందన్నారు.

10వేల సభ్యత్వాల నమోదు లక్ష్యం

- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాటే మన బాట
- పరిశీలకుడు ఆలా అనిల్

చీరాల, జూలై 18 : డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాటే మన బాటగా జనసేన పార్టీ కార్యకర్తలు, వీరమహిళలు సంయమనంతో అడుగులు వేయాలని, నియోజకవర్గంలో 10వేల సభ్యాత్వాల నమోదు లక్ష్యంగా కృషి చేయాలని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా ప్రోగ్రామ్ కన్వీనర్ ఆలా అనిల్ పిలుపునిచ్చారు. పార్టీ నాల్గవ విడత సభ్యత్వ నమోదు చీరాల నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన అనిల్ గురువారం వాడరేవు బస్టాండ్‌లో పార్టీ శ్రేణులతో కలసి జనసేన పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.500తో స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వ నమోదు, రెన్యువల్‌కు సంబంధించి అనుకున్న లక్ష్యాన్ని చేరేందుకు సమిష్టి కృషి అవసరమన్నారు. పార్టీలో సభ్య త్వం ఉన్న ప్రతి కార్యకర్తకు ప్రమాద బీమా అందిస్తున్న ఏకైన పార్టీ జనసేన అన్నారు. ఎన్డీఏ కూటమిలో భాగస్వామ్యంతోనే ముం దుకు సాగుతూ, పార్టీ బలోపేతంకు జనసైనికులు, వీరమహిళలు స్వయం ప్రతిపత్తితో ఆదర్శ సమాజానికి అడుగులు వేద్దామన్నారు. ఈ నెల 28వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో జనసైనికులు, వీరమహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరణ అనంతరం మాట్లాడుతున్న పరిశీలకుడు ఆలా అనిల్

ఇసుక కోసం తవ్వింది ఎంత?

- 18 చోట్ల తవ్వకాలపై విచారణ
- పరిశీలించి నివేదిక ఇవ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వం
- రంగంలోకి మైనింగ్ అధికారులు

నెల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఇసుక అక్రమాలపై కూటమి ప్రభుత్వం విచారణకు పూనుకుంది. గతంలో పేదలు పడ్డ ఇబ్బందులు, దోచుకున్న ప్రజా సంపదను దృష్టిలో పెట్టుకొని తాజాగా విచారణకు ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడెక్కడ తవ్వకాలు జరిపారు? ఎంత మేర ఇసుకను తరలించుకువెళ్లారు? పర్యావరణపరంగా ఎటువంటి ఇబ్బందులు కలిగించారు? వంటి వివరాలను పరిశీలించి నివేదిక పంపాలని జిల్లా అధికారులను ఆదేశించింది. జిల్లాలో 18 ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరిగినట్లు గుర్తించి, అన్నిచోట్ల క్షేత్రస్థాయి విచారణ జరపాలని జిల్లా అధికారులకు సూచించింది. గురువారం నుంచి మైనింగ్ అధికారులు ఆ పనిలో పడ్డారు. విచ్చలవిడిగా తవ్వకాలు జరిపిన ప్రదేశాల్లో సర్వే చేసి అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయో నిగ్గు తేల్చనున్నారు.

● ఇసుక అక్రమాలు నిజమే..!

జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు నిజమేనని ఈ ఏడాది ఫిబ్రవరిలోనే జిల్లా అధికారులు తేల్చారు. ఇసుక అక్రమ తవ్వకాలపై కొందరు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌ను (ఎన్జీటీ) ఆశ్రయించారు. ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్రం మొత్తం ఒకే ఫార్మాట్‌లో ఇసుక అక్రమ తవ్వకాలు జరగలేని నివేదికలు ఇవ్వగా జిల్లా అధికారులు మాత్రం అక్రమ తవ్వకాలు నిలిపేశామని నివేదిక అందజేశారు. అంటే అప్పటి వరకూ అక్రమ తవ్వకాలు జరిగాయని అధికారులే పరోక్షంగా ఎన్జీటీకి తెలిపారు. వాటిని పరిశీలించిన తాజా కూటమి ప్రభుత్వం అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశాలిచ్చింది. దీంతో మైనింగ్ అధికారులు ఎటువంటి నివేదిక ఇస్తారన్నది ఆసక్తిగా మారింది. అదే సమయంలో అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. కాగా మైనింగ్ డీడీ శ్రీనివాసకుమార్‌ను వివరణ కోరగా ఇసుక అక్రమ తవ్వకాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశాలు వచ్చిన మాట వాస్తవమేనని చెప్పారు. 18 ప్రాంతాల్లో విచారించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు.

వీఎస్‌యూ ఇన్‌చార్జ్ వీసీగా విజయభాస్కర్‌రావు



వెంకటాచలం, జూలై 18 : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ) ఇన్‌చార్జి ఉపకులపతిగా (వీసీ) డాక్టర్ సారంగం విజయ భాస్కర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి సౌరభ్‌గౌర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో ఫిజిక్స్ విభాగంలో విజయభాస్కర్ రావు విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి.







దర్గాలో బారాషహీదులను దర్శించుకుంటున్న భక్తులు





భక్తజనం తుళ్లింత సింహపురి పులకింత!

- బారాషహీద్ దర్గాకు పోటెత్తిన యాత్రికులు
- అర్ధరాత్రి తర్వాత గంధమహోత్సవం
- నేడు సీఎం చంద్రబాబు వర్చువల్ సందేశం



నెల్లూరు (సాంస్కృతికం) జూలై 18 : నెరవేరిన కోరి కలతో కొందరు.. కొత్త కోరికలతో ఇంకొందరు.. తొలిసారిగా మరికొందరు ఇలా భక్తజనం తరలిరావడంతో బారాషహీద్ దర్గా, స్వర్ణాల చెరువు ఘాట్ లు కిక్కిరిసిపోయాయి. దేశం నలుమూలల నుంచి రైళ్లు, బస్సులలో వస్తుండగా, సొంత వాహనాల్లో వస్తున్నవారితో నగరం జన సంద్రంగా మారింది. స్వర్ణాల చెరువుకు చేరుకున్న భక్తులు తమ కోర్కెలు తీరిన రొట్టెలను విడిచి మొక్కులు తీర్చుకున్నారు. కోర్కెల రొట్టెలు కావాల్సిన వారు వాకాబు చేస్తూ రొట్టెలను పట్టుకుంటుకున్నారు. ఆ తర్వాత బారాషహీద్‌లను దర్శించుకుని పూజలు చేశారు. పండుగ రెండు రోజుల్లోనే దాదాపు 3లక్షల మందికి పైగా భక్తులు వచ్చినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.



పండుగ ఏర్పాట్లను మ్యాప్ ద్వారా మంత్రి ఆనంకు వివరాలు తెలుపుతున్న కమిషనర్, పక్కన కలెక్టర్, ఎస్పీ



ఏర్పాట్లపై ఆరా తీస్తున్న మంత్రి నారాయణ

● మంత్రి ఆనం పరిశీలన

రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సాయంత్రం బారాషహీద్ దర్గాను సందర్శించారు. భక్తులకు అందుతున్న సౌకర్యాలు, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. విలేకరులతో మంత్రి మాట్లాడుతూ శుక్రవారం ఉదయం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా తన సందేశాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. భక్తులతోనూ ముఖ్యమంత్రి మాట్లాడతారని తెలిపారు. రొట్టెల పండుగ పట్ల చంద్రబాబుకు ప్రత్యేక అభిమానం ఉందన్నారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలతో పాటు కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, అదనపు కమిషనర్ శర్మద, ఇతర అధికారులు, ఫెస్టివల్ కమిటీ అధ్యక్షుడు ఖాదర్ బాషా తదితరులు మంత్రి వెంట ఉన్నారు. రాత్రి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి దర్గాలో పూజలు చేసి, అనంతరం భక్తులకు రొట్టెల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

అర్ధరాత్రి తర్వాత గంధమహోత్సవం

గురువారం అర్ధరాత్రి తర్వాత గంధ మహోత్సవం వైభవంగా జరిగింది. నగరంలోని కోటమిట్ట అమీనియా మసీదులో సయ్యద్ సమీహుసేనీ ఆధ్వర్యంలో మతపెద్దలు 12 బిందెల్లో గంధాన్ని కలిపారు. అక్కడ నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలో ఊరేగింపుగా బారాషహీద్ దర్గా ఆవరణలోని ఈద్గాకు గంధాన్ని చేర్చారు. అక్కడ ఫకీర్ల జరుపులు ప్రత్యేక దువా కార్యక్రమాలు నిర్వహించారు. పోలీసు బందోబస్తుతో పెద్ద గంధం బిందెను గుర్రంపై తీసుకుని దర్గాలోకి చేర్చారు. కడప పీఠాధిపతులు సయ్యద్ అరీఫుల్లా హుసేనీ, చిష్టీవుల్ ఖాదరి, సయ్యద్ సమీహుసేని ఇతర మత పెద్దలు బారాషహీద్‌లకు గంధం లేపనంతో పూజలు చేసి కొత్త గలీఫ్ కప్పారు. అనంతరం భక్తులకు గంధం ప్రసాదం పంచారు. ఈ కార్యక్రమం ముగియడంతో రొట్టెలపండుగా ప్రారంభమైనట్టు అయ్యింది. సుదూర ప్రాంతాల నుంచి రొట్టెలపండుగకు వచ్చిన భక్తులకు కొందరు స్వచ్ఛందంగా ఆకలి, దప్పికలను తీర్చుతున్నారు. తెలుగుదేశం నాయకుడు పి.చెంచలబాబు యాదవ్ దర్గాలో పూజలు చేసి, స్వర్ణాల చెరువులో మొక్కు చెల్లించుకున్నారు. గత సంవత్సరం రొట్టెల పండుగలో నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని తాను రొట్టెను పట్టుకున్నట్లు తెలిపారు.







హమ్మయ్య.. గట్టెక్కాం!

- ఇంజనీరింగ్ సీట్ల భర్తీపై ఊరట
- జిల్లాలో 81.3 శాతం భర్తీ
- నేటి నుంచి తరగతులు ప్రారంభం

నెల్లూరు (విద్య), జూలై 18 : చాన్నాళ్లకు జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీ ఆశాజనకంగా పూర్తయ్యాయి. వైసీపీ ప్రభుత్వం తీరువల్ల ఇంజనీరింగ్ సీట్లు భర్తీకాక కళాశాలలు వెలవెలబోయాయి. గతంలో జిల్లాలో 22 కళాశాలలు ఉండగా గత వైసీపీ ప్రభుత్వ వేధింపులు, ఫీజు రీఎంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం, ఫీజుల్లో కోతలు ఇలా అన్ని రకాల ఇబ్బందులతో కొన్ని కళాశాలలు మూతపడ్డాయి. ఈ ఏడాది కేవలం 14 కళాశాలలు మాత్రమే జిల్లాలో మిగిలాయి. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, పరిస్థితి కొంత మెరుగుపడటంతో ప్రమాణాలు పాటిస్తున్న కళాశాలల్లో మాత్రం ఆశావహంగానే సీట్ల భర్తీ కావడం గమనార్హం. ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపు పూర్తవడంతో ఆయా కళాశాలల్లో ఏ మేరకు భర్తీ అయ్యాయో స్పష్టత వచ్చింది. అర్హత ఉన్న విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించనుంది.



2024-25 విద్యా సంవత్సరానికి జిల్లాలో 14 ఇంజనీరింగ్ కళాశాలల్లో 8,722 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ సీట్లు ఉన్నాయి. ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థులు కళాశాల స్థితిగతులు, సౌకర్యాలు, ఫ్యాకల్టీలు, క్యాంపస్ ఇంటర్వ్యూలు తదితర విషయాలను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేసుకున్నారు. గత ఏడాది 22 కళాశాలల్లో 10,500 సీట్లకు గాను 3,408 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఈ ఏడాది మాత్రం 8,722 సీట్లకు 6,788 సీట్లు (81.03 శాతం) భర్తీతో కొంతమేర సంతృప్తి ఇచ్చిందని కళాశాలల యాజమాన్యాలు తెలిపాయి. ఇంటర్‌ను దిగ్విజయంగా పూర్తిచేసి ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించిన విద్యార్థులు ఇంజనీరింగ్‌లో చేరడానికి చేపట్టిన వెబ్ ఆప్షన్‌లు నమోదు ప్రక్రియ పూర్తయింది. ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు జులై 1 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించి పూర్తి చేశారు. 13వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ పూర్తి చేసుకోవడంతో 16న కళాశాలలు, బ్రాంచ్‌ల సీట్లు కేటాయింపులు జరిగాయి. సీట్లు దక్కించు కున్న విద్యార్థులు ఈ నెల 22వతేదీ వరకు సంబంధిత కళాశా లల్లో రిపోర్ట్ చేయను న్నారు. శుక్రవారం తరగతులు కూడా ప్రారంభం కానున్నాయి.

ప్రాంతం	కళాశాల పేరు	మొత్తం సీట్లు	భర్తీ
నెల్లూరు	నారాయణ	624	613
గూడూరు	నారాయణ	528	513
కోవూరు	గీతాంజలి	768	744
కావలి	ఆర్ఎస్ఆర్	480	455
వాకాడు	ఎన్బీకేఆర్	1104	982
కావలి	పీబీఆర్ విశ్వోదయా	1248	1108
ఆత్మకూరు	ఆంధ్ర	216	175
కొడవలూరు	శ్రీవెంకటేశ్వర	1440	1117
గూడూరు	ఆదిశంకర	1368	828
సూళ్లూరుపేట	గోకులకృష్ణ	288	171
నెల్లూరు	ప్రియదర్శిని-2	48	17
కావలి	డీబీఎస్	235	29
వెంకటాచలం	క్యూబా	63	10
నెల్లూరు	ప్రియదర్శిని-1	312	16



హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

● జిల్లా న్యాయాధికారి యామిని

నెల్లూరు (లీగల్), జూలై 18: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని జిల్లా న్యాయాధికారి సీ.యామిని సూచించారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమంలో పాల్గొని న్యాయమూర్తులు చేపట్టిన ర్యాలీని యామిని ప్రారంభించి, మాట్లాడారు. వాహనాలు నడిపేటప్పుడు తమ విలువైన జీవితంతోపాటు కుటుంబ సభ్యులను కూడా మనసులో పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయాధికారులు జి.కబర్ధి, ఎల్.తేజోవతి, శ్రీనివాసరావు, ఎం.సరస్వతి, జీ.గీత, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారి సుమలత, లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి కె.వాణి, ప్రిన్సిపల్ సీనియర్ ఐ.కరుణ కుమార్, న్యాయాధికారులు ఎల్.లావణ్య, గండికోట దేవిక, శారదారెడ్డి, బి.అఖిల, వినోద్ కుమార్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీ.ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా కోర్టులో స్టాంపుల కొరత

జిల్లా కోర్టులో స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. నెల్లూరులో సుమారు 18 కోర్టుల వరకు ఉండగా, న్యాయవాదులకు 1, 2 రూపాయల స్టాంపుల అవసరం ఉంటుంది. అయితే, రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు వాటిని తెప్పించడంలో కాలయాపన చేస్తున్నారు. గూడూరు, నాయుడుపేట, కోవూరు వంటి ప్రాంతాల్లో మాత్రం ఇవి దొరుకుతున్నాయి. నెల్లూరులో కొరత ఏర్పడటానికి కారణాలు తెలియడంలేదు. ఫలితంగా న్యాయవాదులు రూ.5ల స్టాంపులను వాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రూ.1, 2ల స్టాంపులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు, న్యాయవాద గుమాస్తాలు కోరుతున్నారు.

అప్రమత్తం లేకుంటే రోగాలపాలే!

ఆత్మకూరు, జూలై 18: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుదలపై అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు దృష్టి సారించడం లేదు. దీంతో పారిశుద్ధ్యం గాడి తప్పింది. మురుగు కాలువలు దోమలకు నిలయంగా మారాయి. ప్రజలకు తాగునీటి సరఫరా చేసే వాటర్ ట్యాంకుల శుభ్రతను గాలికివదిలేశారు. ఈ క్రమంలో అంటువ్యాధులు ప్రబలయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. నియోజకవర్గంలోని మండలాల్లో ఇప్పటికే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. డ్రైనేజీలు సక్రమంగా లేక మురుగు నీటిలో దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలడానికి కారణమవుతున్నాయి.


ఆత్మకూరు: రామస్వామిపల్లిలో దోమలకు నిలయంగా మారిన పంటకాలువ

వింజమూరు: పట్టణం రోజురోజుకూ విస్తరిస్తూ అభివృద్ధి చెందుతున్న అక్రమ లే అవుట్లు విచ్చలవిడిగా వెలసివున్నాయి. ఈ లేఅవుట్లతో పంట కాలువలు కబ్జాకు గురయ్యాయి. కొన్ని కాలువలు అతి చిన్నవిగా మారాయి. ఉన్న చిన్న కాలువల్లో పూడిక తీయకపోవడంతో చెట్లు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. వర్షాకాలంలో ఈ కాలువల ద్వారా పోవాల్సిన నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయి పలు ప్రాంతాలు వర్షపు నీటితో నిండిపోతున్నాయి. ముఖ్యంగా బంగ్లాసెంటర్ వద్ద ఉన్న చెరువునకు ఆయ కట్టు లేనందున దాని కింద లేఅవుట్లు వెలిశాయి. కాలువలు లేకపోవడంతో ఉన్న కాలు వలను పట్టించుకోకపోవడం వలన ఆయా ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాలువలో పూడిక తీసి నీరును పోయేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


వింజమూరు: కాలువలో పెరిగిన చెట్లు

అవసరమైన ప్రతిపల్లెకు ఆర్టీసీ బస్సు

● ఉదయగిరిఎమ్మెల్యే కాకర్ల సురేష్


జెండా ఊపి ఆర్టీసీ బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి రూరల్, జూలై 18: నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో అవసరమైన ప్రతి పల్లెకు ఆర్టీసీ బస్సు నడిపేలా చర్యలు చేపడతామని శాసనసభ్యులు కాకర్ల సురేష్ తెలిపారు. గురువారం ఉదయగిరి ఆర్టీసీ డిపోకు కొత్తగా వచ్చిన హైదరాబాదు బీహెచ్ఈఎల్‌కు ఉదయగిరి నుంచి నడిపేందుకు ఏర్పాటు చేసిన రెండు సూపర్‌లగ్జరీలను డిపో మేనేజర్ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రయాణికులు, విద్యార్థుల సౌకర్యార్థం అవసరమైన ప్రతిచోటుకి ఆర్టీసీ బస్సు వెళ్లేలా ఉన్నతాధికారులతో చర్చిస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు త్వరలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తారని చెప్పారు. అందరి సహకారంతో ఉదయగిరి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వార్డులు, గదులను పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి సేవలను అడిగి తెలుసుకొన్నారు. వైద్యశాలలో ఎక్స్‌రే పని చేయడంలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో వివరాలు తనకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు రియాజ్, సందానీ, సజిల్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవతం చేయండి

ఏఎస్ పేట, జూలై 18: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ స్థాపించి 80ఏళ్లు పూర్తి చేసుకున్న సందరర్భంగా ఆగస్టు 10వ తేదీ నెల్లూరులోని టౌన్‌హాల్‌లో నిర్వహించే మహాసభను విజయవతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి సురేంద్రరెడ్డి తెలిపారు. గురువారం ఆయన పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ బాధ్యులు రామసుబ్బారెడ్డి, సభ్యులు శివకుమార్‌రెడ్డి, ఫణికుమార్, రాఘవరెడ్డి, ప్రసాద్, ప్రభుదాస్, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

వరికి.. నీటి ఇబ్బంది రాకుండా చర్యలు

అనంతసాగరం, జూలై 18: అనంతసాగరం చెరువు కింద వరిసాగు చేస్తున్న రైతులకు నీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం చెరువు మొదటి తూమును పరిశీలించారు. తూములో నెలకొన్న అడ్డంకులు తొలగింపునకు చేయాల్సిన పనులపై సిబ్బందికి సూచనలిచ్చారు. తూము ముందు ఇసుక బస్తాలతో రింగ్‌బండ్ వేసి శరవేగంగా పనులు చేసి పంటకు నష్టం వాటిల్లకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ ఖాదర్, రైతు సంఘం నాయకులు చల్లా శివారెడ్డి, కేతా శ్రీనివాసులురెడ్డి, మల్లెంకొండయ్య ఉన్నారు.

సోమశిలలో పందుల విహారం

అనంతసాగరం, జూలై 18: సోమశిల జలాశయం క్యాంపు కాలనీలో ప్రజలకన్నా ఇక్కడ పందుల సంఖ్య ఎక్కువగా ఉంది. అధికారులు కాలనీపర్యవేక్షణ మరువడంతో దూరప్రాంతాలకు చెందని పందులను తెచ్చి ఇక్కడ వదులుతున్నారని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంపులుగా పందుల సంచారంతో చిన్నారులకు ఎలాంటి ముప్పు వస్తుందో అని వాపోతున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సంగం, జూలై 18: స్థానిక మండల కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం మండలాధ్యక్షురాలు పద్మావతమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పాజీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న అన్నిశాఖల అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తామన్నారు. సమావేశానికి మండల ప్రాదేశిక సభ్యులు, సర్పంచులు, జిల్లా పరిషత్ సభ్యులతో పాటు అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

వైభవంగా గ్రామోత్సవం

వరికుంటపాడు, జూలై 18: తోటలచెరువుపల్లిలో మొహరం వేడుకల్లో భాగంగా గురువారం పీర్ల గ్రామోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. భారాహిమాం పీరును ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో అత్యంత భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు దారిపొడవునా వారుకడవలతో నీరు పోసి ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సాతువారిపల్లిలోనూ గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

ఉదయగిరి, జూలై 18: ఉదయగిరి ప్రాంతంలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులు వీడయంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఇబ్బందులు పడ్డారు. కొంతసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షంతో గ్రామాల్లో రోడ్లు చిత్తడిగా మారాయి.

వరికుంటపాడు: ఉదయం నుంచి ఉక్కపోతను తట్టుకోలేక విసుగెత్తిపోయిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో కొంతమేర ఉపసమనం కలిగించింది. మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల దృష్ట్యా ఉరుములు, మెరుపుల బీభత్సం నడుమ వర్షం కురిసింది.

ఆలయంలో ఆర్ఎం ప్రత్యేక పూజలు

వరికుంటపాడు, జూలై 18: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం కెనరా బ్యాంకు రీజనల్ మేనేజరు నాగరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్త పెండ్యాల సూర్యనారాయణ శాలువాలతో సన్మానించి స్వామి చిత్రపటాన్ని బహూకరించారు. అర్చకులు భార్గవ రామాచార్యులు, సీతారామాచార్యులు, బ్యాంకు మేనేజరు చంద్రశేఖర్, రీజనల్ కార్యాలయ అసిస్టెంట్ మేనేజరు చంద్రశేఖర్, శివరామిరెడ్డి, షేక్ పీరయ్య, పాల్గొన్నారు.


చిత్రపటాన్ని అందజేస్తున్న గ్రామస్థులు

యువనేత లోకేష్‌కు ప్రత్యేక అభినందనలు

వింజమూరు, జూలై 18 : కష్టాల్లో ఉన్న వారికి సాయం చేయడం యువనేత నారా లోకేష్ నైజమని, అదే అతిన్న ప్రజల అభిమాన నేతగా మార్చిందని జిల్లా తెలుగు యువనేత గణపం సుదర్శన్‌రెడ్డి తెలిపారు. పొట్టకూటి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లిన శివ అక్కడి కష్టాలను సోషల్ మీడియా ద్వారా యువనేత లోకేష్ చూసి చలించిపోయి శివను వారి కుటుంబసభ్యుల దగ్గరకు చేర్చడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు


ట్రాక్టర్ యజమానులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ డీఈ

ఉదయగిరి, జూలై 18: ఉదయగిరి, సీతా రామపురం మండలాల్లోని చెరువుల్లో మట్టిని అనుమతి లేనిదే తరలిస్తే చర్యలు తప్పవని డీఈ కందుకూరి చంద్రమౌళి హెచ్చరించారు. గురువారం స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో ట్రాక్టర్ యజమానులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనుమతి లేకుండా చెరువులో మట్టిని తరలిస్తే ట్రాక్టర్‌కు రూ.10వేలు, టిప్పర్‌కు రూ.50వేలు, జేసీబీకి రూ.లక్ష అపరాధ రుసుం విధిస్తామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గండి పాళెం జలాశయం మరమ్మతులకు రూ.43లక్షలతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామన్నారు. నిధులు మంజూరైతే కుడి, ఎడమ కాలువల తూములకు మరమ్మతులు చేపడతామన్నారు. సీతారామపురం ఊరచెరువు, మర్రి ఊట్ల రిజర్వాయర్ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వర్షాకాలంను దృష్టిలో ఉంచుకొని చెరువుల కట్టలు, అలుగులు పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏఈలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన ర్యాలీ

సంగం, జూలై 18: వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఈవోపీఆర్డీ అప్పాజీ తెలిపారు. గురువారం ఆయన స్థానిక కొత్తూరు పంచాయతీ, క్షేత్రస్థాయి వైద్య సిబ్బందితో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇళ్లలో చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చెత్త కుండీల్లో, పారిశుధ్య సిబ్బంది వచ్చినప్పుడు వాహనంలో వేయాలని సూచించారు. డయేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, కిషోర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక గురుకుల కళాశాల విద్యార్థినులకు గురువారం వైద్యాధికారి అశోక్ డయేరియాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్యామల, అధ్యాపకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి..

ఉదయగిరి రూరల్, జూలై 18: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి జే.అంజయ్య తెలిపారు. గురువారం బస్టాండ్ సెంటర్ నుంచి కోర్టు వరకు న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది, ప్రజలతో కలిసి హెల్మెట్ ధరించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. న్యాయస్థానాల ఆదేశాల మేరకు ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామారావు, మస్తాన్, తిరుపతయ్య, నాగార్జున పాల్గొన్నారు.

మంచినీటి ప్లాంటు పునరుద్ధరణ

ఉదయగిరి, జూలై 18: అప్పసముద్రంలో మూడేళ్లుగా మరమ్మతులకు గురైన మంచినీటి ప్లాంటును గురువారం దాతలు మద్దినేని పృథ్వీచౌదరి, సురభీలు సొంత నిధులతో పునరుద్ధరించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్, సర్పంచ్ చేజర్ల నాగరత్నమ్మల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. వారివెంట రమణయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జోరుగా అశ్లీల నృత్యాలు

వరికుంటపాడు, జూలై 18: అలివేలుమంగాపురంలో బుధవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అశ్లీల నృత్యాలను జోరుగా నిర్వహించారు. గ్రామంలో నిర్వహిస్తున్న పోలేరమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించినా పట్టించుకొనే నాథుడే కరువయ్యారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో నిరంతరంగా ఇలాంటి డ్యాన్సులను కొనసాగించారు. రాత్రి 12గంటల వరకు ఆరుమంది యువతులు సినిమా పాటలకు కుర్రాళ్లతో కలిసి స్టెప్పులు వేశారు. ఆపై మరో నలుగురు యువతులను ప్రత్యేకంగా పిలిపించి ప్రైవేట్ ఆల్బమ్‌లోని అసభ్య పదజాలంతో నిండిన పాటలకు అశ్లీలంగా డ్యాన్సులు వేయించారు. యాంకర్లు సైతం ద్వంద అర్థాలు వచ్చేలా వెకిలి చేష్టలతో మాట్లాడుతూ యువతను ఉత్సాహపరిచారు. ఆ సమయంలో అసహనానికి గురైన కొంతమంది మహిళలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇటీవల ఆండ్రావారిపల్లి ఎస్సీ కాలనీవాసులు నాగార్పమ్మ ఉత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమానికి అక్కడే కాపుకాచి ఆటంకం సృష్టించిన పోలీసులు ఇతర గ్రామాలపై ఎందుకు మౌనం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

సంగం, జూలై 18: ఆత్మకూరు తూర్పువీధికి చెందిన శివయ్య నెల్లూరు నుంచి ఆత్మకూరుకు వైపు స్కూటీపై వెళ్తుండగా మార్గమధ్యలో కావలి కాలువ వంతెనపై ఉన్న భారీ గుంతలో పడ్డాడు. ఆ సమయంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న వ్యాను శివయ్య, స్కూటీపై దూసుకుని ఈడ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో శివయ్యకు తీవ్రగాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి వెంటనే సంఘటనా స్థలం వద్దకు వచ్చి గాయపడిన వ్యక్తిని పోలీస్ వాహనంలో వైద్యశాలకు తరలించారు. వ్యాన్‌ను, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.


గాయపడిన శివయ్య

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జి.వెంకటరమణయ్య

అధికారుల గైర్హాజరుపై ఎంపీపీ ఆగ్రహం

- సమావేశానికి రాని వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం: ఎంపీడీఓ
- ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యశాఖలపై సుదీర్ఘ చర్చ
- సభ్యులు కాని వారు సమావేశహాలులో..
- సీట్లు లేక చెట్ల కింద వేములపాడు సర్పంచ్, పలువురు పంచాయతీ కార్యదర్శులు

జలదంకి, జూలై 19: మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ జి.వెంకటరమణయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ట్రాన్స్‌కో, ఆర్‌అండ్‌బీ, ఆరోగ్యశాఖ తదితర శాఖల అధికారులు గైర్హాజరవడంతో ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతలో ఎంపీడీఓ జోక్యం చేసుకుని సమావేశానికి రాని అధికారులపై మినిట్స్‌లో పొందుపరచి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడారు. వర్షాకాలం కావడంతో కార్యదర్శులు, ఏఎన్ఎంలు అప్రమత్తమై గ్రామాలలో శానిటేషన్, క్లోరినేషన్ చేయించాలన్నారు. గట్టుపల్లిలో తాగునీటి సమస్యలు ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని వాటిని వెంటనే పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్‌ను ఆదేశించారు. వ్యవసాయశాఖ ద్వారా రైతులకు అందే రాయితీ పచ్చిరొట్ట విత్తనాలు, కౌలురైతు ధ్రువీకరణపత్రాల విషయమై ఏఓ శైలజ సమావేశంలో సభ్యులకు వివరించారు. ఉద్యానవనశాఖ ద్వారా రైతులకు కూరగాయలసాగు, పండ్లతోటల సాగు, నీటికుంటల నిర్మాణం, మినీట్రాక్టర్లు, తైవాన్ స్ప్రేయర్లు రాయితీపై అందివ్వనున్నట్లు వింజమూరు ఉద్యానశాఖ ఏడీ సభ్యులకు వివరించారు. అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందే పౌష్టికాహారం వివరాలను సభ్యులకు వింజమూరు సీడీపీఓ వివరించారు. వైద్యశాఖ ద్వారా రోగులకు అందే సేవల గురించి గట్టుపల్లి పీహెచ్‌సి వైద్యాధికారి సభ్యులకు తెలిపారు. సాగునీటి చెరువుల నీటినిల్వలు, కట్టలు, తూముల పరిస్థితిపై ఏఈ రోజ్‌మేరి వివరించారు. విద్యాశాఖ తరుపున ప్రభుత్వం నుంచి అందే పీఎం పోషణ, విద్యానరికారాల విషయమై ఎంఈఓ-2 నాగేశ్వరరావు సమావేశంలో చర్చించారు. సమావేశహాలులో సభ్యు లు కాని వారు ముందుగా వచ్చి కుర్చీలలో కూర్చోవడంతో సమావేశహాలు నిండిపోయింది. దీంతో వేములపాడు సర్పంచ్ బి.వి క్రిష్ణారెడ్డి, పలువురు పంచాయతీ కార్యదర్శులు కార్యాలయం బయట చెట్ల కింద వేసిన కుర్చీల్లో కూర్చుని ఉండిపోవాల్సి వచ్చింది. సమావేశంలో వైస్‌ఎంపీపీ పాలవల్లి మాలకొండారెడ్డి, మేకల ధనమ్మ, తహసీల్దారు వాసు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

● సీనియర్ సివిల్‌జడ్జి శోభారాణి



హెల్మెట్‌పై అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి శోభారాణి, జూనియర్ సివిల్‌జడ్జి పెళ్లకూరు పూర్ణిమాదేవి

కందుకూరు, జూలై 18: మోటార్ బైకులు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించా లని కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి ఏ శోభారాణి పేర్కొ న్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం కందుకూరులో హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెల్మెట్ ధరించి ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని, విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పెళ్లకూరు పూర్ణిమాదేవి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలి

లింగసముద్రం, జూలై 18: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ కె శ్రీనివాసులు సూచించారు. గురువారం మండలంలోని ముత్యాలపాడు, పెదపవని 1, 2, పెంట్రాల సచివాలయాలను ఎంపీడీఓ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించా రు. అనంతరం ఆయన మాట్లా డుతూ ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, మంచినీటి ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయించాలన్నారు. అలాగే సచివాలయ సిబ్బందికి పిఆర్ ఒన్ యాప్, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనకు సంబంధించి వివరించి, అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ముత్యాలపాడులోని మంచినీటి ట్యాంకును పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసినఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు

కావలి, జూలై 18: కావలి ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులుగా ఎంపికైన చవల రామకృష్ణ, ఆత్మకూరి నాగలక్ష్మీలు గురువారం సాయంత్రం ముసునూరులోని ఎమ్మెల్యే నివాసంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాలు ధన్యవాదాలు తెలిపారు. తమపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి ప్రభుత్వవైద్యశాలలో పేదలకు వైద్యసేవలందేలా చూస్తామన్నారు.

● **వైసీపీ హయాంలో భూదందాలు**

వైసీపీ హయాంలో భూదందాలు, సహజవనరుల దోపిడీకి అడ్డూ అదుపూ లేకుండా పోయిందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి క ప్రకటనలో తెలిపారు. ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు, దోపిడీలపై వాస్తవాలను ప్రజలకు తెలియజే సేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రాలను విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. కావలిలో జగనన్న కాలనీల పేరుతో చేపట్టిన భూసేకరణలో భారీ అవినీతి జరిగిందన్నారు.

ఆల్ మైనార్టీస్ ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్రప్రధాన కార్యదర్శిగా మునీర్‌జాన్



కావలిటౌన్, జూలై 18: ఆంధ్రప్రదేశ్ ఆల్ మైనార్టీస్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షేక్ మునీర్‌జాన్ నియమితులయ్యారు. విజయవాడ గొల్లపూడిలోని సమాఖ్య కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కె.రజాక్ మునీర్‌జాన్‌కు నియామకపత్రం అందజేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న కావలికి చెందిన మునీర్‌జాన్ మాట్లాడారు.

11కేవీ లైను తెగిపడి రెండు గేదెల మృతి

కొండాపురం, జూలై 18: 11కేవీ లైను తెగిపడి రెండు గేదెలు మృతిచెందిన ఘటన గురువారం తూర్పుఎర్రబల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఉక్కు మాలకొండయ్య తన గేదెలను మేత మేపుకునేందుకు పొలాలకు తోలుకెళ్లాడు. పొలాల్లో 11కేవీ లైను తెగిపడి కింద ఉన్నాయి. వాటిని రెండు గేదెలకు తాకడంతో మృతి చెందాయన్నారు. వీటి విలువ సుమారు రూ.1.30 లక్షలు అన్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.

తాగునీటి కోసం ఆందోళన


ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గట్టుపల్లి గ్రామస్థులు

జలదంకి, జూలై 18: గట్టుపల్లి తూర్పువీధికి రక్షిత మంచినీటి ట్యాంకు ద్వారా కొంతకాలంగా తాగునీరు సరఫరా కావడం లేదని గ్రామస్థులు గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సమస్యపై పలుదఫాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. అనంతరం ఎంపీడీఓ రామచంద్రకు వినతిపత్రం అందజే శారు. సమస్యను జఠిలం అయితే వచ్చే సోమవారం నెల్లూరులోని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు దమ్ము దర్గాబాబు, దానం రమేష్, మొద్దు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ


దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జూలై 18: సక్షమ్ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వ సహకారంతో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం గురువారం కందుకూరులో నిర్వహించారు. పట్టణంలోని కోవూరు రోడ్డులోని స్వర్ణ స్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఉపకరణాలను అందజేశారు. ఎనిమిది మందికి బ్యాటరీ ట్రైసైకిల్స్, ఆరుగురికి వినికిడి యంత్రాలు, ఐదుగురికి వీల్‌ఛైర్స్, చంక కర్రలు, హెల్మెట్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషిచేస్తోంద న్నారు. కార్యక్రమంలో సక్షమ్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు చెన్నా రామాంజనేయులు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జనసేన సభ్యత్వ నమోదు

లింగసముద్రం, జూలై 18 : మండలంలో శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంగులూరి నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అభిమానులు, మెగా అభిమానులు తప్పనిసరిగా భాగస్వామ్యం కావాలని కోరారు. సభ్యత్వ నమోదు కోసం ఫోటో, ఆధార్ నంబరు, ఫోన్ నంబర్, రూ.500 సభ్యత్వ రుసుము చెల్లించాలన్నారు. రెన్యువల్ కోసం రూ.500 చెల్లించాలన్నారు.

● **కలిగిరి:** జనసేన సభ్యత్వ నమోదును గురువారం నియోజకవర్గ సమన్వయకర్త కొట్టే వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ప్రారంభమైంది. జనసేన మండలాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాయకులు నిమ్మలపల్లి రామచైతన్య, రవీంద్ర, కమతం శ్రీనివాసులు, ఆరిమల్ల మల్లికార్జున, సంతోష్, జనసేన వీరమహిళ జిల్లెల్ల నాగలక్ష్మి, నందిపోగు రాజ్‌కుమార్, బండారు చరణ్ పాల్గొన్నారు.

నేడు పెదపవనిలో ఆధార్ సెంటర్ ప్రారంభం

లింగసముద్రం, జూలై 18 : మండలంలోని పెదపవనిలోని ఎస్టీ కాలనీలో శుక్రవారం ఆధార్ కేంద్రాన్ని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభిస్తారని తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి కూడా పాల్గొంటారని ఆయన తెలిపారు.

వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత అవసరం

బిట్రగుంట, జూలై 18: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కోవూరుపల్లి ఆరోగ్య కేంద్ర వైద్యులు జీహారిక, నిత్యప్రశాంతి తెలిపారు. బోగోలు మండలంలోని బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులతో గురువారం వారు ఆరోగ్య పరిస్థితి, పరిసరప్రాంతాల పరిశీలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టోర్, వంట, హాస్టల్ గదులతో పాటు భోజనశాలను సందర్శించారు. అనంతరం విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు చేసి సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చేతులు శుభ్రంగా కడుకోవాలని, చర్మవ్యాధులు వాటి లక్షణాలను వివరించారు. కార్యక్ర మంలో కళాశాల అధ్యాపకులు. ఆరోగ్య కేంద్ర సూపర్‌వైజర్ విక్టోరియా, సబ్ యూనిట్ అధికారి లక్ష్మీనరసయ్య, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

బిట్రగుంట, జూలై 18: బోగోలు మండలంలోని పలు పంచాయతీలో అక్రమ మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థా నికులు వాపోతున్నారు. పాతబిట్రగుంట, కొండబిట్రగుంట, విశ్వనాథరావుపేట, రామ స్వామి పాలెం, కొత్తూరు, తాళ్ళూరు, నాగులవరం, సోమేశ్వరపురం, ఎస్సీపాలెం తదితర గ్రామ పం చాయతీలో అధిక ధరలకు మద్యం విక్రయిస్తునట్లు సమాచారం. కొన్ని గ్రామాల్లో వేళపాలా లేకుండా కొత్త వ్యక్తులు మద్యం కోసం వస్తున్నట్లు గ్రామస్థులు మండిపడుతున్నారు.

ట్యాక్స్ బకాయిలు చెల్లించని గూడ్స్ వాహనాలు సీజ్ : ఎంవీఐ


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎంవీఐ రఫీ

కందుకూరు, జూలై 18: కందుకూరు ఎంవీఐ పరిధిలోని వందలాది గూడ్స్ వాహనాల యజమానులు ట్యాక్స్ బకాయిలు ఉన్నారని వారం తా తక్షణం బకాయిలు చెల్లించకుంటే వాహనాలు సీజ్ చేస్తామని ఎంవీఐ ఎస్‌కెఎండీ రఫీ తెలిపారు. కందుకూరు నియోజకవర్గ పరిధిలో 562 గూడ్స్ వాహనాలు, 602 ట్రాక్టర్ ట్రైలర్ పబ్లిక్ వాహనాలు, 56 మ్యాక్సీ క్యాబ్‌ల యజమానులు ట్యాక్స్ బకాయిలు ఉన్నారని తెలిపారు. తరచూ తనిఖీలు నిర్వహించి బకాయిలు ఉన్న వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందన్నారు. అలాగే వాహనం ఫిట్నెస్, పర్మిట్ ఇన్స్యూరెన్స్, పొల్యూ షన్, డ్రైవింగ్ లైసెన్సు లాంటి ధ్రువ పత్రాలు అందు బాటులో ఉంచుకోవాలని సూచించారు.

టీచరుకు డాక్టరేట్ ప్రదానం


బంకా శ్రీనివాసులు

అల్లూరు, జూలై 18: స్థానిక జిల్లా ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు బంకా శ్రీనివాసులుకు డాక్టరేట్ లభించింది. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో మనోవిజ్ఞాన శాస్త్రం (సైకాలజీ) విభాగంలో ప్రొఫెసర్ ఎస్.విశ్వనాథరెడ్డి పర్యవేక్షణలో ఆయన 'కాగ్నిటివ్ స్టైల్స్ ఇన్ రిలేషన్ టు క్రియేటివిటీ, మెంటల్ హెల్త్ అండ్ అడ్జస్ట్‌మెంట్ అమాంగ్ హైస్కూల్ స్టూడెంట్స్' అనే అంశంపై పరిశోధన చేసినందుకుగాను డాక్టరేట్ లభించినట్టు ఆ వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎం.దామ్లానాయక్ తెలిపారన్నారు.